ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

19-12-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 318 పేజీలు: 12 వెల: 6.50






గురువారం మస్కట్‌లో ఒమన్ సుల్తాన్ హైతం బిన్ తారిక్‌తో భేటీ అయిన ప్రధాని మోడీ

## భారత్, ఒమన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

### వ్యూహాత్మక సహకారంపైనా అంగీకారం

### ప్రధాని మోడీ సమక్షంలో ఎంఓయు

### మోడీకి అత్యున్నత ఒమన్ పురస్కారం

**మస్కట్, డిసెంబరు 18:** గల్ఫ్ దేశాలతో ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి ఒమన్‌తో భారత్ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం చేసుకుంది. ఈ క్రమంలో భారత్–ఒమన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. భారత్, ఒమన్ ప్రతినిధులు గురువారం మస్కట్‌లో ప్రధాని మోడీ సమక్షంలో ఈ డీల్‌పై సంతకాలు చేశారు. వ్యూహాత్మక సహకారానికి సంబంధించిన సంయుక్త >>2

# 'రిజిస్ట్రేషన్'లో కొత్త మార్పులు

### భూ కబ్జా ఫిర్యాదులపై వెంటనే నిర్ణయాలు తీసుకోవాలి

### 22ఎ భూములపై సర్వే జరపండి

### చెరువులన్నీ నీటితో నిండడం సంతోషకరం

### రెండోరోజు కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు



గురువారం సచివాలయంలో జరిగిన జిల్లా కలెక్టరుల సమావేశంలో సిఎం చంద్రబాబు, సిఎస్ విజయానంద్

**విజయవాడ,డిసెంబరు18,ప్రభాతవార్తప్రతినిధి:** రెవెన్యూ రికార్డులన్నీ ట్యాంపరింగ్ వీల్లేకుండా డిజిటలైజ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్ల విధానం, నీటి భద్రత వంటి విషయాలు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. 10 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసి తమను పంపించేశారని, అదనంగా రూపాయి కూడా తీసుకోలేదని తనకు ఫోన్ వచ్చిందని సిఎం చెప్పారు. అలాగే తిరుపతికి వెళ్తున్న మార్గంలో చెరువులన్నీ నీటితో నిండిపోయాయని, తమకు చాలా సంతోషంగా ఉందని, ఎనర్జీ లెవల్స్ కూడా పెరిగాయని తనకు చెప్పారని సిఎం గుర్తు చేశారు. ఇలాంటి ఫీడ్ బ్యాక్ వస్తున్నప్పుడే మరింత ఉత్సాహంగా పని చేయగలమని సిఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. సిఎం చంద్రబాబు అధ్యక్షతన రెండో రోజు కలెక్టర్ల సదస్సు కొనసాగుతోంది. ఈ సందర్భంగా వివిధ అంశాలపై తనకు వచ్చిన ఫీడ్ బ్యాక్‌ను కలెక్టర్ల కాన్ఫరెన్సులో పంచుకున్నారు. నెల్లూరుజిల్లా కలెక్టర్ ఇంటివెనుక అతి పెద్ద వాటర్ బాడీ ఉందని ఆయనకు >>2

## సిఎం చంద్రబాబుకు 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు 2లో

## ఢిల్లీలో సిఎం చంద్రబాబు

### నేడు ఆరుగురు కేంద్ర మంత్రులతో భేటీ

**విజయవాడ, డిసెంబరు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో చేపట్టిన వివిధ ప్రాజెక్టులకు కేంద్ర సాయంపై కేంద్ర మంత్రులతో చర్చించేందుకు సిఎం చంద్రబాబు గురువారం సాయంత్రం ఢిల్లీ వెళ్లారు. శుక్రవారం వరుసగా ఆరుగురు కేంద్ర మంత్రులతో సిఎం సమావేశం కానున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర జల్ శక్తి మంత్రి సిఆర్ పాటిల్, పెట్రోలియం సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి, కేంద్ర నౌకాయాన, జలరవాణా శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్‌తో భేటీ అవుతారు. తిరిగి శుక్రవారం రాత్రి అమరావతి చేరుకుంటారు.



గురువారం కోటిసంతకాల ప్రతులను గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు అందజేస్తున్న మాజీ సిఎం జగన్, బొత్స

## పిపిపికి వ్యతిరేకంగా కోటి సంతకాల ప్రతులు

### గవర్నర్ నజీర్‌కు సమర్పించిన మాజీ సిఎం జగన్ 2లో

## స్కూళ్లకు స్మార్ట్ కిచెన్ల ద్వారా ఆహారం

### కలెక్టర్ల సమావేశంలో మంత్రి లోకేష్



**విజయవాడ,డిసెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా అన్నిస్కూళ్లకు స్మార్ట్ కిచెన్ల ద్వారా ఆహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు.సచివాలయంలో జరుగుతున్న జిల్లా కలెక్టర్లుల సమావేశంలో నారా లోకేష్ మాట్లాడుతూ స్మార్ట్ కిచెన్ల నిర్మాణం కోసం భూములను పరిశీలించాలన్నారు. కడపలోని స్మార్ట్ కిచెన్ విధానాన్ని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కు చూపించామన్నారు. ఆయనకు ఈ విధానం నచ్చిందని అన్నారు. లోకేష్ ఆదేశాల మేరకు కడప జిల్లాలో చేపట్టిన స్మార్ట్ కిచెన్ ఫర్ ఆల్ ద స్కూల్స్ ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ వివరించారు. స్మార్ట్ కిచెన్ స్మార్ట్ హెల్త్ స్మార్ట్ చిల్డ్రన్ అన్నట్టుగా ఈ విధానాన్ని తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సూచించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు కడప స్మార్ట్ కిచెన్లను సందర్శించాలని కోరారు. స్మార్ట్ కిచెన్ కు సర్టిఫికేషన్ కూడా తీసుకోవటం అభినందనీయమని టీటీడీ తరహాలోనే తనిఖీ వ్యవస్థ ఉండాలని తెలిపారు. రైతు బజార్లలోనూ నాచురల్ ఫార్మింగ్ ఉత్పత్తులురావాలని, సర్టిఫికేషన్‌తోపాటు డోర్ డెలివరీ వచ్చేలా ఉండాలన్నారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా అంగన్‌వాడీలు, సంక్షేమహాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలకూ ఆహారం అందిం >>2



19-12pg2exHMNWJQE 2_19-12pg2exHMNWJQE.qxd 18/Dec/25 11:48 PM Page 1





బిజెపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నితిన్ నబీన్ గురువారం ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకొన్న దృశ్యం

# స్మార్ట్ కిచెన్ల ద్వారా ఆహారం

>> చాలని సూచించారు. కడపలోని అన్ని స్కూళ్లల్లో చిన్నారులకు, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తిస్థాయిలో ఈ బెస్ట్ ప్రాక్టీసెస్‌ను మరింతగా విస్తృతపరిస్తే ప్రజలకు ఉపయోగం కలుగుతుందని సీఎం అన్నారు. రిజిస్ట్రేషన్ శాఖలోనూ వినూత్న మార్పు వచ్చిందని 22ఏ భూముల విషయంలో ఏలూరు, బాపట్ల తదితర ప్రాంతాల్లో చేసిన మోడల్‌ను ఇతర ప్రాంతాల్లోనూ చేయాలని ఆదేశించారు. రెవెన్యూ రికార్డుల డిజిటైజేషన్‌లో ఎఐ వినియోగం ప్రాజెక్టుపై అనంతపురం కలెక్టర్ ఆనంద్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రెవెన్యూ ఆఫీస్ టూల్ తయారు చేసి యూజర్లకు అనువుగా మార్చామని వివరించారు. అనంత జిల్లాలో గ్రామస్థాయిలో రెవెన్యూ రికార్డుల లైబ్రరీ సిద్ధంగా ఉందని వెల్లడించారు. వివిధ అంశాలపై తనకు వచ్చిన ఫీడ్ బ్యాక్‌ను సిఎం కలెక్టర్ల కాన్ఫరెన్సులో పంచుకున్నారు. రిజిస్ట్రేషన్ల విధానం, నీటి భద్రత వంటి విషయాలు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నందుకు ఆనందంగా ఉందని తెలిపారు. 10 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసి తమను పంపించేశారని అదనంగా రూపాయి కూడా తీసుకోలేదని తనకు ఫోన్ వచ్చిందని సీఎం చెప్పారు. తిరుపతికి వెళ్తున్న మార్గంలో చెరువులన్నీ నీటి నిండిపోయాయని, తమకు చాలా సంతోషంగా ఉందని, ఎనర్జీ లెవల్స్ కూడా పెరిగాయన్నారు. మానవ వనరులు సద్వినియోగం చేసుకునేలా ఛాంపియన్ ఫార్మర్ అనే వినూత్న ప్రయోగం బాగుందని ప్రశంసించారు. అమరావతిలోనే ఉండమని హిమాన్షును కోరానని కానీ ఓ జిల్లాలో ఇంపాక్ట్ కలిగిస్తానని కలెక్టరుగా వెళ్లి చక్కగా పని చేస్తున్నారన్నారు. రైతు సేవా కేంద్రం, స్వర్ణాంధ్ర విజన్ యూనిట్ల ద్వారా రైతులకు ప్రయోజనం కల్పించే ఇలాంటి విధానాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు అవగాహన కల్పించాలని సూచించారు. చాంపియన్ ఫార్మర్ల ద్వారా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయడమో లేదా ఎంఎస్ఎంఈలుగా తీర్చిదిద్దడమో చేయాలన్నారు. సీజనల్ పంటలతో పాటు హార్టికల్చర్ పంటలకు ఈ విధానాలను విస్తరించాలని రైతులకు వ్యయం తగ్గాలని అత్యధిక ఆదాయం అందాలని సీఎం అన్నారు. ఇక స్వర్ణాంధ్ర2047 10 సూత్రాలపైనా కలెక్టర్ల సదస్సులో చర్చ జరిగింది. జీరో పావర్టీ, పాపులేషన్ మేనేజ్‌మెంట్, నైపుణ్యంఉపాధి కల్పన, నీటి భద్రత, అగ్రిటెక్, లాజిస్టిక్స్, ఇంధన నిర్వహణ, ప్రాడెక్టు పర్ఫెక్షన్, స్వచ్ఛాంధ్ర, డీప్ టెక్ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పీ4 ద్వారా జీరో పావర్టీ లక్ష్యాన్ని సాధించటంతో పాటు ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా ఫ్యామిలీ కార్డు జారీ, ప్రజారోగ్యం తదితర అంశాలపై ప్రజెంటేషన్‌లు ఇచ్చారు.

# కొత్త మార్పులు

>> మరింత ఎనర్జీ లెవల్స్ ఉంటాయని ఇరిగేషన్‌స్పెషల్ సిఎస్ సాయి ప్రసాద్ నవ్వుతూ వ్యాఖ్యానించారు. రెవెన్యూ సహా వివిధ అంశాల్లో తనకే తెలియని మరిన్ని బెస్ట్ ప్రాక్టీసెస్‌ను కొందరు కలెక్టర్లు అమలు చేయడం చాలా సంతోషంగాఉందని సాయి ప్రసాద్ అన్నారు. సీనియర్లం దరూ ఇదే విధంగా రియలైజైతే ఇబ్బందే ఉండదని సిఎం చంద్రబాబు నవ్వుతూ కామెంట్ చేశారు.

**22 ఎ భూముల వివాదాల పరిష్కారానికి హై ప్రయార్టీ ఇవ్వాలని సిఎం సూచన..**

వచ్చే కలెక్టర్ల కాన్ఫరెన్స్ సమావేశంలో 22ఎ భూముల వివాదాల పరిష్కారంపైనే మొదటి అజెండాగా చేపడతామని సిఎం చంద్రబాబు అన్నారు. విశాఖపట్నంలో కొన్ని భూ వివాదాల్లో కొందరి రాజకీయ నాయకుల ప్రమేయం ఉంటోందనే అంశంపై తనకు ఫిర్యాదులు అందాయని సిఎం దృష్టికి తెచ్చిన డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్. ఈ సంద ర్భంగా భూవివాదాల్లో పొలిటికల్ నేతలజోక్యాన్ని ఎంత మాత్రమూ సహించొద్దని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలకు సిఎం చంద్రబాబు ఆదేశించారు. భూవివాదాల్లో రాజకీయ నేతలు జోక్యం చేసుకున్నారనే ఫిర్యాదులు రాకూడదని సిఎం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిజిఆర్ఎస్ గ్రీవెన్సులు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో రెవెన్యూ క్లీనిక్స్ పెట్టారు. అన్ని రిజిస్ట్రేషన్ అండ్ ఆస్తి పత్రాలు డిజిటలైజేషన్ ప్రక్రియ జరుగుతోంది. లింక్ డాక్యు మెంట్సు డేటా వేర్ హౌసింగ్‌లో పెడుతున్నాం. ఉమ్మడి ఎపిలో రెవెన్యూ రికార్డులు నిర్వహణ అత్యుత్తమంగా నిర్వహించాం,2019-24లో భూ రికార్డులు అస్తవ్యస్తం చేశారన్నారు. తమకు దక్కాల్సిన భూములు దక్కకుంటే... వాటిని లిటిగేషనులో పెట్టేందుకు భూములన్నీ 22ఎలో పెట్టి వివాదంలోకి నెట్టారన్నారు. గత పాలనలో అస్తవ్యస్త పరిస్థితుల వల్ల ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు అన్నీ భూ వివాదాలకు సంబంధించే వస్తున్నాయి,.భూ సమస్యలను వందశాతం పరిష్కరించి ప్రజలకు సవ్యంగా డాక్యుమెంట్లు ఇవ్వాల్సిన బాధ్యత కలెక్టర్లదే అన్నారు. కొందరు ప్రొఫెషనల్స్ కావాలనే ఈ భూవివాదాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు...అవసరమైతే పిడియాక్టు పెట్టి కఠినంగా వ్యవహరించం దన్నారు. 22ఎ భూముల విషయంలో సర్వే చేసి సెటిల్ చేయండి.జాయింట్ ఎల్పీఎం భూముల విషయంలో నిర్దేశిత గడువులోకా పూర్తి చేయాలన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా భూవివాదాలులేని పరిస్థితి ఉండాలన్నారు. ప్రస్తుతం పెండిం గులో ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాలు జారీచేద్దాం ప్రింటింగ్ చేసిన చోటు నుంచే పట్టాదారు పాస్‌పుస్తకం నేరుగా రైతుకు వెళ్లేలా చర్యలు తీసుకుందామ న్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న డాక్యుమెంట్లు కూడా నేరుగా యజమానులకు చేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

హౌసింగ్‌లో పొజిషన్ సర్టిఫికెట్లను కూడా త్వరితగతిన క్లియర్ చేసేయాలన్నారు. 20-30 ఏళ్లుగా నివసిస్తున్న ఇళ్లకు పొజిషన్ సర్టిఫికేషన్ జారీ చేయాలన్నారు. విశాఖ, అనకాపల్లి సహా ఐదారు జిల్లాల్లో భూ కబ్జాలు లేకుండా చూడాలన్నారు. అదేవిధంగా రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్‌లో ఎఐ వాడకంపై అనంతపురం కలెక్టర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రెవెన్యూ ఆఫీస్‌ను టూల్ యూజర్లకు అనువుగా మార్చామని తెలిపారు. గ్రామస్థాయిలో రికార్డుల లైబ్రరీ సిద్ధంగా ఉందన్నారు. భూ రికార్డులను స్టోరేజీ లలో ఉంచటం ద్వారా అక్రమాలు అరికట్టవచ్చని తెలిపారు.

# పిపిపికి వ్యతిరేకంగా కోటి సంతకాల ప్రతులు

**విజయవాడ,డిసెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సేకరించిన కోటి సంతకాల ప్రతులను గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌కు మాజీ సిఎం జగన్ గురువారం సాయంత్రం అందజేసారు. పిపిపి విధానంలో వైద్యకళాశాలలను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను వైఎస్సార్సీపీ వ్యతిరేకిస్తుంది.ఈ క్రమంలో ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా కోటి సంతకాలను వైఎస్సార్సీపీ సేకరించింది.ఈ సంతకాల పత్రులను గవర్నర్‌కు అందజేస్తామని మాజీ సిఎం జగన్ ప్రకటించారు.ఈ క్రమంలో ఆయన, తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైసీపీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. కేవలం రెండు నెలల్లో కోటి నాలుగు లక్షలకు పైగా సంతకాలు సేకరించడం చారిత్రాత్మకమని, ఇది ప్రజా ఉద్యమంగా మారిం దని పార్టీ శ్రేణులను అభినందించారు. అనంతరం సంతకాల ప్రతులతో కూడిన వాహనాలను జెండా ఊపి లోక్‌భవన్‌కు పంపారు. సుమారు 40 మంది పార్టీ నాయకులతో కలిసి గవర్నర్‌ను కలిసిన జగన్, ప్రజల వ్యతిరేకతను ఆయనకు వివరించారు. ఈ ఉద్యమం ప్రజల నుంచి పుట్టిందని, పేదల హక్కులను కాపాడే వరకు కొనసాగుతుందని వైఎస్సార్సీ నేతలు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడం దేశ చరిత్రలోనే అతిపెద్ద స్కామ్ అని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ విమర్శించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల పబ్లిక్‌ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానాన్ని వ్యతిరేకిస్తూ సేకరించిన కోటి సంతకాల ప్రతులను నేడు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు సమర్పించామని జగన్‌వెల్లడించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన జగన్, చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తూ, రైతులను మోసం చేస్తూ, ఇప్పుడు పేదల వైద్య విద్యను కూడా దూరం చేయాలని చూస్తోందని ఆరోపించారు. ఒక్కో కాలేజీకి ఏటా రూ.120 కోట్ల జీతాలను ప్రభుత్వమే చెల్లిస్తూ, దాని నిర్వహణను ప్రైవేటుకు అప్పగించడం భారీ కుంభకోణమని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. ఈ ప్రైవేటీకరణ వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గవర్నర్‌ను కలిసిన వారిలో శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ ఉన్నారు.

# సిఎం చంద్రబాబుకు 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు

## అభినందనలు తెలిపిన మంత్రులు, సెక్రటరీలు, జిల్లా కలెక్టర్లు

**విజయవాడ, డిసెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం చంద్రబాబు నాయుడుకు 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు లభించింది. ఆంధ్రప్రదేశ్‌లో వ్యాపార అనుకూల విధానాల అమలు, పారిశ్రామిక సంస్కరణలు, రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షిస్తున్నందుకు గానూ ఈ అవార్డును అందిస్తున్నట్లు ఎకనామిక్ టైమ్స్ పత్రిక వెల్లడించింది. మార్చిలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా ఈ అవార్డును చంద్రబాబుకు ప్రదానం చేయనున్నారు. ఈ అవార్డును దేశంలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, ఆర్థిక నిపుణులు, న్యాయవేత్తలతో కూడిన అత్యున్నత స్థాయి జ్యూరీ ఎంపిక చేసింది. ఈసారి జ్యూరీలో భారతీ గ్రూప్ చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్, కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకులు ఉదయ్ కోటక్, నారాయణ హెల్త్ వ్యవస్థాపకులు డాక్టర్ దేవిశెట్టి, సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి, టాటా ట్రస్ట్స్ చైర్మన్ నోయెల్ టాటా వంటి ప్రముఖులు సభ్యులుగా ఉన్నారు. జ్యూరీకి డెలాయిట్ సంస్థ సలహాదారుగా వ్యవహరిస్తోంది.

ఈ అవార్డును 2024లో కేంద్రమంత్రులు అశ్వినీ వైష్ణవ్, 2023లో ఎస్. జైశంకర్, 2021లో నిర్మలా సీతారామన్, 2019లో మహారాష్ట్ర మాజీ సిఎం దేవేంద్ర ఫడణవీస్, 2017లో కేంద్ర మాజీ మంత్రి అరుణ్ జైట్లీ, 2015లో పీయూష్ గోయల్ వంటి వారు అందుకున్నారు. ప్రతిష్టాత్మక అవార్డు అందుకోవడంపై ప్రముఖులు, మంత్రి వర్గ సహచరులు ముఖ్య మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబును ఎకనామిక్ టైమ్స్ సంస్థ 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు వరించడం ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమని మంత్రి లోకేష్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, తమ కుటుంబానికి ఇది ఎంతో ప్రతిష్టాత్మకమని ఆయన అన్నారు. దేశంలో సంస్కరణల ప్రయాణాన్ని స్పష్టత, ధైర్యం, స్థిరత్వంతో ముందుకు తీసుకెళ్లిన అరుదైన నాయకుల్లో చంద్రబాబు ఒకరని జ్యూరీ ప్రశంసించిందని తెలిపారు.

**ఇటువంటి అవార్డు ఎప్పుడు తీసుకోలేదు**

ఈతరహా అవార్డులు ఎప్పుడూ తానుతీసుకోలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. విదేశీ యూనివర్సిటీలు డాక్టరేట్ ఇస్తామన్నా సున్నితంగా తిరస్కరించానని గుర్తు చేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విషయంలో గతంలో గుజరాత్ మొదటిస్థానంలో నిలిచిందని, ఆ తర్వాత ప్రతీ ఏడాదీ ఏపీనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఎన్నిసార్లు నిబంధనలు మార్చినా మనమే నెంబర్ వన్‌గా ఉన్నామని తెలిపారు. మనం ఇప్పుడు గేర్ మార్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తున్నా మని వెల్లడించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పూర్తి సహకారం అందిస్తున్నారని, ఇక కేంద్రం ఇస్తున్న సహకారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మరువకూడదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో ధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించగలుగుతారా? అని చాలా మంది అనుమానాలు వ్యక్తం చేశారని, రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని చెప్పి చేసి చూపిస్తున్నామన్నారు.

**సిఎంకు పలువురి అభినందనలు**

ఏ విజనరీ లీడర్ చంద్రబాబు ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపిక కావడం తెలుగు వారందరికీ గర్వకారణమని మంత్రులు గొట్టిపాటి రవి, డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, అనిత, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, వాసంశెట్టి సుభాష్, గుమ్మడి సంధ్యా రాణి, మండిపల్లి, బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక రంగంలో విప్లవాత్మక సంస్కరణలతో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన నాయకుడు చంద్రబాబు అని కొనియాడారు. సీఎం చంద్రబాబు నాయక త్వంపై నమ్మకంతోనే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడుల హబ్ గా తీర్చిదిద్ది దేశానికి ఆదర్శంగా నిలిపిన నాయకుడు చంద్రబాబు అని మంత్రులు పేర్కొన్నారు.

# భారత్, ఒమన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

>> విజన్‌డాక్యుమెంట్‌పైనా ఇరుదేశాలు సంతకాలుచేశాయి. అలాగే వ్యవసా యరంగ ఆవిష్కరణలు, ఆహార పరిశ్రమల విభాగంలో పరస్పర సహకారానికి సంబంధించిన ఒప్పందాన్ని కూడా భారత్- ఒమన్ కుదుర్చుకున్నాయి.

సముద్ర మార్గ వారసత్వం, మ్యూజియంలు, శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలు, నైపుణ్య వికాసం, వాణిజ్య సహకారం, వ్యవసాయ విభాగాల్లో ఒమన్‌కు చెందిన ఛాంబర్ ఆఫ్ కామర్స్, భారత్‌కు చెందిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) నాలుగు అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. ఇరుదేశాల మధ్య ఆర్థిక సంబంధాలు స్థిరంగా విస్తరిస్తున్న తరుణంలో ఈ ఒప్పందాలు జరిగాయి. ఒమన్‌కు 20 యేళ్లలో ఇది మొదటి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం. ఈ ఒప్పందం ద్వారా భారతీయ వస్తువులకు ఒమన్ మార్కెట్‌లో పన్ను రాయితీలు లభించడంతో పాటు ఎగుమతులు పెరుగుతాయి. దీనివల్ల మన దేశంలోని రైతులు, వ్యాపారులు, ఎగుమతిదారులకు భారీ లాభాలు చేకూరు తాయి. అలాగే పెట్టుబడులు పెరగడం వల్ల కొత్త ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక పరిస్థితులు మారుతున్న వేళ వస్తువుల సరఫరా ఆగిపోకుండా ఉండేందుకు ఈ స్నేహపూర్వక ఒప్పందం ఎంతో కీలకం. భారత్, ఒమన్ మధ్య 2024 ఆర్థిక సంవత్సరంలో ద్వైపాక్షిక వాణిజ్యం 8.947 బిలియన్ డాలర్లుగా ఉండగా, 2025 ఆర్థిక సంవత్సరంలో ఇది 10.613 బిలియన్ డాలర్లకు పెరిగింది. అదే సమయంలో ఒమన్‌లో 6,000 కంటే ఎక్కువ భారత్‌ఒమన్ సంయుక్త సంస్థలు పనిచేస్తుండటంతో పెట్టుబడి సంబంధాలు కూడా బలంగా ఉన్నాయి. ప్రస్తుతం 80 శాతానికి పైగా భారతీయ వస్తువులు సగటున 5 శాతం సుంకంతో ఒమన్‌కు ఎగుమతి అవుతున్నాయి. అయితే కొన్ని రకాల మాంసాలు, మద్యం, పొగాకు వంటి ఎంపిక చేసిన ఉత్పత్తులపై సుంకాలు సున్నా నుంచి 100 శాతం వరకు ఉన్నాయి.

**వైవిధ్యమే భారతీయ సంస్కృతికి బలమైన పునాది**

"భారతీయులు ఎక్కడికి వెళ్లినా వైవిధ్యాన్ని గౌరవిస్తారు. ఆ వైవిధ్యమే భారతీయ సంస్కృతికి బలమైన పునాది" అని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఉద్ఘాటించారు. గత 11 ఏళ్లలో భారత్ తన ఆర్థిక డీఎన్ఏను మార్చుకుందని అన్నారు. ఈ మార్పు వల్లే ప్రపంచంలోని అత్యంత పోటీతత్వ మార్కెట్లలో ఒకటిగా భారత్ ఎదిగిందన్నారు. ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్యాన్ని పెంచేందుకు భారత్ కుదుర్చుకుంటున్న సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందాలు (సిఇపిఎ) భాగస్వామ్య దేశాల్లో కొత్త విశ్వాసాన్ని నింపాయని పేర్కొన్నారు. గురువారం ఒమన్ రాజధాని మస్కట్‌లో నిర్వహించిన భారత్- ఒమన్ బిజినెస్ ఫోరం సదస్సులో ప్రధాని మోడీ మాట్లాడుతూ, "ఈ సదస్సు భారత్-ఒమన్ భాగస్వా మ్యానికి కొత్త దిశను, వేగాన్ని అందిస్తుందని విశ్వసిస్తున్నా. ఇరుదేశాల భాగస్వామ్యం కొత్త ఎత్తులను అందుకుంటుందని ఆశిస్తున్నా. గత 11 ఏళ్లలో భారత్ కేవలం విధానాలనే మార్చుకోలేదు. తన ఆర్థిక డీఎన్ఏను కూడా మార్చుకుంది. దివాలా బ్యాంక్ రప్టీ కోడ్(ఐబిసి), జీఎస్‌టీ వంటి విప్లవాత్మక చొరవల ద్వారా భారత్ వికాసం దిశగా అడుగులు వేసింది. జీఎస్‌టీ వ్యవస్థ వల్ల యావత్ భారత్‌లోని మార్కెట్ ఏకీకరణ జరిగింది. దివాలా బ్యాంక్ రప్టీ కోడ్ వల్ల సంస్థలకు ఆర్థిక క్రమశిక్షణ పెరిగింది. దీనివల్ల వాటి వ్యాపార కార్యకలాపాల్లో పారదర్శకత మెరుగుపడింది. దీనివల్ల భారత మార్కెట్‌పై పెట్టుబడిదారులకు విశ్వాసం పెరిగింది" అని వివరించారు.

ఒమన్‌లోని ప్రవాస భారతీయులతో మస్కట్ నగరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలోనూ ప్రధాని మోడీ ప్రసంగించారు. దీపావళి పండుగకు యునెస్కో 'సాంస్కృతిక వారసత్వ' ట్యాగ్ లభించడంపై ఆయన హర్షం వెలి బుచ్చారు. ఇప్పుడు భారతీయ దివ్వెలు కేవలం భారతీయుల ఇళ్లనే కాకుండా, యావత్ ప్రపంచానికి వెలుగులను పంచుతాయని మోడీ వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ జోర్డాన్, ఇథియోపియా, ఒమన్ దేశాల పర్యటన గురువారంతో ముగిసింది. ఒమన్‌తో వాణిజ్య ఒప్పందంపై చర్చలు, సంతకాలు అనంతరం ప్రధాని మోడీ భారత్‌కు తిరిగి వచ్చేశారు.

### ఎన్నికల్లో పోటీ చేయడం కంటే..

## కుటుంబ సభ్యులతో పోటీ కష్టంగా ఉంది

### - మంత్రి నారా లోకేష్

**విజయవాడ,డిసెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** మంత్రి నారా లోకేష్ ఇవాళ సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్‌లో ఆసక్తికర ట్వీట్ చేశారు. తన కుటుంబ సభ్యులకు అవార్డులు రావ డంపై లోకేష్ ఎక్స్‌లో స్పందించారు. ఎన్ని కల్లో పోటీ చేయడంకంటే.. కుటుంబ సభ్యు లతో పోటీ కష్టంగా ఉందని లోకేష్ సరదా వ్యాఖ్యలు చేశారు.నాన్న బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును గెలుచుకున్నారు. అమ్మ గోల్డెన్‌పీకాక్ అవార్డును ఇంటికి తీసుకు వస్తుంది. భారతదేశంలోని వ్యాపార రంగంలో అత్యంత శక్తివంతమైన మహిళలలో భార్య కూడా ఉంది. ఈ కుటుంబంతో పోటీ పడటం.. ఎన్నికలు ఎదుర్కోవడంకన్నా కష్ట మని నాకు అర్థమైంది అని నారా లోకేష్ వ్యాఖ్యానించారు.

## వారం - వర్జ్యం

19-12-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం
● అమావాస్య పూర్తి
జ్యేష్ఠ రా.10.50, మూల కార్తె
వర్జ్యం : మ.12.21-2.07
దు.ఉ.8.45-9.30
2) మ.12.28-1.13
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** ఉద్యోగంలో నూతన బాధ్యతలు సక్రమంగా నిర్వహించి పై అధికారుల ప్రశంసలు పొందుతారు.వస్త్రలాభం.

**వృషభం:** నూతన వ్యాపారాలు పరిశ్రమలను ప్రారంభిస్తారు. మిత్రుల కల యికతో విందు, వినోదాలు పాల్గొంటారు.

**మిథునం:** ప్రముఖవ్యక్తి ద్వారా ఒక ముఖ్యమైన వ్యవహారాన్ని విజయవంతంగా పూర్తిచేస్తారు. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**కర్కాటకం:** పనులు వాయిదా పడే సూచనలు ఉన్నాయి. మిత్రులు ఒత్తిడి వలన కొంత బాధకలుగుతుంది.

**సింహం:** కుటుంబంలో శుభకార్యాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.మిత్రుల కలయిక.

**కన్య :** ఓర్పుతో, ధైర్యముతో చేయవలసిన పనిని సఫలము చేయగలుగుతారు. సంఘంలో ప్రత్యేక గౌరవం పొందుతారు.

**తుల :** విధి నిర్వహణలో గాని, వ్యాపారములో గాని మార్పులు జరుగ వచ్చును. క్రయ విక్రయాలలో లాభాలు.

**వృశ్చికం:** రాజకీయాలు, సంఘములు, యూనియన్‌లు మొదలగు కార్యక్రమాలకు అను కూలకాలము. క్రయ విక్రయాలలో లాభాలు.

**ధనుస్సు:** వైరి వర్గంలోని అనైక్యత మీకు లాభిస్తుంది. మొండి బాకీలు రాబట్టు కోవడానికి కొత్త విధానాలు అవలంభిస్తారు.

**మకరం:** ముఖ్యమైన విషయాలలో పెద్దల సలహాలు తీసుకుంటారు. కొన్ని అవ కాశాలు అప్రయత్నంగా కలిసివస్తాయి.

**కుంభం:** కార్యాలయాలలో సహోద్యోగుల సహాయ సహకారాలు అందిస్తారు. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**మీనం:** స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండండి. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. ఆరోగ్యం జాగ్రత్త.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



విబి జి రామ్‌జి బిల్లుకు వ్యతిరేకంగా గురువారం పార్లమెంటు వద్ద ప్రదర్శన జరిపిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఎంపి సోనియాగాంధీ తదితరులు

# రాష్ట్రంలో నేరాలు తగ్గుముఖం

● 5.5 శాతం తగ్గిన క్రైమ్ రేటు ● 16 జిల్లాల్లో గణనీయంగా తగ్గిన నేరాలు ● ఎస్సీ, ఎస్టీలపై నేరాల్లో 25 శాతం తగ్గుముఖం ● మహిళలపై నేరాలూ గణనీయంగా తగ్గుదల ● డిజిపి హరీష్ గుప్త వెల్లడి

**విజయవాడ, డిసెంబరు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో నేరాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని రాష్ట్ర డిజిపి హరీష్ గుప్త చెప్పారు. కలెక్టర్ల సమావేశంలో శాంతిభద్రతల అంశంపై ఆయన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది నేరాలు 5.5 శాతం తగ్గుదల నమోదైందన్నారు. 2023 డిసెంబరు నుంచి నవంబరు 2024 వరకు 110111 నేరాలు నమోదైతే, డిసెంబరు 2024 నుంచి నవంబరు 2025 మధ్య కాలంలో 104095 నేరాలు నమోదయ్యాయని తెలిపారు. ప్రధానంగా 26 జిల్లాల్లో నేరాల చాలా తక్కువగా నమోదయ్యాయని చెప్పారు. ఇందులో గొడవలు, అల్లర్లు వంటి సంఘటనలు గణనీయంగా తగ్గాయన్నారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది 52.4 శాతం తగ్గుదల నమోదైందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలపైన నేరాలు తగ్గాయని చెప్పారు. గత ఏడాదితో పోల్చితే ఈ నేరాలు 22.35 శాతం తగ్గాయని చెప్పారు. మహిళల భద్రత కూడా పెరిగిందని చెప్పారు. క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్‌లో 4శాతం తగ్గుదల నమోదైందని చెప్పారు. అదృశ్యమైన మహిళల ఆచూకీ కనుగొనడంలో కూడా పోలీసు శాఖ విశేష కృషి చేసి ఫలితాలు రాబడుతోందన్నారు. నాలుగు నెలల కాలంలో మొత్తం 2,483 మంది అదృశ్యమైన మహిళల ఆచూకీ కనుగొన్నామని, అందులో 1177 మంది యువతులున్నారని తెలిపారు. నేరాలలో 56 శాతం మేర డిటెక్షన్ రేటు ఉందని, 55 శాతం మేర రికవరీ రేటు సాధించామన్నారు. ఎన్టీఆర్, పశ్చిమ గోదావరి జిల్లాలు సహా ఐదు జిల్లాల్లో సీసీటీవీ కెమెరాల అనుసంధానం పటిష్ట పర్యవేక్షణ, టెక్నాలజీ వినియోగంతో నేరాలు క్రమంగా తగ్గుముఖం పట్టాయన్నారు. విజయవాడ నగరంలో నిఘా కోసం 10వేల సీసీ కెమెరాలతో డ్యాష్ బోర్డు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

# పప్పుదినుసుల కొనుగోలుకు ఓకే

## గిట్టుబాటు ధర కల్పిస్తాం: కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

**విజయవాడ, డిసెంబరు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర రైతులకు మేలు చేసే కీలక నిర్ణయంగా పప్పుదినుసుల కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని పప్పు రైతులకు గిట్టుబాటు ధర లభించనుండగా, వారి ఆదాయం పెరిగే అవకాశాలు మెరుగుపడ్డాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిరంతర కృషి, కేంద్ర ప్రభుత్వంతో చేసిన సమ న్వయ ప్రయత్నాల ఫలితంగా ఖరీఫ్ 2025-26 సీజన్‌కు సంబంధించి పప్పుదినుసుల కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మంత్రి అచ్చెన్నాయుడుకి రాసిన లేఖ ద్వారా స్పష్టం చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు కేంద్రానికి పంపిన లేఖ ఆధారంగా, ప్రైస్ సపోర్ట్ స్కీమ్ (పిఎస్ఎస్) కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) వద్ద 1,16,690 మెట్రిక్ టన్నుల కందులు (తూర్పు), 903 మెట్రిక్ టన్నుల పెసలు (మూంగ్), 28,440 మెట్రిక్ టన్నుల మినుములు (ఉరద్) కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి శివరాజ్ లేఖలోపేర్కొన్నారు. ఈనిర్ణయం పూర్తిగా రాష్ట్ర వ్యవ సాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవ, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని చేసిన నిరంతర ప్రయత్నాల వల్లే సాధ్యమైందని కేంద్ర మంత్రి ప్రశంసించారు. దీని ద్వారా రాష్ట్రంలోని కందులు, పెసలు, మినుములు పండించే రైతులకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు, తక్కువ ధరలకు పంటలను విక్రయించాల్సిన పరిస్థితినుంచి వారు తప్పించుకోగలుగుతారని పేర్కొన్నారు. రైతు లకు కనీస మద్దతుధర భరోసా కల్పించేందుకు, అవసరమైనప్పుడు మార్కెట్‌లో జోక్యం చేసుకోవడంలో కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ నిర్ణయం వల్ల ఖరీఫ్ 2025-26 సీజన్‌లో ఆంధ్రప్రదేశ్ రైతులకు గణనీయమైన మేలు జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

**రైతుల ఆదాయం పెరిగే అవకాశాలు మెరుగుపడ్డాయి: మంత్రి అచ్చెన్నాయుడు**

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో పప్పు రైతులకు గిట్టుబాటు ధర లభించనుండగా, వారి ఆదాయం పెరిగే అవకాశాలు మెరుగుపడ్డాయని మంత్రి అచ్చెన్నాయుడు అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో పప్పుదినుసుల కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన చేపట్టి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి అచ్చెన్న పేర్కొన్నారు

# ఐదు జిల్లాలకు డిస్ట్రిక్ ఇన్‌చార్జిలుగా సీనియర్ ఐఎఎస్ అధికారులు

**విజయవాడ, డిసెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఐదు జిల్లాలకు సీనియన్ ఐఎఎస్ అధికారులను ప్రభుత్వం జిల్లా ఇన్‌చార్జిలుగా నియమించింది. సీనియర్ ఐఎఎస్ అధికారులు జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు పాటించాల్సిన విధానాలను అమలు చేయడం, ఇంటర్ డిపార్ట్‌మెంట్స్ కో ఆర్డినేషన్ కోసం పని చేయాల్సి ఉంటుంది. తూర్పుగోదావరి జిల్లాకు జి.వీరపాండి యన్, కాకినాడ జిల్లాకు ప్రసన్న వెంకటేశ్, బాపట్ల జిల్లాకు మల్లికార్జున్, శ్రీసత్యసాయి జిల్లాకు గంధం చంద్రుడు, నంద్యాల జిల్లాకు సి.హెచ్.శ్రీధర్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

## తన తప్పులను కలెక్టర్లపైకి

# నెట్టేస్తున్న సిఎం చంద్రబాబు

## -మాజీ సిఎం జగన్ విమర్శ



**విజయవాడ,డిసెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** చంద్రబాబు ప్రభుత్వంపై వైఎస్సార్సీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కోటి సంతకాల ఉద్యమం చారిత్రక విజయం సాధించిందని, ఇంత పెద్ద సంతకాల ఉద్యమం దేశ చరిత్రలోనే జరగలేదని అన్నారు. ముఖ్యంగా, మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు కట్టబెట్టడం అతిపెద్ద స్కాం అని ఆయన ఆరోపించారు. పార్టీ ముఖ్య నేతలతో గురువారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ... "ప్రైవేటుకు కాలేజీలు ఇచ్చి, మళ్లీ రూ.120 కోట్ల ప్రజాధనాన్ని జీతాల కింద ఎలా ఇస్తారు? ఇంతకంటే పెద్ద స్కాం ఉంటుందా? అని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఈ ఉద్యమంలో భాగంగా కోటి 4 లక్షల 11 వేల 136 మంది సంతకాలు చేశారని, ఇది ఒక చరిత్ర అని పేర్కొన్నారు. ఉద్యమాన్ని విజయవంతం చేసిన గ్రామస్థాయి కార్యకర్త నుంచి ప్రతి ఒక్కరికీ ఆయన అభినందనలు తెలిపారు. చంద్రబాబు గ్రాఫ్ పడిపోతోందని స్వయంగా ఆయనే చెప్పుకున్నారని జగన్ వ్యాఖ్యానించారు. కూటమి పాలనలో రెండు బడ్జెట్‌లు ప్రవేశపెట్టినా ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. తమ హయాంలో అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు భరోసా వంటి పథకాలను రద్దు చేశారని ఆరోపించారు. ప్రైవేటీకరణ అంటే దోపిడీ అని, విద్య, వైద్యం ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని జగన్ స్పష్టం చేశారు. తాము ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి బతికించామని, కానీ నేడు అన్ని వ్యవస్థలు తిరోగమనంలో ఉన్నాయని అన్నారు. చంద్రబాబు తన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి కలెక్టర్లపైకి నెట్టేస్తున్నారని ఆరోపించారు.

19-12Pg3exHMNWJQEKTR 3 GNT_19-12Pg3exHMNWJQEKTR.qxd 19/Dec/25 1:02 AM Page 1



# వల్లభనేని వంశీపై విజయవాడ మాచవరం పోలీస్ స్టేషన్‌లో కొత్తగా మరో కేసు నమోదు



**విజయవాడ, డిసెంబరు 18,ప్రభాత వార్తప్రతినిధి:** వైసీపీ నేతగన్నవరం మాజీ ఎమ్మెల్యే, వల్లభనేని వంశీపై విజయవాడలోని మాచవరం పోలీస్ స్టేషన్‌లో కొత్తగా మరో కేసు నమోదైంది. గత ఏడాది జులై నెలలో తనపై వంశీ, ఆయన అనుచరులు దాడి చేశారంటూ సునీల్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ కేసు నమోదు చేసినట్లు కీలక సమాచారం. బాధితుడు సునీల్ ఇటీవల పోలీసులను ఆశ్రయించి తనపై జరిగిన దాడి గురించి ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా వల్లభనేని వంశీని ప్రధాన నిందితుడిగా పేర్కొంటూ, ఆయనతో పాటు మరో ఎనిమిది మంది అనుచరులపై కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోంది. కాగా, వల్లభనేని వంశీ ఇప్పటికే పలు కేసులను ఎదుర్కొంటున్నారు. గతంలో ఓ టీడీపీ కార్యకర్త కిడ్నాప్, బెదిరింపుల కేసులో ఈ ఏడాది ఫిబ్రవరి 16న అరెస్ట్ అయ్యారు. ఆ తర్వాత ఆయనపై వరుసగా కేసులు నమోదయ్యాయి. మొత్తం 11 కేసుల్లో నిందితుడిగా ఉన్న ఆయన, 140 రోజుల పాటు జైలులో గడిపి బెయిల్ పై విడుదలైన విషయం తెలిసిందే.

## కిడ్నీ రాకెట్ కేసులో డాక్టర్ శాశ్వతీని 24 దాకా అరెస్ట్ చేయొద్దు : హైకోర్టు

**మదనపల్లి క్రైమ్ డిసెంబర్ 18 ప్రభాతవార్త.** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కిడ్నీ రాకెట్ కేసులో ఎనిమిదవ నిందితురాలుగా ఉన్న డాక్టర్ శాశ్వతీని ఈనెల 24 వరకు అరెస్టు చేయొద్దంటూ హైకోర్టు ఇంటీరిమ్ రిలీఫ్ ఆర్డర్ ను జారీ చేసింది. కిడ్నీ రాకెట్ కేసులో డాక్టర్ శాశ్వతి నిందితురాలుగా పరారీలో ఉంది.

# 'ముస్తాబు' కార్యక్రమాన్ని అన్ని జిల్లాల్లో అమలు చేయాలి

## సిఎం చంద్రబాబు



**విజయవాడ, డిసెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యాశాఖ రూపొందించిన ముస్తాబు వంటి ఉత్తమ విధానాలను అన్ని జిల్లాల కలెక్టర్ లు అనుసరించాలని సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. అన్ని భూ రికార్డులు స్టోరేజ్ లేదా క్లౌడ్‌లో ఉంచటం ద్వారా అక్రమాలు అరికట్టవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఖర్చుపెట్టే ప్రతిపైసాకు చక్కని ఫలితం ఉండాలని పాలనాయంత్రాంగానికి సూచించారు. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో కలెక్టర్లు అమలు చేస్తున్న కొన్ని విధానాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రశంసించారు.సచివాలయంలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సు 2వ రోజూ సీఎం చంద్రబాబు నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. వివిధ జిల్లాల్లో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను ఆయా జిల్లాల కలెక్టర్లతోనే ప్రజెంటేషన్ ఇప్పించారు. 6 జిల్లాల కలెక్టర్లు ప్రదర్శించిన విధానాలు రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ఆదేశించారు. రొటీన్‌గా కాకుండా ప్రజలకు ఉపయోగపడేలా కలెక్టర్ల కాన్ఫరెన్సులో చర్చ జరగడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వివిధ అంశాలపై అల్లూరి, పార్వతీపురం మన్యం, ఏలూరు, నెల్లూరు, కడప, అనంతపురం జిల్లాల కలెక్టర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జిల్లాల్లో అత్యుత్తమ విధానాల ద్వారా సేవలందిస్తున్న కలెక్టర్లను సీఎం అభినందించారు.

వచ్చే కలెక్టర్ల సమావేశం నాటికి ప్రజలకు ఉపయోగపడే మరిన్ని వినూత్న ఆలో చనలు, కార్య క్ర మాలతో రావాలని పిలుపునిచ్చారు. సాంకేతికత ద్వారా వినూత్న ఆలోచనలతో ప్రజలకు ప్రయోజనం కలిగించాలని దిశానిర్దేశం చేశారు.

# ఆరోగ్య రంగంలో ఎఐ పాత్రను డబ్ల్యూహెచ్ఓ ప్రోత్సహిస్తోంది

## - ఎఐ స్ట్రాటజీ నిపుణుడు డాక్టర్ కార్తీక్ అడపా



**విజయవాడ,డిసెంబరు 18,ప్రభాత వార్తప్రతినిధి:**ఏఐ వినియోగంలో భారత్ గేమ్ ఛేంజర్‌గా మారాలంటే మరింత శ్రమించాలని, వినూత్న ఆవిష్కరణలను అందుబాటులోకి తేవాలని ,పంజాబ్ రాష్ట్ర పూర్వ వైద్యారోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి, డిజిటల్ హెల్త్ కేర్, ఏఐ స్ట్రాటజీ నిపుణుడు డాక్టర్ కార్తీక్ అడపా అన్నారు. ఆరోగ్య రంగంలో ఏఐ పాత్రను డబ్ల్యూహెచ్‌వో ఎలా ప్రోత్స హిస్తోందదన్నారు. విజయవాడలో నిర్వహించిన దక్షి ణ భారతదేశ బహుళ భాగస్వామ్య సమన్వయ ప్రాంతీయ కార్యశాలకు పంజాబ్ రాష్ట్ర పూర్వ వైద్యారోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి, డిజిటల్ హెల్త్ కేర్, ఏఐ స్ట్రాటజీ నిపుణుడు డాక్టర్ కార్తీక్ అడపా హాజరయ్యారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంలో ప్రపంచంలో ప్రస్తుతం భారత్ టాప్10లో ఉందన్నారు. మనం టాప్ 1 2, 3ల్లోకి రావాలంటే చాలా కృషి చేయాలని తెలిపారు. అంతరాలు మొత్తం తొలగకపోయినా ఎక్కువ మందికి ఎదురయ్యే సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం ఏఐ సొల్యూషన్స్ తయారు చేస్తే సమస్యలు ఎక్కువగా ఎదుర్కొంటున్న పేదలకు న్యాయం జరుగుతుందని అడపా అభిప్రాయం వ్యక్తం చేశారు. సామాన్యులు ఎక్కువగా ఎదుర్కొనే ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ఎక్కువ డబ్బులు ఖర్చు పెట్టమని ప్రభుత్వానికి సూచిస్తున్నట్లు వివరించారు. ఎయిమ్స్‌లో వైద్యం అందించే డాక్టర్ ఏ టూల్స్ వాడుతున్నారో క్షేత్ర స్థాయిలో పని చేసే ఆశా కార్యకర్తకు కూడా అవే టూల్స్ అందుబాటులోకి తేగలగాలన్నారు. ఎక్కువ మందిని వేధిస్తున్న క్యాన్సర్ లాంటి సమస్యలకు ఏఐ సేవలు అందుబాటులోకి తేవాలని, అప్పుడే నిర్దేశించుకున్న లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. రోగుల డేటా గోప్యతను కాపాడడంలో సవాళ్లను ఎలా ఎదుర్కొంటారంటే? ఏఐ సొల్యూషన్స్‌ను విదేశాల నుంచి భారతదేశానికి రానీయకూడదని, మన దేశంలో అభివృద్ధి చేసినవి అదీ మన రాష్ట్రంలో అభివృద్ధి చేసినవి వాడాలని ఆయన వివరించారు. ఎక్కడికక్కడ సాంకేతికత వినియోగించే ప్రయత్నం చేయాలని కార్తీక్ అడపా సూచించారు. లోకల్ డేటాతో లోకల్ మోడల్స్ రూపొందించాలన్నారు. సమాచారానికి ఎలా భద్రత కల్పించాలి? సైబర్ సెక్యూరిటీ ద్వారా ఎలా రక్షణ కల్పించాలి? అనే అంశాలనూ ఏఐ స్ట్రాటజీ డాక్యుమెంట్‌లో పొందుపరిచినట్లు వివరించారు. ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగం, ఇతర అంశాలపై 300 పేజీల ఏఐ వ్యూహ పత్రాన్ని (ఏఐ స్ట్రాటజీ డాక్యుమెంట్) డబ్ల్యూహెచ్‌వో, భారత ప్రభుత్వం తరఫు నుంచి డబ్ల్యూహెచ్‌వో రూపొందించిందని ఆయన అన్నారు. ఈ డాక్యుమెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు అందించినట్లు పేర్కొన్నారు. వారిచ్చిన ఫీడ్ బ్యాక్ ఆధారంగా ఈ డాక్యుమెంట్ ఇంకా అభివృద్ధి చేస్తామని ఆయన వివరించారు. ఫౌండేషనల్ డాక్యుమెంట్‌కు పూర్తి స్వరూపం తీసుకొచ్చే కసరత్తు ప్రస్తుతం జరుగుతోందని, ఆ పరిపూర్ణ ఏఐ డాక్యుమెంట్‌ను ఫిబ్రవరి 19న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆవిష్కరిస్తారని కార్తీక్ అడపా స్పష్టం చేశారు. ఒక డాక్టర్ వినియోగించే ఏఐ టూల్ సురక్షి తమా? కాదా? అనేది తేల్చేందుకు క్లినికల్ ట్రయల్ ఉంటుందని కార్తీక్ వివరించారు. అలాగే ఏఐ ఆధారిత వైద్యసేవల్లోనూ రోగుల భద్రతకు ప్రాధాన్యం ఉంటుందన్నారు.

# రాజంపేట జిల్లా చేసే వరకు పోరాటం

**కడప, డిసెంబర్ 18, ప్రభాతవార్త** రాజంపేటను జిల్లా చేసేంతవరకు పోరాటం ఆగదని రాజంపేట జనసేన పార్లమెంట్ సమన్వయకర్త ఎల్లటూరు శ్రినవాసరాజు పేర్కొన్నారు. రాజంపేటను జిల్లాగా ఏర్పాటు చేయాలని జెఎసి ఆధ్వర్యంలో నేడు ప్రజాగర్జనకు పిలుపునిచ్చారు. శుక్రవారం రాజంపేట పట్టణంలో వ్యాపార దుకాణాలు, ప్రైవేట్ విద్యాసంస్థలు, వివిధ ప్రజా సంఘాలు, కులసంఘాలతోపాటు నేడు జరగబోయే ప్రజాగర్జనకు మద్దతు ఇవ్వడం జరిగిందని, భారీ ఎత్తున రాజంపేట పాత బస్టాండులో ప్రజాగర్జనను నిర్వహిస్తున్నట్లు శ్రీనివాసరాజు తెలిపారు. ఈ ప్రజాగర్జనకు రాజంపేట నియోజకవర్గంలోని మండలాలతో పాటు రైల్వేకోడూరు నియోజకవర్గంలోని మండలాల నాయకులతోపాటు కూటమి నాయకులు, ప్రజలు భారీ ఎత్తున తరలిరానున్నారు. పాతబస్టాండు కూడలిలో భారీ ఎత్తున ర్యాలీ చేపడుతున్నట్లు జెఎసి నాయకులు తెలిపారు. రెండు నియోజకవర్గాలలోని ప్రజలు రాజంపేటను జిల్లా చేయాలని డిమాండు చేస్తూ నేడు భారీ ఎత్తున ప్రజలు చేపడుతున్నట్లు, అన్ని మౌలిక వసతులు కలిగిన రాజంపేటను జిల్లా చేయాలని కోరనున్నారు.

## కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం అవాస్తవం

**విజయవాడ,డిసెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి :** కృష్ణా జలాల కేటాయింపుల్లో తెలంగాణకు చారిత్రక అన్యాయం జరిగిందన్నది అబద్ధమని కృష్ణా ట్రైబ్యునల్ ఎదుట ఏపీ వాదనలు వినిపించింది. నీటి కేటాయింపులకు నిర్దిష్ట విధానాలు ఉన్నాయని ఏపీ తరఫున న్యాయవాది జయదీప్ గుప్తా వాదించారు. .రాజకీయ కారణాలతో నీళ్ల కేటాయిస్తే జలయుద్ధాలు జరుగుతాయని స్పష్టం చేసారు. ఎస్‌ఎల్‌బీసీ పూర్తికానందుకే ఎలిమినేటి మాధవరెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మించారని స్పష్టం చేశారు. నీటి కేటాయింపులపై దిల్లీలో బ్రిజేష్ ట్రైబ్యునల్ ఛైర్మన్ జస్టిస్ బ్రిజేష్‌కుమార్, సభ్యులు జస్టిస్ రామమోహన్‌రెడ్డి, జస్టిస్ తాలపత్రల ఎదుట ఏపీ వాదనలు వినిపించింది. గతంలో తెలంగాణ వినిపించిన వాదనలను ఒక్కొక్కటిగా ప్రస్తావిస్తూ అవి ఏరకంగా సహేతుకం కాదో వివరిస్తూ ఏపీ తరఫున సీనియర్ న్యాయవాది జయదీప్ గుప్తా వాదించారు.

# స్పోర్ట్స్ మీట్‌లో పూర్తయిన వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

## ఉత్కంఠ భరితంగా చదరంగం పోటీలు: క్వార్టర్ ఫైనల్స్‌కు టెన్నిస్



**శ్రీకాళహస్తి,డిసెంబర్ 18 ప్రభాతవార్త** తిరుపతి ఐఐటిలో ఈ నెల 14నుంచి జరుగుతున్న స్పోర్ట్ మీట్‌లో గురువారం సాయంత్రం అందిన సమాచారం మేరకు టెన్నిస్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. కాగా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు పూర్తి కాగా చదరంగం పోటీలు ఉత్కంఠంగా సాగుతున్నాయి. వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పలు ఐఐటి విద్యార్థులు పోటీలు పడ్డారు. వెయిట్ లిఫ్టింగ్ పోటీలు పూర్తి అయ్యాయి.ఈ నెల 21న ఫైనల్ పోటీలు నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు.ఉత్కంఠ భరితంగా జరుగుతున్న పోటీల్లో చదరంగం పోటీల్లో ఎవరు గెలుపొందుతారన్నది ప్రశ్నార్థకంగా మారింది. అయితే వెయిట్ లిఫ్టింగ్‌లో 71,79 + 79కిలోల పోటీలకు సంబంధించి నిర్వాహకులు ప్రకటించారు. డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ ఈ పోటీలకు హాజరైన క్రీడాకారులకు సదుపాయాల కల్పనలో ఎంతో చొరవ చూపుతున్నారు.అలాగే క్రీడాకారులకు బస సదుపాయాల కల్పనలో రాజీ లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. పూర్తి అయిన వెయిట్ లిఫ్టింగ్: నాలుగు రోజుల పాటు నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులుగా రూర్కెలకు చెందిన అభిషేక్ కుమార్ కాన్పుర్‌కు చెందిన ధారువ్‌షెట్టి రూర్కెలాకు చెందిన దాస్ అనుప్ కుమార్,నౌలాక్‌లు ఉత్తమ వెయిట్ లిఫ్టర్‌గా ఎంపికయ్యారు.

# అశ్రునయనాల మధ్య సినీ దర్శకుడు కిరణ్‌కుమార్ అంత్యక్రియలు

## - ఇంద్రావతికి తరలివచ్చిన డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, నటులు



సినీ దర్శకుడు కిరణ్‌కుమార్ (ఫైల్)

**ఉరవకొండ, డిసెంబరు 18 ప్రభాతవార్త** తెలుగు సినిమా దర్శకుడు కిరణ్‌కుమార్ (కేకే) అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన ఉరవకొండ మండలంలోని ఇంద్రావతి గ్రామంలో గురువారం బంధుమిత్రులు, తోటి సినీ కళాకారుల అశ్రునయనాల మధ్య జరిగాయి. దర్శకుడు కిరణ్‌కుమార్ బుధవారం కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన భౌతిక కాయాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. కిరణ్‌కుమార్ తండ్రి డాక్టర్ శ్రీరాములు ఉరవకొండ ప్రాంతంలో అందరికీ సుపరిచితులు. ఆయనకు ముగ్గురు కుమారులు సంతానంకాగా రెండవ సంతానమైన కిరణ్‌కుమార్ అవివాహితుడని తెలిసింది. కిరణ్‌కుమార్ ప్రముఖ హీరో అక్కినేని నాగార్జున నటించిన 'కేడి' సినిమాకు దర్శకత్వం వహించగా ఆ సినిమా 2010లో విడుదలైంది. నాగార్జున హీరోగా నటించిన 'కింగ్' సినిమాకు సైతం ఆయన అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశారని సమాచారం. ప్రస్తుతం ఆయన 'కేజేక్యూ' కింగ్..జాకీ..క్వీన్ సినిమాకు దర్శకత్వం వహించగా సినిమా షూటింగ్ పూర్తి చేసుకొని విడుదలకు సిద్ధమవుతున్న తరుణంలో ఆయన హఠాన్మరణం టాలీవుడ్‌లో విషాదాన్ని నింపింది. కిరణ్‌కుమార్ పలు టీవీ సీరియల్స్‌కు కూడా దర్శకత్వం వహించి మంచి దర్శకుడని పేరు తెచ్చుకున్నారని సినీ వర్గాలు తెలిపాయి. తోటి కళాకారుడికి కడసారి వీడ్కోలు పలకడానికిగాను సినీ హీరో నాని, అర్జున్‌రెడ్డి సినిమా దర్శకుడు సందీప్, హీరో, యాంకర్ శశికుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ మహేందర్ ఇతర కళాకారులు ఇంద్రావతికు తరలివచ్చి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

# తిరుమల సమాచారం

## 23న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

### 22న విఐపి బ్రేక్ సిఫార్సులు రద్దు



**తిరుమల,డిసెంబర్ 18ప్రభాత వార్తప్రతి నిధి:** కలియుగవైకుంఠ వాసుడు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి చేపట్టే కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం 23వతేదీ మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు మహాయజ్ఞంలా ఈ కార్యక్రమం చేపట్టడం సంప్రదాయం. ఆలయం అంతటా సుగంధపరిమళ ద్రవ్యంతో శుద్ధి చేస్తారు. ఆలయ అర్చకులు, ఉద్యోగులు పాల్గొని ఆలయంలోపల బంగారువాకిలి నుండి ఉప ఆలయాలు, మహద్వారం వరకు నీటితో శుభ్రంగా కడుగుతారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం,గంధంపొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా సంప్రోక్షణ చేస్తారు. 23న ఆలయంలో జరగాల్సిన అష్టదళపాదపద్మారాధన సేవ రద్దయ్యింది. ఏడాదిలో వైకుంఠ ఏకాదశి,ఉగాది ఆస్థానం, వార్షిక బ్రహ్మోత్సవాలు, ఆణివార ఆస్థానం ముందువచ్చే మంగళవారాల్లో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టడం ఆనవాయితీ. 22వతేదీ విఐపి బ్రేక్ సిఫార్సు లేఖలు రద్దుచేశారు.

## 'ఆధార్'తోనే శ్రీవారి సేవలు !

### - మధ్యవర్తులు, దళారుల నియంత్రణకు చర్యలు

**తిరుమల,డిసెంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి విచ్చేసే భక్తులకు టిటిడి కల్పిస్తున్న దర్శనం, వసతి తదితర సేవలు దళారుల ప్రమేయం లేకుండా మరింత పారదర్శకంగా నేరుగా అందించేందుకు టిటిడి కార్యచరణ రూపొందించింది. ఇందులో భాగంగా భక్తులకు ఆఫ్‌లైన్(కౌంటర్‌సేవలు), ఆన్‌లైన్ (వెబ్‌పోర్టల్)రెండింటిల అందించే సేవలు అనేకమంది వ్యక్తులు భక్తులను మోసంచేసి భారీ మొత్తంలో డబ్బులు వసూలుచేస్తున్నారు. భక్తులకు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా టిటిడి అందిస్తున్న సేవలలో పారదర్శకతను పెంచేందుకు అధికారులు ఆధార్ ఆధారంగా సేవలందించేందుకు చూడాల్సి ఉంది. ఆఫ్‌లైన్‌లో, ఆన్‌లైన్‌లో టిక్కెట్లు పొందే దళారులు, మధ్యవర్తులపై టిటిడి చర్యలు చేపట్టింది. బల్క్ బుకింగ్‌లకు ఉపయోగించే మొబైల్‌నంబర్లు, మెయిల్ ఐడి ప్రూఫ్‌లు రద్దుచేశారు. ఫేక్ మొబైల్ నంబర్లు, మెయిల్ ఐడిలు ,ఐడి ప్రూఫ్‌లు ఉపయోగించి ఇప్పటికే బుక్‌చేసిన సేవలను ఉపయోగించడానికి అనుమతింపబడవని తెలిపారు. నిజమైన భక్తులు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ ఉపయోగించి మధ్యవర్తి లేకుండా సేవను నేరుగా పొందేలా టిటిడి కార్యాచరణ రూపొందించింది, సరైన ధృవీకరణ కోసం ఆదార్‌సేవలను ఉపయోగించేలా టిటిడి చర్యలు తీసుకుంటోంది.

## 29నుండి కపిలేశ్వరస్వామి తెప్పోత్సవాలు



**తిరుమల,డిసెంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానానికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని ప్రముఖ శైవాలయం కపిలేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 29వతేదీ నుండి 2026 జనవరి 2వతేదీ వరకు కపిలేశ్వరస్వామి తెప్పోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఐదురోజులపాటు జరిగే ఈ తెప్పోత్సవాల్లో మొదటిరోజు డిసెంబర్ 29వతేదీ వినాయక స్వామి, చంద్రశేఖర్‌స్వామి పుష్కరిణిలో తొమ్మిదిచుట్లు విహరిస్తారు. రెండవరోజు 30న వళ్ళీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి తొమ్మిదిచుట్లు, 31న సోమస్కంధస్వామి తొమ్మిదిచుట్లు, జనవరి 1వతేదీ కామాక్షిఅమ్మవారు , 2న చండికేశ్వరస్వామి, చంద్రశేఖరస్వామి తెప్పలపై తొమ్మిదిచుట్లు విహరించి భక్తులను కటాక్షించనున్నారు. ఇందుకు కపిలేశ్వరస్వామి ఆలయంలోని పుష్కరిణిని ముస్తాబుచేస్తున్నారు.

## 21న తిరుమలలో పల్స్‌పోలియో చుక్కలు



**తిరుమల,డిసెంబర్ 18ప్రభాత వార్తప్రతినిధి:** దేశంనుండి పోలియో మహ్మారిని శాశ్వతంగా తరిమి కొట్టేందుకు ఈ ఏడాది చివరగా 21వ తేదీ ఆదివారం పల్స్ పోలియో చుక్కలు వేసే కార్యక్రమం చేపడుతున్నారు. పుణ్యక్షేత్రం తిరుమలలో యాత్రికులకు చెందిన 0-5ఏళ్ళలోపు చిన్నారులకు పోలియోచుక్కలు వేయించేందుకు టిటిడి వైద్యఆరోగ్యవిభాగం చర్యలు చేపడుతోంది. తిరుమల ఆలయం ముందుభాగంతోబాటు పరిసరాల్లో, సిఆర్ఒ, జిఎన్‌సి టోల్‌గేట్, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లు, కల్యాణకట్ట,మేదరమిట్ట,పాపవినాశనం, సుపథం ,ఆలయం లోపల ఇలా ఆరోజు చిన్నారులను గుర్తించి పోలియో చుక్కలు వేయించనున్నారు.

## ప్రజలందరికీ శ్రీవారి ఆశీస్సులు కలగాలి: ప్రముఖులు



**తిరుమల,డిసెంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి ఆలయంలో భక్తులందరికీ టిటిడి అదికారులు చక్కటి దర్శనం చేయిస్తున్నారని, కూటమిప్రభుత్వంలో భక్తులు సంతృప్తిగా శ్రీవారిని దర్శించుకుంటున్నారని ప్రముఖులు తెలిపారు. కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు. అందరూ సంతోషంగా ఉండాలని తెలిపారు. గురువారం ఉదయం రాష్ట్రమంత్రి పి,నారాయణ, ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు, సినీ దర్శకుడు ఏఎం రత్నం ,నిర్మాత దిల్‌రాజు, నటుడు రవితేజ అనుచరులు. కుటుంబంతో కలసి వేర్వేరుగా విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు వీరికి దర్శనం చేయించి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.


**నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్** NIWAS HOUSING FINANCE

(పూర్వపు) ఇండోస్టార్ హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌గా తెలిసినది, NHFPLగా ఇటుపై రిఫర్ చేయబడును)
నమోదిత కార్యాలయం : యూనిట్ నెం.305, 3వ అంతస్తు, వింగ్ 2/E, కార్పొరేట్ ఎవెన్యూ, అంధేరి ఘట్కోపర్ లింక్ రోడ్, చాకల, అంధేరి (ఈస్ట్), ముంబై-400093
ఇ-మెయిల్:-connect@niwashfc.com CIN నంబర్: U65990MH2016PTC271587 సంప్రదించు నం.: శ్రీ కాగిత కిషోర్-9966111777

**[అనుబంధం-IV-A] స్థిరాస్తుల యొక్క అమ్మకానికి విక్రయ ప్రకటన [8(6) నిబంధనకు ఏర్పాటు చూడండి]**

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం 2002 సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధన 8(6)కు ఏర్పాటుతో చదువబడే దాని క్రింద స్థిరాస్తుల యొక్క అమ్మకానికి ఇ-వేలం విక్రయ ప్రకటన. సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం 2002 క్రింద NHFPL అధీకృత అధికారిచే రుణగ్రహీత(లు) నుండి రుణబకాయి మొత్తం వసూలు కొరకు ఇక్కడ క్రింద పేర్కొనబడిన సెక్యూర్డ్ ఆస్తిని స్వాధీనంలోకి తీసుకొనుట విషయమై సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా రుణగ్రహీత(లు)కు ఇందుమూలముగా ప్రకటన జారీచేయడమైనది. దిగువ సంతకందారునిచే క్రింద ఇక్కడ వివరింపబడిన విధంగా స్థిరాస్తి కొనుగోలు నిమిత్తం మా సేల్స్ & మార్కెటింగ్ మరియు ఇ-వేలం సర్వీస్ భాగస్వామి Credresolution ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనగా credauction.com యొక్క వెబ్ పోర్టల్ పైన ఆన్లైన్ దాఖలుకు ఆఫర్లు కోరబడుతున్నవి.
సెక్యూర్డ్ ఆస్తులు తిరిగి పొందడానికి సమయ లభ్యతకు సంబంధించి చట్టం యొక్క 13 సెక్షన్ యొక్క ఉప-సెక్షన్ (8) యొక్క ఏర్పాటు విషయం రుణగ్రహీత దృష్టికి తీసుకురావడమైనది. 'ఏది ఎక్కడ ఉన్నదీ అక్కడ అలా', ప్రాతిపదికన ఏది ఎలా ఉన్నదీ అలా ప్రతిపాదికన అక్కడ ఉన్నది అలా' ప్రాతిపదికన, సహాయంపై ఆధారపడకుండా ప్రాతిపదికన సదరు ఆస్తి భౌతికంగా స్వాధీనం చేసుకోబడింది. దాని వివరాలు ఇక్కడ క్రింద పేర్కొనబడిన విధంగా.

| రుణగ్రహీత(లు) వివరాలు | డిమాండ్ నోటీసు 13(2) యొక్క మొత్తం మరియు తేదీ | రిజర్వ్ ధర బయానా జమ పెంపు మొత్తం | ఇ-వేలం తేది & సమయం |
|---|---|---|---|
| LNGUN0HL-03210016273 బ్రాంచి : గుంటూరు-అరండల్‌పేట రుణగ్రహీత: లక్ష్మీ కొనస్సి సహ-రుణగ్రహీత(లు): ఏడుకొండలు కొనస్సి | 14.06.2024 రూ.8,07,258/- (రూపాయలు ఎనిమిది లక్షల ఏడు వేల రెండు వందల యాభై ఎనిమిది మాత్రమే) 13.06.2024 నాటికి తిరిగి చెల్లింపు వరకు అపై తదుపరి వడ్డీ మరియు చార్జీలతోసహా | రూ.4,00,000/- రూ.40,000/- రూ.10,000/- | 07.01.2026 సమయం: ఉ.10.30 నుండి మ.12.30 గం.కు 5 నిమిషాల యొక్క అపరిమిత పొడిగింపుతో |
| **ఆస్తి కలిగి ఉన్నది:** ఇ.నం.43-1a కలిగి ఉన్న ఇ.నం.2-72/A కలిగి ఉన్న 108-9 చ.గ. M విస్తీర్ణం యొక్క స్థలం, RCC ఇల్లుతో, క్రోసూర్ మండలం వద్ద ఉన్న బయ్యవరం గ్రామ పంచాయతీ, భయ్యవరం గ్రామం, గుంటూరు జిల్లా. **నాలుగు సరిహద్దులు: ఉత్తరం:** గల్లీ బజార్ 70 లింక్స్, **దక్షిణం:** చెన్నవరపు రామయ్య ఇల్లు 70 లింక్‌లు, **తూర్పు:** 6 అ. వెడల్పు శివాలయానికి దారి మార్గం, 33 లింక్‌లు, **పడమర:** గల్లీ బజార్ 31 లింక్స్. | | | |
| LNGUNLAP-10210019398 బ్రాంచి : గుంటూరు-అరండల్‌పేట రుణగ్రహీత: శ్రీనివాసరావు మార్తాల సహ-రుణగ్రహీత(లు): విజయ్ మల్లేశ్వరాయ్ మార్తాల | 15.05.2024 రూ.4,89,813/- (రూపాయలు నాలుగు లక్షల ఎనభై తొమ్మిది వేల ఎనిమిది వందల పదమూడు మాత్రమే) 14-మే-2024 నాటికి తిరిగి చెల్లింపు వరకు అపై తదుపరి వడ్డీ మరియు చార్జీలతోసహా | రూ.4,95,000/- రూ.49,500/- రూ.10,000/- | 07.01.2026 సమయం: ఉ.10.30 నుండి మ.12.30 గం.కు 5 నిమిషాల యొక్క అపరిమిత పొడిగింపుతో |
| **ఆస్తి కలిగి ఉన్నది:** గుంటూరు జిల్లా వద్ద నరసారావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, పెదకూరపాడు ఉప-జిల్లా, పెదకూరపాడు మండలం, లగడపాడు గ్రామ పంచాయతీ ఏరియా, లగడపాడు గ్రామం, ఇ.నం.88/1, ఎక.3-18 సెంట్లులో, ఇ.నం.3-95, అసెస్‌మెంట్ నం.549, 144-2 చ.గ. యొక్క విస్తీర్ణం యొక్క స్థలం 20 సంవత్సరాల ఓల్డ్ RCC ఇల్లుతో. అందులోని అన్ని ఫిక్చర్‌లు మరియు అందులోని ఫిట్టింగ్‌లతో. **సరిహద్దులు ఈ క్రింది విధంగా: తూర్పు:** గురజాల రామచంద్రారావు ఇల్లు 43 అ., **పడమర:** పంచాయతీ బజార్ 45 అ., **ఉత్తరం:** అనుమల నాగేశ్వరరావు ఇల్లు ఇతరులు 32 అ., **దక్షిణం:** ముల్పూరి శ్రీనివాసరావు యొక్క స్థలం మరియు ఇతరులు 27 అ. | | | |
| LNGUN0HL-06220025090 బ్రాంచి : గుంటూరు-అరండల్‌పేట రుణగ్రహీత: కోటేశ్వర రావు చెలబోయిన సహ-రుణగ్రహీత(లు): శ్రావణి చెలబోయిన | 16.01.2025 రూ.11,80,339/- (రూపాయలు పదకొండు లక్షల ఎనభై వేల మూడు వందల ముప్పై తొమ్మిది మాత్రమే) 10-జనవరి-2025 నాటికి తిరిగి చెల్లింపు వరకు అపై తదుపరి వడ్డీ మరియు చార్జీలతోసహా | రూ.14,10,000/- రూ.1,41,000/- రూ.10,000/- | 23.01.2026 సమయం: ఉ.10.30 నుండి మ.12.30 గం.కు 5 నిమిషాల యొక్క అపరిమిత పొడిగింపుతో |
| **ఆస్తి కలిగి ఉన్నది:** గుంటూరు జిల్లా వద్ద నరసారావుపేట ఉప జిల్లా, చిలకలూరిపేట మండలం, కావూరు గ్రామం, లింగంగుంట్ల పంచాయతీ ఏరియా పరిధి, కావూరు గ్రామం, ఇ.నం.611-C, 145.2 చ.గ. విస్తీర్ణ స్థలం నిర్మాణం RCC ఇల్లుతో 1150 చ.అ. **సరిహద్దులచే: తూర్పు:** జొన్నలగడ్డ శ్రీనుకు చెందిన గోడ ఆస్తి, **పడమర:** పంచాయతీ బజార్, **ఉత్తరం:** షేక్ మైమున్నీసా ప్రవీణ్‌కు చెందిన ఆస్తి, **దక్షిణం:** కె. కోటేశ్వరరావుకు చెందిన ఆస్తి. పై సరిహద్దులలో 145.2 గ. లేదా 121.40 చ.మీ. యొక్క విస్తీర్ణం యొక్క స్థలం 1150 చ.అ.తో నిర్మాణం RCC ఇల్లు అన్ని ఈజ్‌మెంట్ హక్కులతో. | | | |

**ఇ-వేలం యొక్క నియమాలు మరియు నిబంధనలు :**
1. విక్రయం యొక్క సవివరమైన నియమాలు మరియు నిబంధనలకు దయచేసి www.niwashfc.com పై ఏర్పాటు చేయబడిన లింక్‌కు రిఫర్ చేయండి మరియు మా సేల్స్ & మార్కెటింగ్ మరియు ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్, Credauction.com యొక్క NHFPL వెబ్‌సైట్‌కు.
2. మా పోర్టల్స్ https://www.niwashfc.com/Auction-Notices లింక్ క్రింద అవన్నీ ప్రచురింపబడినవి.
3. కాగోరు బిడ్డర్లు ఇ-వేలానికి సంబంధించి ఏ విచారణకైనా, ఆస్తి యొక్క సమాచారం & తనిఖీకి, సపోర్ట్, విధానం మరియు ఆన్‌లైన్ శిక్షణకు మా సేల్స్ & మార్కెటింగ్ విభాగం మరియు ఇ-వేలం సర్వీస్ భాగస్వామి యొక్క క్లైంట్ సర్వీస్ డెలివరీ (CSD) విభాగాన్ని సంప్రదించవచ్చును.
**Credresolution ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ టెలి. నం.: +91 9137100020 & 9819167197 మరియు ఇ-మెయిల్ ID: balram@credsolv.com లేదా amit@credsolv.com NHFPL యొక్క అధీకృత అధికారి కాగిత కిషోర్ - 9966111777 ద్వారా.**
* గమనిక :- NHFPL విక్రయ ప్రకటనను రుణగ్రహీత(లు) అందరికీ స్పీడ్/రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా జారీ చేస్తున్నారని దయచేసి గమనించ కోరుతున్నాము. ఎవరైనా పార్టీలకు అవి అందని పక్షంలో ఈ విక్రయ ప్రకటన యొక్క ప్రచురణ సర్వీస్ యొక్క పద్ధతికి ప్రత్యామ్నాయంగా పరిగణించబడుతుందని ఇందుమూలముగా ప్రకటించడమైనది.

ప్రదేశం : గుంటూరు, ఆంధ్రప్రదేశ్
తేదీ : 19.12.2025

సం/- అధీకృత అధికారి
నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
**గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు**

సెం. టి.ఓ./117 నుండి 119/2025-26 తేది: 12.12.2025

కార్యనిర్వాహక ఇంజనీరు, గ్రా.నీ.స & పా. విభాగము, నరసరావుపేట, పల్నాడు జిల్లా పరిధిలోని యస్.బి.యం(జి) గ్రాంట్ నందు మంజూరైన 3 పనులకు అంచనా విలువ: రూ.24.00 లక్షలకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లు 20.12.2025 నుండి ఇ-మార్కెట్ ప్లేస్ www.eprocurement.gov.in నందు చూడగలరు.

సం/-. కార్యనిర్వాహక ఇంజనీరు, గ్రా.నీ.స & పారిశుధ్య విభాగము, నరసరావుపేట.

DIPR.NO. 18439/CL/ADVT/1/1/2022-23 తేది: 18.12.2025



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
**పంచాయతీరాజ్ శాఖ**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు**

సెం. 17/టి1/2025-26, నిట్ సెం. 82/2025-26. తేది: 16.12.2025

గుంటూరు జిల్లా పరిధిలోని పత్తిపాడు నియోజక వర్గములో యం.పి.లాడ్స్ (యంపిఎల్.యస్) గుంటూరు వారి నిధుల క్రింద మంజూరైన 1 పనికి అంచనా విలువ: రూ. 15.00 లక్షలకు టెండర్లు తేది: 24.12.2025 నుండి ఇ-మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in ద్వారా కోరబడుచున్నవి.

సం/-. కార్యనిర్వాహక ఇంజనీరు, (పి.ఆర్) పి.ఐ.యు.డివిజన్, గుంటూరు.

DIPR.NO. 18449/CL/ADVT/1/1/2022-23 తేది: 18.12.2025

వార్త


విద్యలేకపోయినప్పటికీ గర్వించేవాడు, దరిద్రుడైనప్పటికీ పెద్దఎత్తులు వేసేవాడు, పనులు చేయనప్పటికీ ధనాన్ని ఆశించేవాడు మూర్ఖుడు.

-లావోసు

# పేరుమారిన 'గ్రామీణ ఉపాధి'

ఇప్పుడు గ్రామీణ ఉపాధి పథకం పేరు మారింది. వికసిత్ భారత్ గ్యారంటీ ఫుడ్ రోజ్ గార్ అండ్ అజీవకా మిషన్ గ్రామీణ్ (విబిజి రామ్ జి)గా గురువారం లోక్‌సభలో విపక్షాల నిరసనల హోరు మధ్య బిల్లుకు ఆమోదం లభించింది. పేరొక్కటే మార్చుకుంటే ప్రభుత్వాలు మారినప్పుడల్లా పథకాల పేర్లు మార్చడం మామూలేగా అని సరిపెట్టుకునే వీలుంది. కానీ ఆపథకంలోని విధివిధానాలు మారిపోనుండటమే ప్రస్తావించుకోవాల్సి ఉంది. ఎంతో మంది గ్రామీణ పేదలు ఉపాధి కూలీలుగా తమ జీవన విధానాన్ని విజయవంతంగా మార్పు చేసుకోగలిగారు. అంటే కొంతలో కొంత వద్దికగా ఐదువేళ్లూ వారి కుటుంబానికి నోట్లోకి చేరాయి. చాలా మంది పొలం పనులకు వెళ్లేవారు కూడా ఉపాధి కూలీకి వెళ్లి పొట్టపోసుకున్నారు. ఉపాధి కల్పన పథకం కొన్ని చిన్న చిన్న అంశాల్లో కాస్త వెసులుబాటు ఉన్నా గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాయనే అంచనాఉంది. గత 20ఏళ్లలోనూ గ్రామీణ మౌలిక వసతుల కల్పనలో గణనీయమైన మార్పులను గుర్తించి ఎప్పటికప్పుడు ప్రతిపాదనలు, అంచనాల మేరకు నిధుల కేటాయింపు వేగంగా జరిగి గ్రామాల అభివృద్ధి బాగా జరిగిందన్న అభిప్రాయం సర్వత్ర వ్యక్తమైంది. కొత్తగామహాత్మా గాంధీ పేరు స్థానే 'వీబి- జీరామ్‌జీ' పేరిట మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త విధి విధానాలు రూపొందించింది. అవన్నీ గతంకన్నా భిన్నంగా ఉండడంతోనే అసలు చిక్కొచ్చిపడింది. ఉపాధి దినాలను 100నుంచి 125కి పెంచడం బాగానే ఉంది. కానీ మిగిలిన షరతులన్నీ ఏమాత్రం మెరుగైన ఉపాధి కల్పించే స్థాయిలో లేవు. గతంలో మొత్తమంతా కేంద్రమే భరించేది. ఇప్పుడైతే రాష్ట్రాల వారీకొంత మేరకు కేంద్రం నిధులు సమకూరుస్తుంది. ఆ నిధులున్నంతవరకే ఎలాంటి ఉపాధి పనులైనా జరిపించుకోవచ్చు. రాష్ట్రాలకు నిధుల కేటాయింపు మేరకే పనులు జరిపించుకోవాలి. తప్పితే అంతకన్నా నిధులు ఎక్కువ అవసరమైతే ఆ సొమ్మును రాష్ట్ర ఖజానా నుంచే ఖర్చు పెట్టుకోవాల్సి ఉంటుంది. ఇవన్నీ పంచాయతీ అవసరాలకేఖర్చు చేయాలి. ఏమాత్రం తేడా ఉన్నా నిధులు ఆగిపోతాయి. వ్యవసాయ సీజన్‌లో 'ఉపాధి హామీ'కి హాలిడే ప్రకటించాలన్న నిబంధన కొత్తగా చేర్చాయి. గతంలో ఇలాంటి హామీలేనందున వ్యవసాయ కూలీలు ఎవరూఅందుబాటులో ఉండేవారు కాదు. కొత్త విధానాన్ని బట్టి వ్యవసాయ కూలి పనులకు అవసరమైనంత మేరకు కూలీలు దొరకుతారు. ఇదొక్కటే మంచి మార్పు. గతంలో వ్యవసాయ కూలీలు దొరక్క కొత్తగా వచ్చేవారికి కూలిరేట్లు పెంచి తీసుకోవడంలో రైతులకు ఎక్కువ సాగు ఖర్చయ్యేది. అంతేకాదు కూలీలు దొరకని సందర్భంలో యాంత్రీక వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించారు. అంతకు ముందు ఈ ఉపాధి పథకం ఉనికిలోలేని సమయంలో గ్రామీణ ప్రాంతాల్లోకి యాంత్రాలొస్తేనే పేదలు ఉద్యమించేవారు. కొన్ని అధికార గణాంకాలుతీసుకుంటే పేదరికం తగ్గిందన్నమాటకు ప్రత్యామ్నాయంగా గ్రామీణ ఉపాధి పథకాన్నే గుర్తుంచుకోవాల్సి వస్తుంది. అలాంటిది ఆ పథకానికి తూట్లు పొడవడానికి ఏ విపక్ష నాయకుడు కానీ రైతులు కానీ అంగీకరించరు. సర్పంచ్‌లనడిగినాఇదే చెబుతారు. కానీ కేంద్ర పాలకులు రూపురేఖావిలాసాలతో సహా 'నరేగా'ను మార్చాల్సిందేననే ధోరణి వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకంలో అమలు క్రమంలో బయటపడిన డొల్లతనం కానీ, లోపాలు కానీ లేవని అనుకోలేం. అలా అని ఉపాధిపథకానికి 90శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వాలే సమకూర్చుకోవాలని ప్రతిపాదించడమంటే ఒక కాలు విరగ్గొట్టడమే అవుతుంది. నిధులుంటే సరే సరి. లేకుంటే ఆ పథకమూ, పథకం వల్ల కలిగే ప్రయోజనాల పరిస్థితి కుంటినడకే! తాజాగా ఉపాధి హామీ పథకం 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆ జీవికా మిషన్-గ్రామీణ్ (వి.బి జీరామ్‌జీ)గా మారుతుంది. ఈ పథకానికి మంగళం పాడేందుకే పేరు మార్పు పథక విధివిధానాల మార్పు అని అధికార పక్షం అంటుందని కాంగ్రెస్‌తదితర విపక్ష నేతలు విమర్శిస్తున్నారు. పేదల సంక్షేమం, ఉపాధి పెంపు కోసమే బిల్లును తాజాగా ప్రవేశపెట్టినట్లుప్రభుత్వం చెబుతోంది. అధికార పక్షం చేసే అంశాలపై తనదైన శైలిలో కొన్నిటిని ప్రశంసిస్తూ, కొన్నిటికి ఆమోదముద్ర వేస్తూ వచ్చిన కాంగ్రెస్, ఎంపీ శశిథరూర్ మాత్రం ఆ పథకంలో మహాత్మాగాంధీ పేరును తొలగించడం, పథకానికిదాదాపు స్వస్తి చెప్పే ఆలోచనతో చేస్తున్న మార్పులని వ్యతిరేకించారు. గ్రామీణ పేదలకు జీవనోపాధి భద్రత, వలసల తగ్గింపు, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి సాధన అనే మూలసూత్రాలతో అమలవుతున్న 'ఉపాధి'ని ఏకమొత్తంగా మార్పు చేయడం తగదని కాంగ్రెస్ ఎంపీలు ముక్త కంఠంతో ప్రభుత్వాన్ని కోరారు. కొత్తబిల్లు ప్రకారం కేంద్రం, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు 60:40 దామాషాలో ఖర్చులుభరించుకోవాలి. ఉత్తరాఖండ్ హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకాశ్మీర్‌తో సహా ఈశాన్య, హిమాలయన్ రాష్ట్రాలు మాత్రం 10 శాతం నిధులు సమకూర్చుకోవాలి. ఈపథకం అమలు పర్యవేక్షణ కేంద్ర గ్రామీణ ఉపాధి హామీ కౌన్సిల్, రాష్ట్ర గ్రామీణ ఉపాధి హామీ కౌన్సిల్‌లు పర్యవేక్షిస్తాయి. సాగు సీజన్‌లలో పరిస్థితులను బట్టి వాటిని రాష్ట్ర ప్రభుత్వాలే తాత్కాలికంగా నిలిపివేసుకోవచ్చు. మహిళలు, వృద్ధులు, పిల్లలకు ప్రత్యేక కూలీ రేట్లు ప్రభుత్వమే ప్రతిపాదిస్తోంది. దరఖాస్తు చేసుకున్న 15 రోజులోపల ఉపాధిని కల్పించలేని పరిస్థి తులలో వారికి రోజువారీ నిరుద్యోగభృతిని చెల్లించాల్సి ఉంటుంది. ఇలా కొన్ని కొత్త విధానాలను, అవకాశాలను వెలుసుబాటు చూపింది. ఏమయితేనేం కేంద్రం నిర్దేశించిన ప్రాధాన్యతలు ఈ పథకం స్వరూపం మారిపోయే అవకాశం ఉంటుందని పలువురు చేస్తున్న విమర్శల గూర్చి కేంద్రం పునరాలోచన చేయాల్సి ఉంటుంది.

మన మంచి గుణాలను మనం మరచిపోవచ్చు. కాని దేవుడు మాత్రం మరవడు.



షేక్‌స్పియర్

అంతరాయాలు కలుగుతున్న కొద్దీ సంకల్పాన్ని దృఢతరం చేసుకుంటూ పోవాలి.



శ్రీరమణ మహర్షి

# ఆర్థిక సమానత్వంతోనే సామాజికాభివృద్ధి

**అసమానతలను పట్టించుకోని అభివృద్ధి చివరకు ప్రజాస్వామ్యానికే ప్రమాదం. ఇది కేవలం ఆర్థిక నివేదిక కాదు, ఇది పాలకులకు ఒక హెచ్చరిక లాంటిది, ప్రజలకు ఒక అద్దం లాంటిది, రాజ్యాంగానికి ఒక స్మరణ లాంటిది. భారతదేశం ఈ హెచ్చరికను గమనిస్తే సమానత్వం ఉన్న దేశంగా మారే అవకాశం ఉంది. అంబేద్కర్ హెచ్చరికలు నేటికీ నిజమవుతున్నాయి. అసమానతలపై పోరాటం లేకుండా భారత ప్రజాస్వామ్యం నిలబడదని, భారతదేశం ఒకసమానత్వప్రయోగం. ఆ ప్రయోగం విజయం సాధించాలంటే రాజకీయ పార్టీలు రాజ్యాంగానికి విధేయులవ్వాలి, ప్రజలు సమానత్వానికికాపలాదారులవ్వాలని వక్కాణించారు. అసమానతలను పట్టించు కోని అభివృద్ధిచివరకు ప్రజాస్వామ్యానికే ప్రమాదం, అందుకే రాజ్యాంగాన్ని కాపాడుకుంటూ ప్రభుత్వం, వ్యవస్థలు చేసే తప్పులను ప్రజలే పోరాటాల రూపంలో ఎత్తిచూపిస్తూ అన్నింటిలోనూ సమానత్వాన్ని సాధించుకోవాలి.**

డా. ఎ . భాగ్యరాజ్

భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా గుర్తింపు పొందిన దేశం. కానీ అదే సమయంలో ప్రపంచంలో అత్యధిక ఆర్థిక, సామాజిక, లింగ, ప్రాంతీయ అసమానతలు ఉన్న దేశాలలో ఒకటిగా కూడామారుతోంది. ప్రపంచం అభివృద్ధి, వృద్ధి రేటు, జాతీయ స్థూల ఉత్పత్తి (జీడీపీ) అనే పదాలతో మత్తెక్కిపోతున్న ఈ కాలంలో, ఈ ప్రశ్నకు నిర్దాక్షిణ్యమైన సమాధానం చెప్పే రీతిలో ఉన్నదే ప్రపంచ అసమానతల నివేదిక (వరల్డ్ ఇనీక్వాలిటీ రిపోర్ట్). అభివృద్ధి అనే పదం గణాంకాల్లో మెరుస్తున్నా, ఆ అభివృద్ధి ఫలాలు సమానంగా ప్రజలందరికీ అందుతున్నాయా? అభివృద్ధి ఫలాలు ఎవరి చేతుల్లోకి వెళ్తున్నాయి? అనే ప్రశ్న మరింత కీలకంగా మారింది. ఈ రోజు భారత సమాజం ముందు నిలిచిన కఠిన సత్యం. వరల్డ్ ఇనీక్వాలిటీ రిపోర్ట్ తాజా నివేదిక, గత కొన్నేళ్ల గణాంకాలు ఒక స్పష్టమైన సంకేతం ఇస్తున్నాయి. ప్రపంచ సంపద పెరుగుతోంది, కానీ సమానత్వం తగ్గుతోంది. ఈ ప్రపంచ ధోరణిలో భారతదేశం ఒక ప్రధాన ఉదాహరణగా నిలుస్తోంది. వేగవంతమైన ఆర్థిక వృద్ధి, డిజిటలైజేషన్, మౌలిక సదుపాయాలనిర్మాణం ఇవన్నీ ఒకవైపు కనిపిస్తే, మరోవైపు పెరుగుతున్న అసమానతలు భారత ప్రజాస్వామ్యానికి సవాలుగా మారుతున్నాయి. అసమానతలు సంఖ్యల సమస్య కాదు, సమాజ నిర్మాణ సమస్య. అసమానత అనగానే చాలామంది దానిని పేద, ధనిక మధ్య తేడాగా మాత్రమే చూస్తారు. కానీ ప్రపంచ అసమానతల నివేదిక (వరల్డ్ ఇనీక్వాలిటీ రిపోర్ట్) చెబుతున్నది వేరే విషయం. అసమానతలంటే ఆదాయంలో తేడా, సంపదలో కేంద్రీకరణ, అవకాశాలలో లోపం, విద్య, ఆరోగ్యం, ఉపాధిలో అసమాన పంపిణీ, కుల, లింగ, ప్రాంతీయ వివక్షలు. ఇవన్నీ కలిసినప్పుడు ఒక దేశం నిజంగా అభివృద్ధి చెందిందా లేదా అన్నది తెలుస్తుంది. భారతదేశం స్వాతంత్రం పొందిన తరువాత ప్రజలందరికి ఒక గొప్ప హామీ ఇచ్చింది. ఆ హామీ పేరు సమానత్వం. కులం, మతం, లింగం, ఆర్థిక స్థితి ఆధారంగా ఎవ్వరూ వెనుకబడకూడదు అన్నది డా. బి.ఆర్. అంబేద్కర్ దృష్టిలో అసమానత ఒక ఆర్థిక సమస్య కాదు. ఆయన అసమానతను కేవలం ఆదాయం లేదా పేదరిక సమస్యగా చూడలేదు. ఆయనదృష్టిలో అసమానత అనేది సామాజిక నిర్మాణం, కుల వ్యవస్థ ఫలితం, ఆర్థిక దోపిడీకి పునాది, రాజకీయ ప్రజాస్వామ్యానికి ప్రధాన అడ్డంకి అని స్పష్టంగా చెప్పారు. సామాజిక సమానత్వం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం నిలబడదు అని స్పష్టంగా చెప్పారు. అంటే రాజకీయంగా సమానత్వం, సామాజికంగా అసమానత ఈ విరుద్ధత కొనసాగితే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని ఆయన హెచ్చరించారు. నేడు అదే జరుగుతోంది. డా.బి.ఆర్. అంబేద్కర్ దృష్టిలో సమానత్వంభారత రాజ్యాంగం ఆర్టికల్ 14 ( సమానత్వం), ఆర్టికల్ 15 (వివక్ష నిషేధం), ఆర్టికల్ 17 (అంటరానితనం రద్దు) చేసింది. కానీ వాస్తవంలో కుల వివక్ష కొనసాగుతోంది, ఆర్థిక అసమానత పెరుగుతోంది, అవకాశాలు సమానంగా లేవు అంబేద్కర్ భయపడిన పరిస్థితి ఇదే. ఆర్థిక అసమానతలపై అంబేద్కర్ ఆలోచన ఒక అపోహని తీవ్రంగా ఖండించారు. ముందు ఆర్థిక సమానత్వం వస్తే, సామాజిక సమానత్వం వస్తుంది అన్న వాదనను ముందుచారు. కానీఆయన చెప్పింది సామాజిక అసమానత ఉన్నంత కాలం, ఆర్థిక సమానత్వం అసాధ్యం. భూమి, వనరులు, పరిశ్రమలు కొద్దిమంది చేతుల్లో ఉంటే, పేద వర్గాలు ఎప్పటికీ విముక్తి పొందలేరని ఆయనవెల్లడించారు. అంబేద్కర్ రాజకీయ పార్టీలను ప్రజాస్వామ్యానికి అవసరమైన సాధనంగా చూశారు. కానీ ఆయన ఒక విషయాన్ని



స్పష్టంగా చెప్పారు. నేడు రాజకీయ పార్టీలు అధికార సాధనకే పరిమితమవుతున్నాయి కానీ, కులం, మతం, భావోద్వేగాల మీద రాజకీయాలు చేస్తున్నాయి. అసమానతలమూలాలపై మాట్లాడటం లేదు. ఇది అంబేద్కర్ ఆశించినరాజకీయ సంస్కృతి కాదు. భారతదేశంలోని అసమానతల మూలం కుల వ్యవస్థ. కులం జన్మతో నిర్ణయించబడుతుంది, వృత్తి జన్మతోనే బంధించబడుతుంది. గౌరవం కూడా కులంతోనే కొలవబడుతుంది. ఇది ఆర్థిక అసమానతకు మాత్రమేకాదు, మనుషుల మధ్య మానవత్వం లేని విభజనకు కారణమవుతుంది. అంబేద్కర్ కుల వ్యవస్థను ఒకరు పైగా, మరొకరు కిందగా ఉండే వ్యవస్థ అని వెలిబుచ్చారు. ప్రపంచంలో, భారతదేశంలోని అత్యంత ధనిక ఒక శాతం వర్గం అపూర్వమైన సంపదను సొంతం చేసుకుంటోంది, మధ్యతరగతి వర్గం క్రమంగా క్షీణిస్తోంది. కోవిడ్ అనంతరం పేదరికం తగ్గినట్టు కనిపించినా, అసమానత మరింత పెరిగింది. ప్రభుత్వాలు పన్ను విధానాల ద్వారా సంపదను పునర్విభజించడంలో విఫలమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో భారతదేశం ఎమర్జింగ్ ఎకానమీగా ప్రశంసలు పొందుతున్నప్పటికీ, అసమానతల విషయంలో ప్రపంచంలోనే ముందంజలో ఉన్న దేశాల జాబితాలోకి చేరుతోంది. భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా పెరుగుతోందని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. కానీ వరల్డ్ ఇనీక్వాలిటీ నివేదిగాక వెల్లడించేది ఈ వృద్ధి ఎవరి జీవితాలను మార్చింది అని. భారతదేశంలో సంపద కేంద్రీకరణ అత్యంత ధనిక ప్రజలు దేశ సంపదలో భారీ భాగాన్ని నియంత్రిస్తున్నారు, మరోవైపు, దేశంలోని క్రింది 50 శాతం ప్రజలకు కలిపి ఉన్న సంపద అత్యంతస్వల్పం. ఇది స్వాతంత్ర్యానంతరం ఎప్పుడూ లేని స్థాయిలో సంపద కేంద్రీకరణ పెరిగిందని నివేదికల ధోరణులు సూచిస్తున్నాయి. ఆదాయంకంటే సంపదలోనే తీవ్ర అసమానత, భారతదేశంలో ఆదాయ అసమానత కంటే సంపద అస మానత చాలా ప్రమాదకరంగా మారింది. సంపద అంటే భూమి, ఇళ్లు, పరిశ్రమలు, షేర్లు, వారసత్వ ఆస్తులు, ప్రభుత్వ భూములు, ఖనిజ సంపదలు, ఈ ఆస్తులు కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతున్నాయి. దీని ఫలితంగా పేద కుటుంబాలు తరతరాలుగా పేదలుగానే మిగిలిపోతున్నాయి, ధనిక కుటుంబాలు మరింత ధనికులవుతున్నాయి, ఇది సామాజిక చలనశీలతను పూర్తిగా దెబ్బతీస్తోంది. భారత దేశంలో విద్య, ఆరోగ్యం ఖర్చులు క్రమంగా పెరుగుతున్నాయి. ఉద్యోగ భద్రత తగ్గుతోంది, ఆదాయం స్థిరంగా పెరగడం లేదు, సామాజిక అసంతృప్తి పెరుగుతోంది. ఇది దీర్ఘకాలంలో దేశస్థిరత్వానికే ముప్పుగా మారే ప్రమాదముంది. ఉపాధి లేని వృద్ధితో అసమానతలకు ప్రధాన కారణం, భారతదేశ ఆర్థిక వృద్ధి ఒక ప్రధాన లోపంతో ముందుకెళ్తోంది. యువతలో నిరుద్యోగం పెరుగుతోంది, అనధికార రంగం విస్తరిస్తోంది, కాంట్రాక్ట్, గిగ్ ఉద్యోగాలు పెరిగి భద్రత తగ్గుతోంది. వరల్డ్ ఇనీక్వాలిటీ రిపోర్ట్ సూచన ఏమిటంటే ఉద్యోగాలు సృష్టించని అభివృద్ధి అసమానతలను తప్పనిసరిగా పెంచుతుందని. కులం, లింగం, ప్రాంతం ఇలా బహుముఖ అసమానతలు, భారత అసమానత కేవలం ఆర్థికమేకాదు, అది సామాజికంగా కూడా ఉంది. మహిళల శ్రామికంగా పాల్గొనే రేటు తక్కువ. మహిళల ఆదాయం పురుషులతో పోలిస్తే గణనీయంగా తక్కువ, కుల అసమానత, ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఇంకా భూమి, విద్య, ఉపాధిలో వెనుకబడి ఉన్నాయి. ప్రాంతీయ అసమానతలు కొన్ని రాష్ట్రాలు వేగంగా అభివృద్ధి చెందుతుంటే, మరికొన్ని రాష్ట్రాలు మౌలిక సదుపాయాలకే నోచుకోలేకపోతున్నాయి. ఇవన్నీ కలిపి భారతదేశాన్ని బహుముఖ అసమానతల దేశంగా మారుస్తున్నాయి. ప్రపంచ అసమానతల నివేదిక ప్రకారం భారతదేశానికి ఇచ్చే సందేశం సుస్పష్టంగా తెలియజేసింది, అసమానతలను పట్టించుకోని అభివృద్ధి చివరకు ప్రజాస్వామ్యానికే ప్రమాదం. ఇది కేవలం ఆర్థిక నివేదిక కాదు, ఇది పాలకులకు ఒక హెచ్చరిక లాంటిది, ప్రజలకు ఒక అద్దం లాంటిది, రాజ్యాంగానికి ఒక స్మరణ లాంటిది. భారతదేశం ఈ హెచ్చరికను గమనిస్తే సమానత్వం ఉన్న దేశంగా మారే అవకాశం ఉంది. అంబేద్కర్ హెచ్చరికలు నేటికీ నిజమవుతున్నాయి. అసమానతలపై పోరాటం లేకుండా భారత ప్రజాస్వామ్యం నిలబడదని, భారతదేశం ఒకసమానత్వప్రయోగం. ఆ ప్రయోగం విజయం సాధించాలంటే రాజకీయ పార్టీలు రాజ్యాంగానికి విధేయులవ్వాలి, ప్రజలు సమానత్వానికికాపలాదారులవ్వాలని వక్కాణించారు. అసమానతలను పట్టించుకోని అభివృద్ధిచివరకు ప్రజాస్వామ్యానికే ప్రమాదం, అందుకే రాజ్యాంగాన్ని కాపాడుకుంటూ ప్రభుత్వం, వ్యవస్థలు చేసే తప్పులను ప్రజలే పోరాటాల రూపంలో ఎత్తిచూపిస్తూ అన్నింటిలోనూ సమానత్వాన్ని సాధించుకోవాలి. •

# వ్యవసాయంలోనూ సంస్కరణలు అవసరం

బుగ్గన మధుసూదనరెడ్డి

ఇప్పటివరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి కొద్దో గొప్పో ప్రాముఖ్యత ఇచ్చే పనిలో భాగంగా పీఎం కిసాన్ నిధి, రైతు భరోసా, కొన్ని పంటలకు మాత్రమే ఇస్తున్న నష్ట పరిహారం, రైతు పండించే పంటలకు అతి కొద్దిశాతం మాత్రమే ఇచ్చే సబ్సిడీ విత్తనాలు, ట్రాక్టర్, వ్యవసాయ పరికరాల కొనుగోలు వంటి వాటిపై అరకొరగా మాత్రమే రైతులకు సబ్సిడీగా అందజేస్తున్నారు అనే మాట సత్య దూరం కాదు. అయితే దేశ వ్యాప్తంగా 60 శాతానికి పైగా ప్రజానీకం ఇప్పటికి వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న నేపథ్యంలో అయా రంగ అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింతగా శ్రద్ధ కనబరచాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది. ఎందుకంటే దేశవ్యాప్తంగా వున్న రైతులలో చాలా మటుకు ఎక్కువ భాగం చిన్న, సన్నకారు రైతులు వున్న నేపథ్యంలో వారికున్న అరకొర ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకొని వారికి పెన్షన్ సౌకర్యం కలిగించడంతో పాటు ఏదేని కుటుంబాన్ని పోషించే రైతు అనుకోని పరిస్థితుల్లో ఏదేని ప్రమాదం వల్లనో లేక అన్యూహమైన రీతిలో ఆ రైతుకు మరణం సంభవించినప్పుడో ఆ రైతు తరపున ఆ కుటుంబానికి ఆర్థిక వెసులుబాటు లభించేలా ఆ రైతు తరపున లైఫ్ ఇన్సూరెన్సు సౌకర్యం మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడితే వారి జీవితాలకు ఎనలేని భరోసాను కల్పించిన వారవుతారు. అదేవిధంగా ఒక చిన్న, పెద్ద కుటుంబాన్ని పోషించే రైతు దురదృష్టవశాత్తు అనారోగ్యం పాలు అయితే ఆయనపై ఆధారపడిన కుటుంబం ఆ రైతుకు వచ్చిన జబ్బును నయం చేసేందుకు తగినంత ఆర్థిక వనరులు వారి దగ్గర లేకపోవొచ్చు. అలాంటి సందర్భాలలో హెల్త్ ఇన్సూరెన్సు అత్యంత అవశ్యకం. ఈ స్కీమ్ సైతం అమలు చేసేందుకు కేంద్రప్రభుత్వాలు ఆలోచించాల్సిన అవశ్యకత ఎంతైనా వుంది. ఇంకా చెప్పుకుంటూపోతే రాత్రనక, పగలనక, వాననక, ఎండనక ఆరుగాలాలు శ్రమించి పండించే పంటలకు గిట్టుబాటు ధరలు లభించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర కృషి సల్పాల్సిన గురుతర బాధ్యత వారి



భుజస్కంధాలపై ఎంతైనా వుంది. అదేవిధంగా రైతు సోదరులు పంటలు విత్తే విషయంలో వారు తీసుకునే విత్తనాలపై సబ్సిడీ సౌకర్యం, అలాగే పంటవేసిన తరువాత వాటిని కాపాడే నిమిత్తమై వాడే బయో ఫర్టిలైజర్, బయో ఫెస్టిసైడ్స్ మందులపై సబ్సిడీ సౌకర్యాన్ని ప్రవేశపెడితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సోదరులకు ఎంతో మేలు చేసిన వారవుతారు. ఇలాంటి సౌకర్యాలు అన్ని ప్రతి రైతు పొందేలా వారికి ఒక ప్రత్యేక కార్డును అందజేస్తే ఎలాంటిపొరపాట్లకు తావు లేకుండా ప్రతిఒక్క రైతు వీటివల్ల లబ్ది పొందగలడు. అన్నింటికి మించి ఇప్పటి కాలంలో వ్యవసాయరంగం అనేది మోయలేని భారం వంటిది అని ప్రతి ఒక్కరూ భావిస్తూ ఆయా రంగం వైపు వెళ్లాలంటేనే జంకే పరిస్థితులుప్రస్తుతం నెలకొన్న నేపథ్యంలో, ప్రస్తుత యువతరం సైతం ఈ రంగంపైఅనాసక్తి కనబరుస్తున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంలో ఒకటికి, రెండు సార్లు ఆలోచించి ఎలాంటి స్ఫూర్తిదాయకమైన సంస్కరణలు వ్యవసాయరంగంలో చేపడితే యువత వ్యవసాయరంగంపై మెగ్గు చూపుతారో, ఆయా వ్యవసాయ నిపుణులతోచర్చించి మరీ కసరత్తు చేయాల్సిన తక్షణ కర్తవ్యం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలపై ఎంతైనా వుంది. ఏదిఏమైన అనాదిగా భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలలో ఒక భాగంగా వుంటూ రావడమే కాదు నిన్న, మొన్నటి వరకు ఒక వెలుగువెలిగిన వ్యవసాయ రంగం అనేక కారణాలరీత్యా, ప్రస్తుతం తీవ్ర గడ్డుపరిస్థితులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వ్యవసాయరంగం తిరిగి పూర్వపు వైభవం దిశగా పయనించేలా, అది ప్రస్తుత, రాబోయే తరం యువతకు మంచి లాభదా యకమైన వృత్తిగా మారేలా చేయాల్సిన గురుతర బాధ్యత మాత్రం ముమ్మాటికీ మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వల పెద్దలదే అనడంలో ఇసుమంతైనను సందేహంలేదు. ఏమైనాయావత్ దేశానికి పట్టేడు అన్నం పెట్టే అన్నదాతలు తమ వ్యవసాయ రంగంలో ఎలాంటి ఇబ్బందులు, ఒడిదుడుగులు, ఆటుపోట్లు, ప్రతికూల, దయనీయ పరిస్థితులు ఎదుర్కొనకుండా పచ్చగా, సుభిక్షంగా ఉంటేనే మనదేశం అభివృద్ధి పథంలో దూసుకుపోయేది అనేమాట అక్షరసత్యం. ఇప్పటికి దేశావ్యాప్తంగా కూడా మెజారిటీ ప్రజలు ఎక్కువగా ఆధారపడేది వ్యవసాయ మీదే. కాబట్టి మన దేశ పాలకులు ఎక్కువగా వ్యవసాయరంగం మీద ఫోకస్ చేసి, యుద్ధ ప్రాతిపదికన ఆ రంగ అభివృద్ధికి పెద్దపీట వేయాలి. •

# ప్రజావాక్కు



## ఆర్థిక వెసులుబాటు అవసరం

**ఇటీవల** రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి యువ ఇండియా పాఠశాలల కోసం రుణ పరిమితిని మాఫీచేయాలని కోరడం విద్యారంగంలో ప్రాధాన్యత కలిగిన అంశంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న విద్యా సంస్కరణల వివరాలను కేంద్రానికి తెలియజేస్తూ, ఈ పాఠశాలలు రాష్ట్ర భవిష్యత్తు నిర్మాణంలో ఎంతకీలకమో ముఖ్యమంత్రి స్పష్టంగా వివరించారు. యువ ఇండియాపాఠశాలలు ఆధునిక మౌలిక వసతులు, నాణ్యమైన బోధన, డిజిటల్ సాంకేతికతతో కూడిన తరగతులద్వారా విద్యార్థులను ప్రపంచస్థాయి పోటీలకు సిద్ధం చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు అవుతున్నాయి. గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య ఉన్నవిద్యా అంతరాన్ని తగ్గించి, ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్ఠను పెంచడంలో ఇవి కీలక పాత్ర పోషించనున్నాయి.

- టి. శ్రీనివాస్, చొప్పదండి

## రాష్ట్రాలకు నిధులు పెంచాలి

**ఉపాధిపైన** తీవ్ర గందరగోళంనెలకొన్న పరిస్థితి కనబడుతుంది. ఒకవేళ ప్రభుత్వం చెపుతున్నట్టుగా ఆస్తుల సృష్టికి తగ్గట్టు ఖర్చు ఎక్కువ అవుతుంది అనుకుందాం. అప్పుడు నేషనల్ లెవల్ మానిటరింగ్ కమిటీలు ఏమి చేస్తున్నట్టు. అసలు చిక్కుఏమిటి కేంద్రం తమబాధ్యతల నుండి తప్పుకోవడమే కదా రాష్ట్రాల ఆదాయాలను లెక్కలోకి తీసుకొనే కొత్త బిల్ తీసుకోస్తాం అని మొత్తుకుంటున్నా అది ఎంత వరకునిజం అనేది అసలుప్రశ్న. రాష్ట్రాలకు తమ అవసరాలకు తగ్గట్టుపనులు చేసుకునే స్వేచ్ఛఇస్తారా లేక ఆర్థిక భారం మాత్రమే మోపుతారా అనేది కూడా అసలు ప్రశ్నే.

- భారత అవినాష్, జనగామ

## పోస్టులను భర్తీ చేయాలి

**ఆంధ్రప్రదేశ్** జూనియర్ కళాశాలలో పూర్వకాలంలో లైబ్రేరియన్ పోస్టు జూనియర్ లెక్చరర్ ఇన్ లైబ్రరీ సైన్స్‌గా మార్చారు. శాశ్వత ప్రాతిపదికన ఖాళీలు నింపడానికి సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చారు. అందులో జోన్ రెండు జోన్ మూడులలో షెడ్యూల్డ్ ట్రైబ్ కేటగిరీలో రెండు పోస్టులు నింపడానికి నోటిఫికేషన్ ఇచ్చారు. క్యారీ ఫార్వర్డ్ పోస్టులను ఓపెన్ క్యాటగిరిగా మార్చమని అర్హత గల నిరుద్యోగులు అందరికీ అవకాశం కల్పించాలి.

- కె.హరికృష్ణ, విజయవాడ

## ఆధార్ సురక్షితమేనా?

**దేశంలో** ప్రభుత్వ, ప్రైవేటుసేవలకు ఆధార్ తప్పనిసరి గుర్తింపు పత్రంగామారడంతో, దీని వినియోగం విశిష్టస్థాయికి చేరుకుంది. ఈ విస్తృత వినియోగమే ఆధార్‌ను అత్యంత శక్తిమంతమైన సాధనంగా మార్చింది. అదే సమయంలో, ఇది కోట్ల మంది భారతీయుల సున్నితమైన వ్యక్తిగత సమాచారాన్ని కలిగి ఉన్న అతిపెద్దడేటాబేస్‌గామారింది. దీంతో, ఈడేట ఎంత సురక్షితం? అనే ప్రశ్నబలంగా వినిపిస్తోంది. ఆన్‌లైన్ ధృవీకరణలో యూఐడీఏఐ సర్వర్ల వద్ద భద్రత ఉన్నప్పటికీ, ప్రధాన సమస్య ఆఫ్‌లైన్ వినియోగంలోనే ఉంది. హోటళ్లు, ప్రైవేటు సంస్థలు ఫోటోకాపీలు, స్కానింగ్‌ల రూపంలో ఆధార్‌ను నిర్లక్ష్యంగా సేకరించి నిల్వ చేయడం డేటా భద్రతకు తీవ్ర ముప్పుగా మారుతోంది. ఇది చట్టబద్ధమైన అవసరమా, దుర్వినియోగమా అన్నదానిపై స్పష్టత కొరవడింది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ప్రైవేట్ పాఠశాలలపై నియంత్రణ అవసరం

**ఆంధ్రప్రదేశ్** రాష్ట్రప్రభుత్వం విద్యాశాఖలోవినూత్న మార్పులకు శ్రీకారం చుట్టింది. బ్లాక్ బోర్డ్ స్థానంలో గ్రీన్ బోర్డులు వాటికి అనుసంధానంగా ఎలక్ట్రానిక్ పానెల్ బోర్డ్స్ అమర్చారు. ఇంటర్నెట్ కనెక్షన్‌తో ఎంతో ఉపయోగకరమైన సమాచారాన్ని విస్తృతంగా అందరికీ అందించగలుగుతున్నారు. ఉపాధ్యాయ ఉపాధ్యాయులకు మెరుగైన జీతాలు మంచి సౌకర్యాలు కల్పించినప్పటికీ వారుచక్కగా బోధిస్తూ ఉన్నప్పటికీ విద్యార్థిని విద్యార్థులకు కనీసం నైపుణ్యాలైన చదవడం రాయడం చతుర్విధ ప్రక్రియలుసరిగారావడం లేదు. ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల బాటను అధికారులు అనుసరిస్తూ రిజల్ట్స్ పరీక్షల్లో పాస్ మార్కులు శత శాతం రావాలని తీవ్రమైన ఒత్తిడి ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు కల్పిస్తున్నారు.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## కుటుంబ నిర్వహణ ఒక కళ

**కుటుంబ** నిర్వహణ ఒక కళ. అది అందరికీ లేకపోవడం వల్ల కుటుంబ వ్యవస్థ అతలాకుతలం కావడానికి కారణమౌతుంది. సాటి మానవ ప్రవర్తనపై కనీస అవగాహనలేని దుస్థితి వచ్చింది. మొరటు ప్రవర్తన, సుఖలాలసత్వం, సుఖాలకు అడ్డు పడే రక్తసంబంధీకులనైనా చంపడానికి వెనుకాడకపోవడం. అంత్య నిష్ఠూరంకంటే ఆది నిష్ఠూరమే మంచిదని పిల్లలకు పెళ్లి కాగానే ఇంట్లో వేరుపడేయటం ఆచారమైనది..

-డా. దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

# విద్యార్థుల వైఫల్యానికి బాధ్యులు ఎవరు?

తిప్పర్తి శ్రీనివాస్

సమాజంలో తరచుగా వినిపించే ప్రశ్నవిద్యార్థి ఎందుకు విఫలమయ్యాడు? పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చినా, ఆశించిన ఫలితాలు రాకపోయినా, భవిష్యత్తుపై నమ్మకం కోల్పోయినా వెంటనే ఆ విద్యార్థినే తప్పుపట్టే ధోరణి మనలో ఎక్కువగా కనిపిస్తుంది. కానీ నిజంగా విద్యార్థి వైఫల్యానికి విద్యార్థి ఒక్కడేబాధ్యుడా? లేక కుటుంబం, ఉపాధ్యాయులు, విద్యావ్యవస్థ, సమాజం అన్నీకలిసి ఈ వైఫల్యానికి కారణమవుతున్నాయా? ఈ ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన అవసరం ఉంది. చదువుపై ఆసక్తి లేకపోవడం, క్రమశిక్షణ లోపించడం, సమయాన్ని వృథా చేయడం, మొబైల్ ఫోన్లు-సోషల్ మీడియాకు బానిసకావడం వంటి కారణాలు కొంతవరకు విద్యార్థి వైఫల్యానికి దారితీస్తాయి. లక్ష్యనిర్దేశం లేకుండా చదవడం, కష్టపడాలనే తపన లేకపోవడం కూడా ఫలితాలపై ప్రభావం చూపుతాయి. అయితే ఇవన్నీ విద్యార్థి స్వయంగా ఏర్పరుచుకున్న లోపాలా? లేక అతడిని చుట్టుముట్టిన పరిస్థితుల ఫలితమా అన్నది ఆలోచించాలి. విద్యార్థి ఎదుగుదలలో కుటుంబం కీలకపాత్ర పోషిస్తుంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, అవగాహన, మార్గనిర్దేశం విద్యార్థి భవిష్యత్తును నిర్దేశిస్తాయి. అయితే కొంత మంది తల్లిదండ్రులు తమ ఆశలను పిల్లలపై బలవంతంగా మోపుతారు. పిల్లల అభిరుచులు, సామర్థ్యాలు గమనించకుండా ఒకే రకమైన కోర్సులు, ఒకే లక్ష్యాలను విధిస్తారు. మరికొందరు చదువుపై శ్రద్ధ చూపకుండా పూర్తిగా ఉపాధ్యాయులపై బాధ్యత నెట్టేస్తారు. ఆర్థిక ఒత్తిళ్లు, కుటుంబ కలహాలు, తల్లిదండ్రుల నిర్లక్ష్యం కూడా విద్యార్థి మనసుపై తీవ్ర ప్రభావం చూపి వైఫల్యానికి దారి తీస్తాయి. కాబట్టి విద్యార్థి వైఫల్యానికి కుటుంబం బాధ్యత కూడా గణనీయమే ఉపాధ్యాయుల పాత్రను విస్మరించలేం. ఉపాధ్యాయుడు కేవలం పాఠాలు చెప్పే వ్యక్తిమాత్రమే కాదు, విద్యార్థి జీవితానికి మార్గదర్శి. అయితే నేటి విద్యావ్యవస్థలో కొంతమంది ఉపాధ్యాయులు బోధనను కేవలం ఉద్యోగంగా మాత్రమే భావిస్తున్నారు. విద్యార్థుల మనోస్థితిని అర్థం చేసుకోకుండా, వ్యక్తిగత శ్రద్ధ చూపకుండా యాంత్రికంగా పాఠాలు పూర్తిచేస్తున్నారు. పరీ



క్షల మార్కులకే పరిమితమై, సృజనాత్మకతను, ఆలోచనా శక్తిని పెంపొందించడంలో విఫలమవుతున్నారు. ఉపాధ్యాయుడు విద్యార్థిని ప్రోత్సహించాల్సినచోట, నిరుత్సాహపరిస్తే అది విద్యార్థి వైఫల్యానికి కారణమవుతుంది. విద్యా వ్యవస్థ కూడా విద్యార్థి వైఫల్యంలో ప్రధానపాత్రపోషిస్తుంది. మన విద్యావిధానం ఇప్పటికీ మార్కుల కేంద్రంగా కొనసాగుతోంది. పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించడమే విజయంగా భావించే పరిస్థితినెలకొంది. విద్యార్థి ప్రతిభను, నైపుణ్యాలను, ఆసక్తులను గుర్తించడంలో వ్యవస్థ విఫలమవుతోంది. రాటుదేల్చే పద్ధతి, భారం మోపే పాఠ్యాంశాలు, ఒత్తిడిని పెంచే పరీక్షా విధానం విద్యార్థులను మానసికంగా బలహీనులను చేస్తోంది. కొంతమంది విద్యార్థులు ఈ ఒత్తిడిని తట్టుకోలేక పూర్తిగా వెనుకబడిపోతున్నారు. ఇది విద్యార్థి తప్పుకంటే వ్యవస్థ వైఫల్యంగా భావించాలి. సమాజ ప్రభావం కూడా విద్యార్థి జీవితాన్ని ప్రభావితంచేస్తుంది. సమాజం విజయాన్ని ఒకే కొలమానంతో కొలుస్తోంది. డాక్టర్, ఇంజనీర్, ప్రభుత్వ ఉద్యోగం. ఈ పరిమిత దృక్పథం విద్యార్థుల్లో అనవసరమైన పోటీని, ఒత్తిడిని పెంచుతోంది. వృత్తివిద్య, కళలు, క్రీడలు వంటి రంగాలను తక్కువగా చూడటం వల్ల అనేక మంది విద్యార్థులు తమ సహజ ప్రతిభను వెలికితీయలేకపోతున్నారు. సమాజం అంగీకారం లేకపోవడం వల్ల వారు విఫలులుగా ముద్ర వేయబడుతున్నారు. ఇక సాంకేతిక పరిజ్ఞానం విషయానికి వస్తే, అది విద్యార్థికి వరమా శాపమా అన్నది వినియోగంపై ఆధారపడి ఉంటుంది. సరైన మార్గనిర్దేశం లేకపోతే ఇంటర్నెట్, సోషల్ మీడియా విద్యార్థిని చదువు నుంచి దూరం చేస్తాయి. ఈ విషయంలో కూడా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాధ్యత వహించాల్సిన అవసరం ఉంది. అంతిమంగా చెప్పాలంటే, విద్యార్థివైఫల్యానికి ఒకరిని మాత్రమే బాధ్యుడిగా చూపడం సరికాదు. విద్యార్థి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యావ్యవస్థ, సమాజం అందరూ కలిసి బాధ్యత వహించాలి. విద్యార్థిని అర్థంచేసుకొని, అతని సామర్థ్యాలకు అనుగుణంగా మార్గనిర్దేశం చేయగలిగితే వైఫల్యం తగ్గుతుంది. తప్పులను చూపించడమే కాకుండా, సరిదిద్దే అవకాశాలు కల్పించాలి. అప్పుడు మాత్రమే విద్యార్థి నిజమైన విజయాన్ని సాధించగలడు. వైఫల్యం అంతిమం కాదు. అది ఒక పాఠం. ఆ పాఠాన్ని సమాజం మొత్తం కలిసి నేర్చుకున్నప్పుడే విద్యార్థి విజయవంతమైన పౌరుడిగా ఎదుగుతాడు. •

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

గుంటూరు వార్త



# మిర్చి యార్డులో అక్రమార్కుల అక్రమార్జన

## దిగుమతి, ఎగుమతి లైసెన్సుల్లో మామూళ్ల వసూల్




ఆరుగాలం శ్రమించే రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదు. ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటున్న అధికారులకు మాత్రం మామూళ్ళు, లంచాల రూపంలో కోట్ల రూపాయలు అందుతున్నాయి. ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన.. పేరెన్నిక గన్న గుంటూరు మిర్చి యార్డులో జరుగుతున్న అధికార దోపిడీ కోట్ల రూపాయలకు చేరిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎంతో ఆశతో గిట్టుబాటు ధర లభిస్తుందని రైతులు యార్డుకు వస్తే ఇక్కడ మాత్రం అడుగడుగునా దోపిడీకి పాల్పడుతూ రైతులను నిలువునా ముంచుతున్నారు. రైతులను వ్యాపారులు దోపిడీ చేస్తుంటే.. వ్యాపారుల నుంచి మామూళ్ల రూపంలో కిందిస్థాయి నుంచి నియంత్రణ స్థాయి అధికారుల వరకు వసూళ్లకు పాల్పడుతూ కోట్లకు పడగలెత్తుతున్నారు. గుంటూరు మిర్చి యార్డులో 683 దిగుమతి

> టన్ను కొలమానముతో ప్రతి లైసెన్సుకు లంచం ఫిక్స్
>
> ఈ ఏడాది కోటిన్నరకు పైగా అక్రమ వసూళ్ల పర్వం యార్డులో అడుగడుగునా అక్రమాలే
>
> కింది స్థాయి నుంచి పై అధికారి వరకు పంపకాలు కోట్లకు పడగలెత్తుతున్న అధికారగణం

లైసెన్సులతోపాటు, 400 చిలుకు ఎగుమతి లైసెన్సుల దారులు వ్యాపారం చేస్తుంటారు. వీరు మార్కెటింగ్ శాఖ నిర్ణయించిన లైసెన్స్ ఫీజులతో పాటు అక్రమ వ్యాపారాలు నిర్వహించుకునేందుకు అనుమతిస్తున్న అధికారులకు భారీగా మామూలు ముట్ట చెబుతుంటారు. ఎవరైనా ఇది పద్ధతి కాదు అని చెబితే యార్డు ఆవిర్భావం నుంచి ఆనవాయితీగా వస్తున్న అంశమని కొట్టి పారేస్తున్నారు. రైతులకు న్యాయం చేయాల్సిన అధికారులు అక్రమార్జన పైనే ఎక్కువ దృష్టి సారిస్తారని రైతులు వాపోతున్నారు. తాము ఇదేమని నిలదీస్తే తమను లక్ష్యంగా చేసుకొని వేధింపులకు గురి చేస్తున్నారని రైతులు తమ బాధను వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశాలను యార్డు ఉన్నతాధికారి దృష్టికి తీసుకుపోయినా ..వారు కిందిస్థాయి అధికారినే సమర్థిస్తూ వారు చెప్పింది చేయండి అంటూ రైతులను చిన్నచూపు చేసి మాట్లాడుతున్నారని వారు కన్నీటి పర్యంతమవుతున్నారు. గతంలో యార్డులో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని, అధికారులు ఎప్పుడు ఇలా ప్రవర్తించలేదని. ఇప్పుడు ఇలా జరగడం తమను మనోవేదనకు గురి చేస్తుందని రైతులు చెబుతున్నారు. మామూళ్లకు కేర్ ఆఫ్ మిర్చి యార్డ్ ఎంతో పేరున్న గుంటూరు మిర్చి యార్డ్ మామూళ్లకు కేరాఫ్ గా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతులను నిలువు దోపిడీ చేస్తూ సిబ్బంది అధికారులు కాసులకు కక్కుర్తి పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. యార్డులో ఎన్ని అక్రమాలు చోటు చేసుకుంటున్న ఉన్నతాధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యార్డులో సీజన్ ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతుండగా ఇప్పటినుంచే మామూళ్ళు ఈ స్థాయిలో వసూలు చేస్తే రానున్న సీజన్లో ఏ స్థాయిలో ఉంటుందో అన్న భయం రైతులను బెంబేలెత్తిస్తోంది. యార్డు అక్రమాలపై రాష్ట్ర స్థాయి అధికారులు దృష్టి సారిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది.



## ప్రేమ శాంతి సమాధానం తో జీవించటమే ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరించడం : పాస్టర్ ముత్యాల కోర్నెలి

గుంటూరు, డిసెంబర్ 18 ( ప్రభాతవార్త ) : ప్రతి ఒక్కరూ ప్రేమ శాంతి సమాధానంతో జీవించడం కోసమే ప్రభువైన ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరించడం అని పాస్టర్ ముత్యాల కొర్నేలీ అన్నారు. ఎదుటివారి పట్ల ద్వేషం, అసూయ వంటివి లేకుండా సోదర భావంతో కలిసిమెలిసి ఉండటమే ఆయన జీవితమంతా ప్రతి ఒక్కరికి సందేశంగా మారిందన్నారు. గుంటూరు నగరంలోని కొరుటపాడు లో ఉన్న ఆంధ్ర జిమ్ లో గురువారం ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు జిమ్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సెమీ క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథులుగా పాస్టర్లు కొర్నేలి, ముత్యాల ప్రభుదాస్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏసు ప్రభు నామములో ప్రతి ఒక్కరూ శాంతి సమాధానం కలిగి సోదర భావంతో సంతోషంగా జీవించాలని పిలుపునిచ్చారు. నేటి సమాజంలో ఈర్ష్య, ద్వేషాలు, అశాంతి పెరిగిపోయి తను విపత్కర మార్పులు సంభవించాయన్నారు. క్రిస్టమస్ పండుగ సారాంశం, ఏసుక్రీస్తు జీవన విధానం లో ప్రతి ఒక్కరూ సంతోషంగా, ఒకరి పట్ల ఒకరు సమాధానపరచుకోవటం, శాంతియుతమైన జీవితాన్ని జీవించటమే ప్రధాన ఉద్దేశం అన్నారు. ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా యువత చెడు వ్యసనాలను విడనాడి దేవుడు చూపిన మార్గంలో పిలుపునిచ్చారు. జిమ్ డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి సమాజంలో కుటుంబాలలో ప్రేమాభిమానాలు తగ్గి, మానవ సంబంధాలను విడనాడి ఆర్థిక సంబంధాల వైపే ఆకర్షితులవుతున్నారన్నారు. ఈ పరిణామాలు సమాజానికి చాలా హానికరం చేస్తాయని తెలిపారు. ఏసుక్రీస్తు చూపిన మార్గంలో నడవడమే ప్రతి ఒక్కరు కుటుంబాలు, జీవితాలలో వెలుగులు నింపేందుకు మార్గమని గుర్తించాలని కోరారు. అనంతరం క్రిస్మస్ కేకు కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అలానే జిమ్ములో జరిగిన పోటీలలో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో లూర్దు రాజు మాస్టర్, జెమిలి వేణు, పఠాన్ నజీర్, కే వంశీ, ఎం.హరిహరన్, ఆశిక్, అబ్దుల్ కరీం, ఎన్.శాంతిరాజు, జాన్ వెస్లీ, సంతోష్, సుభాని, జి.జాన్ పీటర్, పి.వినయ్, పాస్టర్ సుసన్న, డి సాయి, సంఘ పెద్దలు ఆవుల కొర్నేలు, ఆవుల ప్రశాంత్, రాము,మార్కు, రాధిక, త్రినాధ్, జె యోగేష్, కొండాబత్తిని సాంబశివరావు, కొండాబత్తిని జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.




## మొక్కల సంరక్షణ పై ప్రత్యేక దృష్టి సారించాలి నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబర్ 18 ( ప్రభాతవార్త ) : గుంటూరు నగరంలో నాటుతున్న మొక్కల సంరక్షణపై గాంధీ పార్కు సిబ్బంది ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా గురువారం స్థానిక పట్టాభిపురం, నెహ్రు నగర్, బ్రాడీపేట, కొత్తపేట తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు, మొక్కలు నాటే విధానాన్ని పరిశీలించారు. నగరంలో మిషన్ గ్రీన్ గుంటూరులో భాగంగా పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించేందుకు వార్డుల వారీగా డివైడర్లలో, రోడ్ల



కిరువైపులా, ఖాళీ స్థలాలలో మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. నూతనంగా రోడ్ల అభివృద్ధి చేసే సమయంలో రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు వీలుగా రింగ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మొక్కలు, పచ్చదనం పెంపొందించేందుకు పార్కు కార్మికులు,సిబ్బంది ప్రత్యేక దిష్టి సారించి బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ఆక్రములను గుర్తించి తక్షణమే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆక్రమణల వల్ల ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారిందని ఆక్రమణ తొలగించాలని సంబంధిత విభాగ అధికారులకు సూచించారు. విధులు నిర్వహించే సమయంలో సంబంధిత విభాగాలకు చెందిన అధికారులు పర్యవేక్షణ నిర్లక్ష్యం స్పష్టంగా తెలుస్తుందని ఆయా



అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలో తాగునీటి సరఫరా పై ప్రత్యేక దృష్టి సారించాలని, క్లోరిన్ శాతం సమపాళ్లలో కలిపి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, కలుషిత నీరు సరఫరా అయితే సంబంధిత ఏరియాల అధికారులను బాధ్యులుగా చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఈఈ వేణుగోపాల్, డి ఈ లు కళ్యాణ్ రావు, హనీప్, ఎస్ ఎస్ లు ప్రసాదు, సాంబయ్య అన్ని విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానా

గుంటూరు క్రైమ్ ప్రభాతవార్త డిసెంబర్18: మద్యం సేవించి విచ్చలవిడితనంతో వాహనాలు నడుపుతూ ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తూ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంగిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై ట్రాఫిక్ పోలీసు అధికారులు కేసులు నమోదు చేసి వారిని కోర్టు లో హాజరుపరుచారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కొరడా ఝులిపిస్తున్నారు.ఈ నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈస్ట్ సిఐ అశోక్ కుమార్ వెస్ట్ సిఐ సింగయ్యలు వారి సిబ్బందితో తదితర ప్రాంతాల్లో వాహన,డ్రంకండ్ డ్రైవ్ లు చేపట్టారు.ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో 14 మంది, వెస్ట్ లో 11మందిని గుర్తించి వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. 6వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్ కేసుల్ని విచారించి 185 (తి) సెక్షన్ ప్రకారం నేరం రుజువు అయినందున నిండుతుల్లో 20 మందికి మొత్తం రూ.1,24,000/జరిమానా విధించారు. ఐదుగురు వ్యక్తులకు ఒక వారం జైలు శిక్షను విధించారు.



## కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న జిల్లా ఎస్పీ

గుంటూరు క్రైమ్ ప్రభాతవార్త డిసెంబర్18: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతి సచివాలయంలో గురువారం నిర్వహించిన 5వ కలెక్టర్ల సదస్సులో గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా, జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పాల్గొన్నారు.ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడం, జిల్లాలో శాంతిభద్రతలను కాపాడడం, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని వేగవంతం చేయడం వంటి అంశాలపై ముఖ్యమంత్రి జిల్లాల అధికారులకు దిశానిర్దేశం చేశారు.ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా, జిల్లా యంత్రాంగం పోలీసు శాఖ సమన్వయంతో సుపరిపాలన అందించాలని ముఖ్యమంత్రి సూచించారు.

## ఇరువురు మహిళా ఎస్.ఐ లు బదిలి



గుంటూరు క్రైమ్ ప్రభాతవార్త డిసెంబర్18: ఇరువురు మహిళా ఎస్.ఐ లను బదిలీ చేస్తున్నట్టు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.పాత గుంటూరు ఎస్. ఐ గా విధులు నిర్వహిస్తున్న లావణ్యను ఆరెండల్ పేటకు బదిలీ చేశారు. ఆరెండల్ పేట పోలీసు స్టేషన్ లో పనిచేస్తున్న ఎస్.ఐ రోజా లతను లాలాపేట పోలీసు స్టేషన్ కు బదిలీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.ఐ లావణ్య ఆరెండల్ పేట ఎస్.హెచ్.ఓ ను మర్యాద పూర్వకంగా కలిశారు.

## అభివృద్ధికి చిరునామా గుంటూరు ఈస్ట్

### గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు వెస్ట్, డిసెంబర్ 18,ప్రభాతవార్త: నగరంలో గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తి నిరక్ష్యానికి గురైన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను వేగవంతం చేపడుతున్నామని, గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా మారుస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. గురువారం స్థానిక గుంటూరు నగరంలోని ఆలీ నగర్, మారుతీనగర్, రామిరెడ్డితోట ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, పైపులైన్ల నిర్మాణానికి రూ.1.46 కోట్లతో స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని పూర్తిగా నాశనం చేశారని మండిపడ్డారు. అభివృద్ధి ఆనవాళ్లు లేకుండా ధ్వంసం చేశారన్నారు. యూజీడీ పనులను పక్కన పడేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, కనీసం పాదచారులు కూడా తిరిగే పరిస్థితి లేకుండా పోయిందని తెలిపారు.

## ఓబీసీల డిమాండ్ల పరిష్కారానికి కేంద్ర మంత్రుల భరోసా : కేసన శంకరరావు

గుంటూరు,ప్రభాతవార్త ప్రతినిధి: ఓబీసీల ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి ముఖ్యంగా స్థానిక సంస్థలు చట్టసభలలో జనాభా దామాషా మేరకు రిజర్వేషన్ల పై పలువురు కేంద్ర మంత్రులకు ఇచ్చిన మెమోరాండంల పై సానుకూల దృక్పథంతో స్పందించి, తమకు భరోసా కల్పించారని,ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా,కేంద్ర సామాజిక న్యాయ సాధికారిక మంత్రి వీరేంద్ర కుమార్, కేంద్ర గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు,టిడిపి పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయులు పలువురు పార్లమెంటు సభ్యులు ఆ మేరకు సానుకూలంగా స్పందించారన్నారు. వెంటనే జనగణనతో పాటే సమగ్ర కుల గణన ను చేపట్టేలా, ఓబీసీల జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు కేటాయించేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఒప్పించాలని కోరామన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పేరిట అగ్రవర్ణ పేదలకు103 వ రాజ్యాంగ సవరణ చేసి మరీ ఇచ్చిన 10 శాతం రిజర్వేషన్లతోనే 50 శాతం సుప్రీం పరిమితి దాటి పోయిందని, అలాంటప్పుడు ఓబీసీల రిజర్వేషన్లతోనే మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించి పోయాయనడం అసంబద్ధంసామాజిక అన్యాయం అంటూ కేంద్ర మంత్రులకు తెలియజేశామన్నారు. అందుకే ఏ విధంగా మూడు నాలుగు శాతం కూడా లేని అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వగలిగారో, అదే విధంగా ఓబీసీలకు కూడా రాజ్యాంగ సవరణ చేసి జనాభా దామాషా మేరకు రిజర్వేషన్ లు కేటాయించాలని, కేంద్ర మంత్రులను కోరామన్నారు. పలు రాష్ట్రాలలో ఏవిధంగా ఓబీసీలకు పెంచిన రిజర్వేషన్లను షెడ్యూల్డ్ తొమ్మిదిలో చేర్పించి రాజ్యాంగ



రక్షణ కల్పించారో, అదేవిధంగా దేశంలోని అన్ని రాష్ట్రాలకు వర్తించేలా కేంద్ర ప్రభుత్వంపార్లమెంటు చట్టబద్ధ రిజర్వేషన్లు అమలు జరపాలని కోరామన్నారు. ఆ విధంగా ఓబీసీలకు రిజర్వేషన్లను ఇచ్చి చరిత్ర పుటలలో ఆ చంద్రార్థం నిలిచిపోయేలా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను ప్రధాని నరేంద్ర మోడీని ఒప్పించాలని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ను ప్రత్యేకంగా టిడిపి పార్టీ పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో కలిసి తాము విజ్ఞప్తి చేశామన్నారు. అందుకు స్పందించిన కేంద్ర మంత్రి పెమ్మసాని ఆ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రినిప్రధానమంత్రిని ఒప్పించేందుకు,ఓబీసీలకు సామాజిక న్యాయం అందించేలా కృషి చేస్తామన్నారని శంకరరావు తెలియజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, ఉద్యోగ విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంసాని శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు జగదీష్, వర్తనపల్లి కాశీ విశ్వేశ్వరరావు పలువురు బిసి నాయకులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబుకు పురస్కారం పట్ల హర్షం

గుంటూరు వెస్ట్, ప్రభాతవార్త: సీఎం చంద్రబాబుకు బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ అవార్డుపై ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దేగల ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పనితీరుకు, నిబద్ధతకు ఎకనమిక్ టైమ్స్ సంస్థ అవార్డు నిదర్శనమన్నారు. సీఎం చంద్రబాబుకు అవార్డు రావడం రాష్ట్రనీకే గర్వకారణమని తెలిపారు. సీబీఎన్ బ్రాండ్‌తో ఏపీలో పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయన్నారు. విజన్ 2047కు అనుగుణంగా స్నేహపూర్వక వ్యాపార అనుకూల విధానాలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, భారీ ఇన్సెంటివ్ లు తదితర పారిశ్రామిక సంస్కరణలతో అవార్డు దక్కిందన్నారు.చంద్రబాబు పాలనలో దేశంలోనే మన ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్ కావడం ఖాయమని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం అమలు చంద్రబాబుకే సాధ్యమని చెప్పుకొచ్చారు. ఏపీకి సీఎం చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అని తెలిపారు. చంద్రబాబు సమర్థత వల్లే 18 నెలల కాలంలో పెద్ద సంఖ్యలో పెట్టుబడులు వచ్చాయని పేర్కొన్నారు.ఏపీ పై ఇన్వెస్టర్లలో నమ్మకం పెరుగుతోందనడానికి వెల్లువలా వస్తున్న పెట్టుబడులే నిదర్శనమని తెలిపారు.



## క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న శాసనసభ్యులు కన్నా

సత్తెనపల్లి, ప్రభాతవార్త డిసెంబర్18: పట్టణం ఐ ఎం ఏ ఫంక్షన్ హాల్ నందు పట్టణ పాస్టర్లు ఏర్పాటు చేసిన. గ్రాండ్ క్రిస్మస్ వేడుకలో పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు. తెలియజేసిన సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు.కన్నా లక్ష్ నారాయణ. ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో



వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ వార్డు మండల గ్రామ నాయకులు కార్యకర్తలు, మత పెద్దలు పాల్గొన్నారు .

## ప్రేమ..శాంతి.. సమాధానం ఇదే క్రిస్మస్ సందేశం

### లోక్ జనశక్తి పార్టీ(రామ్ విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు.

సత్తెనపల్లి, ప్రభాతవార్త డిసెంబర్18: ప్రేమ...శాంతి...సమాధానం ఇదే క్రిస్మస్ సందేశమని నిన్ను నిన్ను వలే నీ పొరుగు వారిని ప్రేమిస్తూ ఒకరినొకరూ ప్రేమగా ఉండాలని లోక్ జనశక్తి పార్టీ(రామ్ విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్ పేర్కొన్నారు. పార్టీ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం పల్నాడు జిల్లా సత్తెనపల్లి పరివర్తన మానసిక ఆశ్రమ పాఠశాల్లో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో వారు మాట్లాడారు. మానవుల పాప విమోచన కలిగించి వారు ఒకరి పట్ల మరొకరు ప్రేమ శాంతి సమాధానం కలిగి ఉండేలా ఏసుక్రిస్తూ జన్మించారని చెప్పారు. మానసిక ఆశ్రమ పాఠశాల చిన్నారుల నడుమ సెమీ క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షులు, కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వన్, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు చందోలు సత్యనారాయణ లు పల్నాడు ప్రజలకు సెమీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపినట్లుగా ఆయన తెలిపార్లు

# పల్నాడు జిల్లా వార్త



## ఎంఐఎం, ఎంహెచ్పిఎస్ ఆధ్వర్యంలో నిరసన

నరసరావుపేట, డిసెంబర్ 18 (ప్రభాత వార్త) : : బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఓ ముస్లిం మహిళా హిజాబ్ ను లాగినందుకు నిరసనగా నరసరావుపేట ఎంఐఎం, ఎంహెచ్పిఎస్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మార్కెట్ సెంటర్ లో నితీష్ కుమార్ ఫోటోలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షులు షేక్. మౌలాలి మాట్లాడుతూ బీహార్ ప్రభుత్వం నిర్వహించిన సంవాద్ అనే కార్యక్రమంలో ముస్లిం మహిళా డాక్టర్ సేవలు గుర్తించిన అధికారులు డాక్టర్ నుస్రత్ పర్వీన్ నీ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ చేతుల మీదగా సన్మాన కార్యక్రమం నిర్వహించారన్నారు. ముస్లిం అనే వివక్షతో స్వయానా ముఖ్యమంత్రి నితీష్ ఆ మహిళా డాక్టర్ హిజాబ్ (బురఖా) లాగడం ముస్లిం



సమాజానికి తీవ్ర వేదన కలిగించిందన్నారు. ఎంహెచ్పిఎస్ రాష్ట్ర అధికారప్రతినిధి మస్తాన్ వలి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో బీజేపీ గెలిచినా ముస్లింలే టార్గెట్ గా ముస్లిం జీవన విధానాన్ని బూచిగా చూపిస్తూ దేశంలో అన్నదమ్ముల్లా ఉన్న హిందూ ముస్లిం సోదరులు మధ్య గొడవలు సృష్టిస్తూ రాజకీయనాయకులు పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. ఎంఐఎం పార్టీ జిల్లా అధ్యక్షులు కరీముల్లా మాట్లాడుతూ దాదాపు ఐదు ఆరు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన సీఎం నితీష్ కుమార్ మతి భ్రమించి పిచ్చి ప్రేలాపనలతో ప్రభుత్వ డాక్టర్ హిజాబ్ లాగడంతో వేదన చెందిన డాక్టర్ నుస్రత్ పర్వీన్ తన ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేయడం జరిగిందన్నారు. ఒక ముఖ్యమంత్రి స్థాయిలో నితీష్ కుమార్ మైనారిటీలపై ద్వేషాన్ని ప్రదర్శించాన్ని మజ్లిస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. వెంటనే బీహార్ ముఖ్యమంత్రి డాక్టర్ నుస్రత్ పర్వీన్ కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు సుభాని, బాజీ, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ సంస్థలో తిరుమల కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట,డిసెంబర్ 18 (ప్రభాతవార్త) ::స్థానిక జొన్నలగడ్డ లోని తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో చెన్నైకి చెందిన రెనాల్ట్ నిస్సాన్ టెక్నాలజీ అండ్ బిజినెస్ సెంటర్ ప్రతినిధులు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. వివరాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవి నారాయణ తెలియజేశారు. కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలకు ఈ.సీ.ఈ మరియు ఈ. ఈ.ఈ విభాగాల నుండి 70 మంది విద్యార్థులు వ్రాత పరీక్షకు హాజరైనారు. పరీక్షలో అర్హత సాధించిన 41 మందికి తదుపరి పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. వారిలో 21 మంది సంస్థ ఉద్యోగాలకు ఎంపిక అయినట్లుగా కంపెనీ ప్రతినిధి వేణు గోపాల్ తెలిపారు. ఉద్యోగాలు సాధించిన 22 మందిలో ఈసీఇ విభాగం నుండి 16 మంది, ఈ. ఈ. ఈ విభాగం నుండి 5 మంది ఉన్నారని తెలియజేశారు. తదుపరి కళాశాల ప్రిన్సిపాల్ డా. వై.వి. నారాయణ గారు మాట్లాడుతూ. మా విద్యార్థులు 21 మంది ఖీ రెనాల్ట్ నిస్సాన్ టెక్నాలజీ కంపెనీలో ఉద్యోగాలు సాధించినందుకు హర్షం వ్యక్తం చేశారు. తదుపరి కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ మాట్లాడుతూ "పల్నాడు ప్రాంతం లో మా కళాశాల నుండి 21 మంది విద్యార్థులు 3 ఎల్ పి ఏ కి అర్హత సాధించడం చాలా ఆనందదాయకం అన్నారు. ఎంపిక అయిన విద్యార్థులను అభినందించారు. ఇటువంటి దిగ్గజ కంపెనీ లో ఉద్యోగాలు సాధించడానికి విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన ప్రత్యేక శిక్షణ కారణమన్నారు. దీనికి కృషిచేసిన ప్లేస్మెంట్ ఆఫీసర్ సాంబశివరావును వారు అభినందించారు. కళాశాల చైర్మన్ శ్రీ బొల్లా బ్రహ్మనాయుడు , సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రావెల్ల సత్యనారాయణ విద్యార్థులను అభినందించారు.

## వైయస్సార్సీపీ కోటి సంతకాల డ్రామా ఆడుతుంది :: కొమ్మాలపాటి

నరసరావుపేట,డిసెంబర్ 18 (ప్రభాతవార్త) :: రాష్ట్రంలో వైఎస్ఆర్సీపీ కోటి సంతకాల పేరుతో డ్రామా ఆడుతుందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో వారు మాట్లాడారు. రాజకీయ ఉనికి కోసం వైసీపీ కోటిసంతకాల సేకరణ పేరుతో అభివృద్ధితో ఆడుతోందన్నారు. వైసీపీ నేతలు గొప్పగా చెప్పుకుంటున్న కోటి సంతకాలు ముమ్మాటికీ ఒట్టి సంతకాలే అని అన్నారు. వాటిలో ప్రజలు స్వచ్ఛందంగా పెట్టినవి ఎన్ని.. వైసీపీ శ్రేణులు సృష్టించినవి ఎన్ని త్వరలోనే బయటపడుతుందన్నారు. సంతకాల ప్రతులు



ఎప్పుడు తమకు చేరుతాయా అని వివిధజిల్లాలవారు ఇప్పటికే ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రపంచం మెచ్చిన డెవలప్ మెంట్ మోడల్ "పీపీపీ" గురించి సామాన్యులకు అర్థమైనా.. జగన్ కు, వైసీపీనేతలకు దాని విశిష్టత, విస్తృత ప్రయోజనాలు తెలియకపోవడం నిజంగా సిగ్గుచేటని పేర్కొన్నారు. మెడికల్ కాలేజీల నిర్మాణంలో పీపీపీ విధానాన్ని తప్పుబట్టడం తమ అజ్ఞానమో, అవకాశవాద రాజకీయమో వైసీపీనేతలే చెప్పాలన్నారు. వైసీపీనేతలు తమ హయాంలో చేపట్టిన మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో ప్రైవేట్ భాగస్వామ్యం, ప్రభుత్వేతర వ్యక్తుల ప్రమేయం లేదని చెప్పగలరా అని అన్నారు. పీపీపీని సమర్థిస్తూ పార్లమెంట్ స్థాయీ సంఘం చేసిన సిఫార్సులపై సొంతపార్టీ ఎంపీలతో నిరసన చేయించే ధైర్యం వైయస్సార్సీపీకి ఉందా అని టిడిపి జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు.

## నారా లోకేష్ యువగళం పాదయాత్ర ఒక చరిత్ర

నరసరావుపేట,డిసెంబర్ 18 (ప్రభాతవార్త) ::తెలుగుదేశం పార్టీ (టీడీపీ) జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహించిన యువగళం పాదయాత్ర ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో పాదయాత్ర రెండేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా భారీ కేకును కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పాదయాత్ర యువత సమస్యలను ప్రస్తావించడం, ప్రజలతో సంబంధాలు పెంపొందించడం జరిగిందన్నారు. అప్పటి వైఎస్ఆర్సీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడం లక్ష్యంగా సాగిందని తెలిపారు. ఈ పాదయాత్ర పూర్తయిన రెండేళ్ళ సందర్భంగా, నరసరావుపేట నియోజకవర్గంలో వేడుకలు జరుపుకోవడం సంతోషం అన్నారు. కార్యకర్తలు భారీ సమూహం మధ్యన కేక్ కట్ చేయడం ఆనందమన్నారు. నారా లోకేష్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. నారా లోకేష్ నిర్వహించిన యువగళం పాదయాత్ర వల్ల రాష్ట్రంలో కూటమి అధికారం చేపట్టిందని" అని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ పాదయాత్రతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలతో సంప్రదించి, వారి ఆకాంక్షలను అర్థం చేసుకున్నారని ఇది పార్టీని పునరుజ్జీవింపజేసిందని తెలిపారు.

## పెదనందిపాడు పాఠశాలలో సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతం.


పెదనందిపాడు డిసెంబర్ 18 (ప్రభాతవార్త) ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు ఏర్పాటు చేస్తున్న సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రశంసనీయమని పెదనందిపాడు ఎంఈఓలు లక్ష్మీ, మేడి బాబు అన్నారు. పెదనందిపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో మండలంలోని 9 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏర్పాటు చేసిన సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనను ఎంఈఓ జి.లక్ష్మి, మేడి బాబు ప్రారంభించారు. అనంతరం పలు పాఠశాలలు విద్యార్థులుఏర్పాటు చేసిన సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలను పరిశీలించి అవి తయారు చేసిన విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులను అభినందించారు. మండల విద్యాశాఖ అధికారులు 1.2 లు సిహెచ్ రమేష్ బాబు. పి జాకబ్ లు మాట్లాడుతూ ఈ సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలో ఎంపిక చేసిన 15 మంది విద్యార్థులకు, ఉపాధ్యాయులకు. పెదనందిపాడు పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అప్పా జడ్పీహెచ్.ఎస్.ఎల్ పైర్ అసోసియేషన్ తరుపున



జవహర్ రాజీ నాగరాజు సాయి ప్రసాద్ లు మెమెంటోలు సర్టిఫికెట్లు అందజేశా అన్నారు. పెదనందిపాడు పీ ఏ ఎస్ కళాశాలకు చెందిన అధ్యాపక బృందం న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పెదనందిపాడు పాలపర్రు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జె శ్రీనివాసరావు ఎం శ్రీనివాసరావులు. వ్యాయామ ఉపాధ్యాయులు మోహన్ రావు. పలు పాఠశాలలలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మండల స్థాయి సైన్స్ ఫెయిర్లో విద్యార్థుల ప్రతిభ వెల్లువ

కాకుమాను డిసెంబర్ 18( ప్రభాత వార్త ) మండల కేంద్రం కాకుమానులోని ఎస్.జెడ్.పి.హెచ్.ఎస్. (కాకుమాను హైస్కూల్) పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించిన మండల స్థాయి సైన్స్ ఫెయిర్ను మండల విద్యాశాఖ అధికారి కె.ఎఫ్. కెనడి గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సైన్స్ ఫెయిర్ను కాకుమాను హైస్కూల్ హెడ్మాస్టర్ జి. భాస్కర వీర వెంకటరావు ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో సస్టైనబుల్ అగ్రికల్చర్, వేస్ట్ మేనేజ్మెంట్ అండ్ ఆల్టర్నేటివ్స్ టు ప్లాస్టిక్స్, గ్రీన్ ఎనర్జీ, ఎమర్జింగ్ టెక్నాలజీస్, హెల్త్ అండ్ హైజీన్, వాటర్ కన్జర్వేషన్ అండ్ మేనేజ్మెంట్ వంటి అంశాలపై విద్యార్థులు రూపొందించిన వినూత్న ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అదేవిధంగా కెరీర్ గైడెన్స్ విభాగంలో కూడా పోటీలు నిర్వహించగా,



విద్యార్థులు వివిధ వృత్తులు, భవిష్యత్ అవకాశాలపై తమ అవగాహనను ప్రదర్శించారు. ప్రతి విభాగంలో ఉత్తమంగా నిలిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులను అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథంతో పాటు సరైన వృత్తి మార్గదర్శకతను పెంపొందించిందని నిర్వాహకులు తెలిపారు.

## 21న జీడీసీఎంఎస్ నూతన గోదాం ప్రారంభం

నరసరావుపేట, డిసెంబర్ 18 (ప్రభాతవార్త) ::గుంటూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ (జీడీసీఎంఎస్) ఆధ్వర్యంలో నరసరావుపేటలో నిర్మించిన నూతన భవన సముదాయాన్ని రైతుల ప్రగతికి అంకితం చేసే కార్యక్రమం డిసెంబర్ 21న జరగనుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే వివరాలు వెల్లడించారు. చైర్మన్ వడ్లమూడి హరిబాబు నాయకత్వంలో సాగుతున్న ఈ సంస్థ, రైతుల సంక్షేమమే ధ్యేయంగా సహకార రంగంలో కృషి చేస్తోందన్నారు. సత్తెనపల్లి రోడ్డులోని జీడీసీఎంఎస్ కార్యాలయ ప్రాంగణంలో 4 ఎకరాల విస్తీర్ణమైన స్థలంలో రూ. 5.56 కోట్ల వ్యయంతో నిర్మించిన



2600 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాము, షాపింగ్ కాంప్లెక్స్, ప్రహరీ గోడ తదితర సౌకర్యాలను కలిగిన ఈ భవనాన్ని ప్రారంభించనున్నారని ఎమ్మెల్యే తెలిపారు. చైర్మన్ హరిబాబు మాట్లాడుతూ దళారులకు అమ్ముకొని మోసపోవద్దన్నారు. ప్రభుత్వం 100కెజి ల ధాన్యానికి రూ. 2389లు ఇస్తుందన్నారు. రైతులు దళారులకు 1400 రూపాయలకు అమ్ముకొని నష్టపోతున్నారని తెలిపారు. రబీలో రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ వంటి ఎరువులను పుష్కలంగా అందుబాటులో ఉంచిందని చైర్మన్ హరిబాబు వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వేమలపల్లి వెంకట నరసయ్య, వాసిరెడ్డి రవి, మేనేజర్ హరి గోపాల్, పాల్గొన్నారు.

## ఉద్యోగాలు సాధించిన 44 మంది కృష్ణవేణి విద్యార్థులు

నరసరావుపేట, డిసెంబర్ 18 (ప్రభాతవార్త) ::స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన క్యాంపస్ డ్రైవ్ లో 44మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కంపెనీ ప్రతినిధులు హెచ్ఎం లు బాలాజీ, కీర్తన, విజయలక్ష్మి ఆధ్వర్యంలో 150 మంది విద్యార్థులకు ముందుగా వ్రాత పరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించి, 44 మంది విద్యార్థులను ఎంపిక చేశారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నాతాని, కళాశాల డైరెక్టర్ కె. నాగరాజు, ట్రెయినింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ బాల కోటేశ్వరరావు ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

## బంగారు పతకాలు సాధించిన ఎస్.ఎస్. ఎన్ విద్యార్థులు

నరసరావుపేట, డిసెంబర్ 18 (ప్రభాతవార్త) : : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ 48వ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు 2025 లో స్థానిక శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ చూపారు. తమ విద్యార్థులు 2 బంగారు పతకాలు, 2 రజిత పతకాలు, 4 కాంస్య పతకాలను సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. ఎస్. సుధీర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 1012 వరకు భాజీపాలెంలోని కేవీఆర్ ఎంకెఆర్ కళాశాలలో జరిగిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అంతరకళాశాలల అథ్లెటిక్స్ పోటీలలో




తమ కళాశాలకు చెందిన కే. ప్రసన్నకుమార్ 100 మీటర్ల స్ప్రింట్ (10.70 సెకన్స్) తో బంగారు పతకాన్ని, 110 మీటర్ల హర్డిల్స్ 14.90 సెకన్స్ తో రజతం, 4100 మీటర్ల రిలే పరుగులో కాంస్య పతకం సాధించారన్నారు. సి.హెచ్. వి.ఎం. గురుశంకర్ 800 మీటర్ల పరుగు పందెం (2.02) సెకన్స్ తో బంగారు పతకం, 200 మీటర్లు పరుగుపందె ము 23.19 సెకన్స్ తో రజతం, 4 100 మీటర్లు రిలే పరుగుపందెంలో కాంస్య పతకాన్ని సాధించారు. ఎంవి. రవితేజ 4 100 మీటర్లు రిలే పరుగుపందెములో కాంస్య పతకాన్ని, పి. వంశీ 4 100 మీటర్లు రిలే పరుగులో కాంస్య పతకాన్ని గెలుపొందారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కపలవాయి విజయకుమార్, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ మరియు మాజీ మున్సిపల్ చైర్పర్సన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, జాయింట్ సెక్రెటరీ ఊటుకూరి వెంకట అప్పారావు, పాలకవర్గ సభ్యులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. శ్రీనివాస సాయి, వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ యక్కల మధుసూదనరావు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విజేతలకు అభినందించారు.

## నేడు పల్నాడు జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు నరసరావుపేట, డిసెంబర్ 18 (ప్రభాత వార్త ) :: ఈనెల 19నుండి స్థానిక పి.ఎన్.సి కే.ఆర్ కళాశాలలో పల్నాడు జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జె. రామారావు తెలిపారు. గురువారం స్థానిక పి.ఎన్.సి కే.ఆర్ కళాశాలలో జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు సంబంధించిన ప్లానింగ్ కమిటీ సమావేశంజరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్సీఈఆర్టీ, సమగ్ర శిక్ష, పల్నాడు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన, రాష్ట్ర బాల వైజ్ఞానిక ప్రదర్శన (ఆర్బివిపి), సదరన్ ఇండియా సైన్స్ ఫెస్టివల్ (ఎస్ఐఎస్ఎఫ్) ను నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని 28 మండలాల నుండి ఈ నెల 17వ తేదీన జరిగిన మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ లో గెలుపొందిన ప్రతి మండలం నుంచి ఐదు చొప్పున (గ్రూపు విభాగం, వ్యక్తిగత విభాగాల నుంచి మొదటి రెండు, టీచర్స్ ఎగ్జిబిట్ నుంచి మొదటిది) మొత్తం 140 ఎగ్జిబిట్స్ ను ప్రదర్శించనున్నారని తెలిపారు. ఉదయం గం. 7 కల్లా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు అధికారులు ప్రారంభించనున్నారని చెప్పారు. కమిటీ సభ్యులందరూ చక్కగా పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనను జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు సందర్శించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఎస్. రాజశేఖర్, ప్రధానోపాధ్యాయులు ఆర్. గోవిందరాజు, బి.ఎం. సుభాని, వై. హనుమంతరావు, ఎం. రామారావు, సి.హెచ్.వి. ప్రసాద్, ఐవిఎం. రెడ్డి, ఏ.పి. మధు కుమార్ పాల్గొన్నారు.

## సత్తెనపల్లిలో మత్స్యావతారంలో శ్రీవారి దర్శనం



సత్తెనపల్లి టౌన్ డిసెంబర్ 18 (ప్రభాతవార్త): సత్తెనపల్లి పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో శుక్రవారం భక్తులకు ప్రత్యేక ఆధ్యాత్మిక పర్వదినం ఎదురుకానుంది. స్వామి వారి దశావతారాల అలంకరణలో భాగంగా, రేపు మొట్టమొదటి అవతారమైన మత్స్యావతారంలో శ్రీవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.శుక్రవారం అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన రోజు కావడంతో, ఈ విశేష దినాన స్వామి వారు మత్స్యావతార రూపంలో కొలువుదీరి భక్తుల కోరికలు తీర్చడానికి సిద్ధంగా ఉన్నారని ఆలయ అర్చకులు తెలిపారు.

## చెరుకుంపాలెంలో విషాద ఘటన - జనసేన పార్టీ తరపున ఆర్థిక సహాయం



అచ్చంపేట డిసెంబర్ 18 (ప్రభాత వార్త) : అచ్చంపేట మండలంలోని చెరుకుంపాలెం గ్రామానికి చెందిన దేగల వెంకటేశ్వరావు గారి కుమారుడు దేగల వెంకట నరేష్ (27) అనారోగ్య కారణాలతో మృతి చెందడం జరిగింది. ఈ విషాదకర ఘటన పట్ల గ్రామంలో తీవ్ర విచారం వ్యక్తమైంది. ఈ సందర్భంగా పెదకూరపాడు జనసేన పార్టీ తరఫున మండల కార్యదర్శి కందుల గణేష్, గ్రామ పార్టీ అధ్యక్షులు జమ్మిశెట్టి రామకృష్ణ, రేషన్ డీలర్ పయ్యావుల వెంకటేశ్వర్లు, కందుల శేషగిరి, జమ్మిశెట్టి లక్ష్మయ్య, కనగిరి శ్రీకాంత్, పయ్యావుల నరసింహారావు, పెద్దింటి రామాంజనేయులు తదితర గ్రామ పెద్దలు మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## విద్యుత్ వినియోగదారులకు వినతి

అచ్చంపేట, డిసెంబర్ 18 (ప్రభాతవార్త) అచ్చంపేట మండలంలోని విద్యుత్ వినియోగదారులకు తెలియజేయునది ఏమనగా (శుక్రవారం) నాడు మధ్యాహ్నం 2:30 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు 132 కేవీ అబ్బూరు సబ్స్టేషన్ నందు నిర్వహించవలసిన మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేయబడుతుంది.కావున అచ్చంపేట మండలంలోని విద్యుత్ వినియోగదారులు అందరూ ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని మండల విద్యుత్ శాఖ అధికారి తెలియచేసారు .

## రాష్ట్రస్థాయి మట్టికుస్తి పోటీలో గోల్డ్ మెడల్ సాధించిన గురుకుల విద్యార్థి

యడ్లపాడు, డిసెంబర్ 18, ప్రభాతవార్త : రాష్ట్ర స్థాయి మట్టి కుస్తి పోటీలల్లో మండల పరిధిలోని బోయపాలెం గ్రామ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యార్థి గోల్డ్ మెడల్ సాధించటం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డి ప్రభాకరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వివరిస్తూ ప్రకాశం జిల్లా కొత్త పట్నం బీచ్ నందు ఈనెల 13,14తేదీలలో జరిగిన పోటీలలో అండర్ 17 విభాగంలో పాఠశాలకు చెందిన రెంటాల శివ మల్లిఖార్జున 9వ తరగతి విద్యార్థి పాల్గొని విజయం సాధించటం జరిగిందన్నారు. ఆంధ్ర రాష్ట్రం తరుపున 2026 జనవరి మాసం 2,3,4,5 తేదీలలో వైజాగ్ లో జరిగే పోటీలో విద్యార్థి పాల్గొంటాడని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలపటం జరిగిందన్నారు.



## హెల్మెట్ బరువు కాదు..బాధ్యత తప్పక ధరించాలి : ఎస్సై



యడ్లపాడు, డిసెంబర్ 18, ప్రభాతవార్త : అన్నింటికంటే జీవితం ఎంతో విలువైనదని, సాటిలేని మేటి జీవితాన్ని కాపాడుకునేందుకు రహదారి ప్రమాదాల సమయంలో మనల్ని మనం రక్షించుకునేందుకు హెల్మెట్ను బరువుగా కాకుండా..బాధ్యతగా వినియోగించేలా చూడాలని ఎస్సై టి శివరామకృష్ణ పేర్కొన్నారు. రహదారి ప్రమాదంలో రక్షణ కవచంగా ఉండే హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించేలా వాహన దారులకు అవగాహన కలుగ జేసారు. ఈ సందర్భంగా ఆయన వివరిస్తూ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు జాతీయ రహదారులపై రోడ్డు భద్రతను మరింత పటిష్టం చేయడానికి హెల్మెట్ లేకుండా జాతీయ రహదారిలో ప్రవేశం లేదు అనే నిబంధనను ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టామన్నారు. ఇందులో భాగంగానే వాహన దారులకు ఇందుకు సంబంధించిన అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు.

## బాలమహోత్సవ్ లో జి ఆర్ సి ఆర్ కే క్రీడాకారుల సత్తా...

పెదకూరపాడు,డిసెంబర్ 18, ప్రభాతవార్త క్రీడలను ప్రోత్సహించి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభగలిగిన క్రీడాకారులను వెలికితీసే లక్ష్యంగా సత్తెనపల్లి సూరి కాలనీలోని జడ్పీ హైస్కూల్లో గత రెండు రోజులుగా వడ్డమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ నిర్వహించిన బాల మహోత్సవ్ వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, రన్నింగ్ క్రీడల్లో పెదకూరపాడు జి ఆర్ సి ఆర్ కే క్రైస్తవ పాఠశాల చాటింది. అండర్17 వాలీబాల్ బాలుర, బాలికల విభాగంలో ప్రథమంగా నిలిచింది. అండర్ 17 కబడ్డీ



బాలుర విభాగంలో విన్నర్స్ నిలిచింది. అండర్17లో 100 మీటర్ల పరుగు పందెంలో శేషసాయి, అండర్14 బాలుర విభాగంలో షేక్ రియాజు ప్రథమంగా నిలిచారు. జి ఆర్ సి ఆర్ కే శ్రీ చైతన్య పాఠశాల నిర్వాహకులు గుత్తా రాము, ప్రతిభ చాటిన క్రీడా జట్లకు షీల్డ్, నగదు బహుమతులను విజ్ఞాన్ క్రీడల నిర్వాహకులు కల్యాల్, ప్రొఫెసర్ నాగభూషణ్ అందించారు.

## 75త్యాళ్లూరు పీహెచ్సీలో ఘనంగా సెమిక్రిస్మస్ వేడుక..

పెదకూరపాడు,డిసెంబర్ 18, ప్రభాతవార్త : కల్లోల జగతికి శాంతి సందేశాన్ని అందించిన కరుణామయుడు ఏసుక్రీస్తు మార్గంలో ప్రతి ఒక్కరు పయనించాలని బలుసుపాడు ఇమ్మానియేల్ ఇంటర్నేషనల్ మినిస్టర్ చర్చి ఫాస్టర్ శ్రావణ్కుమార్ అన్నారు. గురువారం 75 త్యాళ్లూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. వైద్యులు ఆదిత్య, శివరత్న, వెలుగొండారెడ్డి, ఇన్చార్జ్ ఎంపీహెచ్ వెంకటేశ్వర్లు, సూపర్వైజర్ దిలీప్కుమార్లు కేకు కోసి సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఫాస్టర్ శ్రావణ్ క్రిస్మస్ ప్రాముఖ్యతను, ఏసుక్రీస్తు జన్మ వృత్తాంతాన్ని ఈ సందర్భంగా వివరించారు. అనంతరం వైద్య సిబ్బందితో కలసి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.



## భక్తిశ్రద్ధలతో మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం



పెదకూరపాడు,డిసెంబర్ 18, ప్రభాతవార్త : మండల పరిధిలోని 75త్యాళ్లూరు అవధూత అయోధ్య స్వామి ఆశ్రమంలో కాశి అన్నపూర్ణేశ్వర విశ్వేశ్వర స్వామి ఆలయములో గురువారం భక్తిశ్రద్ధలతో భక్తులచే వేద పండితులు ఆదిత్య శర్మ నుదురుపాటి హనుమంతల శర్మ ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు ఉదయం గణపతి పూజతో ప్రారంభించి శివలింగానికి ఏకాదశ దుద్రాభిషేకాలు పంచామృత శాఖలు అన్నాభిషేకం పోలాభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ నిర్వాహకులు ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

## ప్రతి ధాన్య గింజకూ న్యాయం - రైతు సంక్షేమమే లక్ష్యం

### అచ్చంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అచ్చంపేట, డిసెంబర్ 18 (ప్రభాత వార్త): అచ్చంపేట మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు తీసుకొచ్చిన ధాన్యం నాణ్యతను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. అనంతరం రైతులతో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. రైతులు పండించిన ప్రతి ధాన్య గింజను ప్రభుత్వం న్యాయమైన మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తూకం, తేమ శాతం నిర్ధారణ, చెల్లింపుల ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## రుద్రవరంలో ప్రజల వద్దకు ప్రవీణ్ - సమస్యల పరిష్కారానికి స్పష్టమైన ఆదేశాలు

అచ్చంపేట, డిసెంబర్ 18 (ప్రభాత వార్త):"ప్రజల వద్దకు ప్రవీణ్ : 100 రోజులు – 100 గ్రామాలు కార్యక్రమంలో భాగంగా 20వ రోజు పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అచ్చంపేట మండలం రుద్రవరం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను స్వయంగా విని, తక్షణ పరిష్కారానికి సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గ్రామ రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ ఆన్లైన్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని ఆలస్యం లేకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని మౌలిక వసతులు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై సమగ్రంగా సమీక్షించారు. గ్రామ సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే, సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమై కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కార్యకర్తలు, నాయకులు ఎలాంటి సమస్యలను ఎదుర్కొన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమం అనంతరం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల ఇళ్లకు వెళ్లి వారి కుటుంబాలతో ఆప్యాయంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆశీర్వాదం, సీనియర్ నాయకులు చల్లా రమేష్, సీతయ్య, మండల డీటీ, ఎంపీడీఓ ,అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

పెదకూరపాడు డిసెంబర్ 18 (ప్రభాతవార్త): పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి కడియాల శివప్రసాద్ అన్నారు. గురు వారం పెద్దకూరపాడు పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, పంచాయతీ సిబ్బంది మొత్తం 30 మందికి



రగ్గులను అందజేశారు.. ఈ సందర్భంగా పెద్దకూరపాడు మేజర్ పంచాయతీ సర్పంచ్ గుడిపూడి రాజు మాట్లాడుతూ చలికాలం నేపథ్యంలో గ్రీన్ అంబాసిడర్లు, పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తించి వారికి రగ్గులను సమకూర్చడం అభినందనీయమన్నారు... ఇటీవల 75 త్యాళ్లూరులో తండ్రిని కోల్పోయి న చిలుకూరి పరమేశ్వర, శ్రీలక్ష్మి ల చదువు మధ్యలో నిలిచిపోకుండా వారిని దత్తత తీసుకొని చదివించడం జరిగిందన్నారు

# బాపట్ల జిల్లా వార్త



## అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన చెరుకుపల్లి

చెరుకుపల్లి, డిసెంబర్ 18, ప్రభాతవార్త : చెరుకుపల్లి లోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవస్థానం ప్రాంతం గురువారం అయ్యప్ప నామస్మరణతో మారుమోగింది. నవంబర్ 7వ తేదీ నుండి డిసెంబర్ 18వ తేదీ వరకు శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి చెరుకుపల్లి కమిటీ ఆధ్వర్యంలో ఇక్కడ ఆలయంలో మాల ధారణ స్వాములకు నిత్యం చద్ది కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.. 41 రోజులపాటు మండల దీక్ష కాలంలో స్వాములందరికీ ఎటువంటి లోటు లేకుండా రోజు చద్ది నైవేద్యాలను స్వాములకు అందజేశారు. శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి కమిటీ సభ్యులు, గ్రామస్తులు,



దాతలు, మాల ధారణ స్వాముల సహకారాలతో నిత్య చద్ది కార్యక్రమాన్ని ఈ ఆలయంలో ఏర్పాటు చేశారు. రోజువారి 200 నుండి 300 మంది స్వాములు ఇక్కడ చద్ది వేయడం విశేషంగా చెప్పవచ్చు. ఎంతమంది స్వాములు వచ్చిన లేదు.... అనకుండా ....వండిమరి వడ్డించడం గత 18 సంవత్సరాలుగా ఇక్కడ జరుగుతుంది. ఇక్కడ ఆలయంలో చద్ది చేయడానికి చెరుకుపల్లి మండలంలోని గ్రామాల నుండే కాకుండా మండలం చుట్టుప్రక్కల గ్రామాల నుండి సైతం మాలాధారణ స్వాములు ఇక్కడికి వచ్చి చద్ది స్వీకరించడం విశేషం. గురువారంతో 41 రోజుల మండల దీక్ష కాలం పూర్తయిన సందర్భంగా స్వామివారికి గణపతి హోమాన్ని నిర్వహించి మాల ధారణ స్వాములతో పాటు భక్తులకు సైతం విశేష రీతిలో చద్ది, అన్నదానాన్ని నిర్వహించారు. గురువారం విఘ్నేశ్వరునికి హోమాన్ని కమిటీ సభ్యులు కందుల వెంకటేశ్వరరావు దంపతులు నిర్వహించారు.ఈ సందర్భంగా విఘ్నేశ్వరునికి సుబ్రహ్మణ్య స్వామికి అయ్యప్ప స్వామికి విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించి అనంతరం 18 మెట్లు పడిపూజ కార్యక్రమాన్ని అయ్యప్ప స్వామి నామస్మరణతో వైభవంగా నిర్వహించారు. అనంతరం వందలమంది మాలధారణ స్వాములు, భక్తులకు చద్ది, అన్నదాన కార్యక్రమంలో నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు కంచి శ్రీనివాసరావు, కార్యదర్శి ఉయ్యూరు రవీంద్రబాబు, కట్టా శ్రీనివాస్ రావు, ఏవీఎస్ ఆంజనేయ శర్మ , పులిపాక లక్ష్మీ మనోహరం,రాధా గురుస్వామి, నాగరాజు స్వామి, రావులెక్కెట్టి నాగాంజనేయులు, ఉప్పలపాటి వెంకటసుబ్బయ్య, బెల్లంకొండ వెంకటసుబ్బమ్మ, కమిటీ సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విజ్ఞాన్స్ యూనివర్సిటీ అధ్యాపకుడికి పీహెచ్‌డీ పట్టా

చేబ్రోలు(పొన్నూరు), డిసెంబర్ 18,ప్రభాతవార్త: చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ టీకే చెందిన ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ)విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ గుంటుపల్లి గంగా ప్రసాద్ పీహెచ్‌డీ పట్టా సాధించారని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైస్ చాన్సలర్ మాట్లాడుతూ గుంటుపల్లి గంగా ప్రసాద్ అడాప్టివ్ రౌటింగ్ టెక్నిక్స్ ఫర్




మొబైల్ అడహక్ నెట్వర్క్స్ విత్ అన్‌స్టేబుల్ లింక్స్ అనే అంశంపై విస్తృతమైన పరిశోధన నిర్వహించి, విజయవంతంగా డాక్టరేట్ పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ పరిశోధనకు విజ్ఞాన్స్ యూనివర్సిటీ ఈసీఈ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ బి.సీతారామాంజనేయులు గైడ్‌గా వ్యవహరించినట్లు తెలిపారు. మొబైల్ అడహక్ నెట్వర్క్స్‌లో లింక్ అస్థిరత వల్ల ఏర్పడే సమస్యలను అధిగమించేందుకు కొత్త రకమైన అడాప్టివ్ రౌటింగ్ విధానాలను ఈ పరిశోధనలో ప్రతిపాదించినట్లు చెప్పారు. ఈ పరిశోధన ఫలితాలు వైర్‌లెస్ కమ్యూనికేషన్, డిఫెన్స్ నెట్వర్క్స్ ఐఓటీ, ఎమర్జెన్సీ కమ్యూనికేషన్ సిస్టమ్స్ వంటి అనేక రంగాలకు ఉపయోగకరంగా ఉండనున్నాయని వివరించారు. పీహెచ్‌డీ పట్టా సాధించిన అసిస్టెంట్ ప్రొఫెసర్ గుంటుపల్లి గంగా ప్రసాద్‌ను విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

## వంద రోజుల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి


పొన్నూరు, డిసెంబర్ 18,ప్రభాతవార్త: పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన వంద రోజుల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి కొల్లి



విజయభాస్కర్ విద్యార్థులకు సూచించారు. మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించి విద్యార్థులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను స్వయంగా పరిశీలించారు. విద్యాశాఖ పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వంద రోజుల కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు ఎంతగానో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ప్రతి నిత్యం చదివిన అంశాలను విద్యార్థులచేత ఉపాధ్యాయులు దగ్గరుండి చదివించడం ద్వారా నూరుశాతం ఫలితాలు సాధించడంతోపాటు ఉత్తమ మార్కులు సాధించేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను ఎప్పటికప్పుడు కార్యోన్ముఖులను చేస్తూ వంద రోజుల కార్యక్రమం ద్వారా సాధించాల్సిన లక్ష్యాలను సాధించే విధంగా కృషి చేయాలన్నారు.

## ఏజీపీగా వట్టికూటి లీలాప్రసాద్

పొన్నూరు, డిసెంబర్ 18,ప్రభాతవార్త: అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)గా పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది వట్టికూటి లీలాప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో వట్టికూటి లీలాప్రసాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా పనిచేశారు. పట్టణంలో మంచి పట్టున్న న్యాయవాదిగా పేరుగాంచారు. ఈ సందర్భంగా వట్టికూటి లీలాప్రసాద్ మాట్లాడుతున్న ప్రభుత్వం, న్యాయశాఖ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా శక్తివంచన లేకుండా ఏజిపి పదవికి న్యాయం చేస్తానని వట్టికూటి చెప్పారు. ఈ సందర్భంగా వట్టికూటి లీలాప్రసాద్‌ను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ బాజీసాహెబ్, మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది తుమాటి రమేష్, మగ్గులబేగ్, తదితర న్యాయవాదులు, పట్టణంలోని పలువురు ప్రముఖులు, అభినందనలు తెలిపారు.



## కుక్కల దాడిలో 8 మందికి గాయాలు

రేపల్లె, డిసెంబరు 18, ప్రభాతవార్త:పురపాలక సంఘంలోని 8వ వార్డులో గురువారం కుక్క దాడి చేసిన సంఘటనలో 8 మంది గాయపడ్డారు.పాఠశాలకు వెళ్ళే సమయంలో కుక్కకాటుకు ఆజితకుమార్,రోహిత్,హర్ష,రిచిత,పూజిత సాయి,వరణ్,నాగబాబు,ప్రేమ గాయపడ్డారు.వీరిని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్య సిబ్బంది వ్యాక్సిన్‌తో వైద్య చికిత్సచేశారు.వ్యాక్సిన్ వినియోగించుకోవాల్సిన తేదీలను ఖరారు చేసి ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.వీరిని కరిచిన పిచ్చి కుక్క అని నిర్ధయించారు.పట్టణంలో వీధి కుక్కల సంచారాన్ని అరికట్టాలని మున్సిపల్ శాఖ అధికారులను ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## అనారోగ్యంతో అంగన్‌వాడీ మృతి

కొల్లూరు, డిసెంబర్ 18 (ప్రభాతవార్త) : కొల్లూరు గ్రామంలోని పంచాయతీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త సునీత అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. సునీత గత ఆరు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. విషయం తెలిసిన తర్వాత కొల్లూరు మండల అంగన్‌వాడీ కార్యకర్తలు సూపర్‌వైజర్లు సునీత, భజనస్వర్ణలత, సిఐటియు నాయకులు, అగ్నిపేన్ కృష్ణమోహన్, సుబ్బారావు మృతదేహాన్ని దర్శించి నివాళులర్పించారు. అమ్మతలూరు ప్రాజెక్ట్ అంగన్‌వాడీల అధ్యక్షురాలు బసవమ్మ, వివిధ మండలాల అంగన్‌వాడీలు సెక్టార్లు, లీడర్లు, సునీత మృతదేహానికి దర్శించి నివాళులర్పించారు.

## నేడు కొల్లిపరలో ప్రజాదర్బార్ కార్యక్రమం

కొల్లిపర, డిసెంబర్ 18 (ప్రభాతవార్త) : మండల గ్రామాల ప్రజల సమస్యలను తెలుసుకోవడం కోసం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు భీమవరపు వెంకటేశ్వర్రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం 4గంటల నుండి కొల్లిపర టిడిపి కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం జరుగుతుందని ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా తెలియజేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. ఎంఈవో ఝాన్సీలత ప్రధానోపాధ్యాయులతో కలిసి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకట్రావు, నాగమల్లేశ్వరరావు, సైన్సు ఉపాధ్యాయులు నాగవరలక్ష్మి, కుమారి, అనంతలక్ష్మి, రవికుమార్, ఏసుబాబు, సిఆర్‌ఎంపిలు రమేష్‌బాబు, అలేఖ్య, తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ వేడుకలు



రేపల్లె, డిసెంబరు 18, ప్రభాతవార్త: పట్టణంలోని డిఆర్‌డిఎ వెలుగు ప్రాజెక్టు కార్యాలయంలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి.అతిథులకు క్రిస్మస్ కేకులను పంచిపెట్టారు.క్రిస్మస్ ప్రత్యేకత గురించి వక్తలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నేత అనగాని శివప్రసాద్,ఎండిఓ రవిబాబు,ఎపిఎం ఎ.గోపి,సిసి ఎస్.పూర్ణచంద్రరావు,డి.ఆనంద్,ఎండి నూరీన్ నిస్స, సోమేశ్వరి,ప్రసన్న,యానిమేటర్లు తిరుపతమ్మ,సంధ్య,రమణ,మల్లేశ్వరి, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వైజ్ఞానిక పోటీలు



భట్టి ప్రోలు(రేపల్లె), డిసెంబరు 18, ప్రభాతవార్త:భట్టి ప్రోలు తమ్మన మల్లికార్జునరావు ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన,పోటీలను నిర్వహించారు.సైన్స్ ఎగ్జిబిషన్‌లో 24 ప్రాజెక్టులకు అవసరమైన విద్యార్థులు పాల్గొన్నారు.విజేతలుగా వ్యక్తిగత విభాగంలో పెసర్లంక పాఠశాలకు చెందిన యలవర్తి సతీష్‌కు ప్రథమ స్థానం,గ్రూపు విభాగంలో పెదపూడి పాఠశాలకు చెందిన వై.జగదీష్ టీమ్‌కు ప్రథమ స్థానం,ఐలవరం పాఠశాలకు చెందిన మోనేష్ టీమ్,నేచర్ విభాగంలో టిఎంరావు పాఠశాలకు చెందిన ఉమామహేశ్వరరావు విజేతలుగా నిలిచారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నీలం దేవరాజ్,మండల సైన్స్ కో ఆర్డినేటర్ అంబటి జాకబ్,టిఎంరావు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చందలూరి రామకోటేశ్వరరావు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పల్స్‌పోలియోపై శిక్షణ

భట్టి ప్రోలు(రేపల్లె), డిసెంబరు 18, ప్రభాతవార్త:భట్టి ప్రోలు మండలంలోని వెల్లటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహణపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ నెల 21వ తేదీ నిర్వహించే కార్యక్రమానికి సంబంధించి వెల్లటూరు బస్టాండ్ సెంటరులో మానవహారంగా ఏర్పడి పల్స్ పోలియో నినాదాలు చేశారు.గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.డాక్టర్ అబ్రహం లింకన్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు విధిగా పల్స్ పోలియో చుక్కలు వేయాలని అన్నారు.పోలియో రహిత సమాజాన్ని సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ పవన్ చైతన్య,వైద్యులు,ఆరోగ్య సిబ్బంది,అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## నేడు కౌన్సిల్ సమావేశం

రేపల్లె, డిసెంబరు 18, ప్రభాతవార్త:పురపాలక సంఘ కౌన్సిల్ హాలులో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు అత్యవసర సమావేశం జరుగుతుందని రేపల్లె మున్సిపల్ ఛైర్‌పర్సన్ కట్టా మంగ తెలిపారు.గురువారం ఆమె మాట్లాడుతూ 26 అంశాలపై చర్చించి ఆమోదించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశానికి కౌన్సిలర్లు,కో ఆప్షన్ సభ్యులు విధిగా హాజరు కావాలని ఆమె కోరారు.

## సైన్సు ఎగ్జిబిషన్ ఏర్పాటుతో విద్యార్థుల్లో మేదాశక్తి

కొల్లిపర, డిసెంబర్ 18 (ప్రభాతవార్త) : సైన్సు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం వలన విద్యార్థుల్లో మేధాశక్తిని వెలికితీయవచ్చునని ఎంఈవో ఝాన్సీలత అన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో విద్యార్థులకు సైన్సు ఎగ్జిబిషన్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వాక్యం క్లీనరీ, ఎయిర్ కూలర్, బయోడైవర్మీపార్కు, సౌరవిద్యుత్ గ్రామము, పోషకాహార విలువలు, బింధుసేద్యం, ధ్వనికాలుష్యం, మానవజీర్ణాశయపు బాగాలు వంటివి ప్రయోగాత్మకంగా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా



ఝాన్సీలత మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలన్నారు. విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం సైన్సు ఎగ్జిబిషన్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంఈవో ఝాన్సీలత ప్రధానోపాధ్యాయులతో కలిసి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకట్రావు, నాగమల్లేశ్వరరావు, సైన్సు ఉపాధ్యాయులు నాగవరలక్ష్మి, కుమారి, అనంతలక్ష్మి, రవికుమార్, ఏసుబాబు, సిఆర్‌ఎంపిలు రమేష్‌బాబు, అలేఖ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి కొలతలు సర్వే చేసేటప్పుడు పంచాయితీ కార్యదర్శుల సహకారం తీసుకోవాలి

కొల్లిపర, డిసెంబర్ 18 (ప్రభాతవార్త) : ఇంటి కొలతలు సర్వే చేసేటప్పుడు పంచాయితీ కార్యదర్శుల సహకారం తీసుకోవాలని తహశీల్దార్ సిద్దార్థ అన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపర



తహశీల్దార్ కార్యాలయంలో సమత్వి కార్యక్రమంలో భాగంగా విలేజ్ సర్వేయర్లు విఆర్ఓలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి ఇళ్ళ స్థలాల కొలతలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సిద్దార్థ మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇళ్ళ స్థలాల కొలతలను వేగవంతం చేయాలన్నారు. అంతే కాకుండా ప్రజల నుంచి ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఆర్ఐ వంశీకృష్ణ, మండల సర్వేయర్ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి పన్నులను వేగవంతం చేయాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉంది

కొల్లిపర, డిసెంబర్ 18 (ప్రభాతవార్త) : ఇంటి పన్నులను వేగవంతం చేయాల్సిన బాధ్యత



పంచాయితీ కార్యదర్శులపై ఉందని ఇన్‌చార్జి ఎంపిడివో భార్గవ్ అన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయితీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భార్గవ్ మాట్లాడుతూ ఇంటి పన్నులను ఆన్‌లైన్‌లో చెల్లించే విధంగా చూడాలన్నారు. అదే విధంగా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రక్కన చెత్తా చెదారం పేరుకుపోతుందని వాటిని తొలగించాలన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఇంటి కొతలత విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పరిపాలనాధికారి కిషోర్‌కుమార్, డిప్యూటీ ఎంపిడివో దానయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రంగా వ్యవసాయ విద్యాలయం ఆధ్వర్యంలో గ్రామిణ రైతుసదస్సు

తెనాలి టౌన్ డిసెంబర్18(ప్రభాతవార్త): ఆచార్య ఎన్జి రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం,ఏరువాక కేంద్రం,ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో, గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా కొలకలూరు గ్రామం వేదికగా రైతు సదస్సు నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విస్తరణ సంచాలకులు, అంగ్రూ, డా జి శివనారాయణ ముఖ్య అతిథిగా పా కార్యక్రమంలో వ్యవసాయ ప్రదర్శనలో రైతులకు ఖర్చు తగ్గించు కొని ఆదాయాన్ని పెంచుకొనే దిశలో గుంటూరు జిలాల్లో ఉన్న ప్రధాన పంటలలో వివిధ మోడల్స్ ని ప్రదర్శించి రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. ఇదే కార్యక్రమంలో రైతు శాస్త్రవేత్తల చర్చ ఘోష్టి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రబి పంటలైన జొన్న, మొక్కజొన్న , అపరాలు నూనె గింజల పంటలలో సమగ్ర పంట యాజమాన్యం పై



రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. వుత్తమ రైతులకు సన్మానం చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో డా. కృష్ణారెడ్డి అసోసియేట్ డీన్, వ్యవసాయ కళాశాల, ఉదయగిరి, డా. ఆర్.వి.ఎస్.కె. రెడ్డి, అసోసియేట్ డీన్, ఎన్.ఎస్. వ్యవసాయ కళాశాల, మార్కాపురం, డా.ఎస్.ఆర్.కోటేశ్వరరావు,ప్రొఫెసర్, వ్యవసాయ కళాశాల, గోపీకృష్ణ, విస్తరణ విభాగాధిపతి దోస్టు సహాయంతో ఆంగ్ర డా. అన్నీ దయానా గ్రేస్,సీనియర్ శాస్త్రవేత్త, పురుగుల విభాగం, కళాశాలల నుంచి విచ్చేసిన ఆచార్యులు డా. జి. బిందు మాధవి, బాపట్ల కళాశాల, డా. భరద్వాజ్ సహ డీన్ ప్రతినిధి, సి.ఎస్. పురం కళాశాల, శ్రీకాంత్ , మార్కెటింగ్ మేనేజర్,బేయర్ క్రాప్ సైన్స్ , డా. సీఎచ్ శ్రీలత వాణి,విస్తరణ నిపుణులు, లాం, డా. ఎ. మనోజ్, సమన్వయకర్త, ఏరువాక కేంద్రం, గుంటూరు.ఈ కార్యక్రమంలో 200 మంది పైగా రైతులు మరియు గుంటూరు జిల్లాలో 11 మండలాలలో ఉన్న 60 మంది ఆఖరి సంవత్సర వ్యవసాయ విద్యార్థులు హాజరయ్యారు

## కార్మికుల పొట్టకొట్టే లేబర్ కోడ్‌లను రద్దుచేయాలి: సిఐటియు

తెనాలి టౌన్ డిసెంబర్18(ప్రభాతవార్త): దాల్ మిల్ ముఠా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)అనుబంధ సంఘం 5వ మహాసభలు చుక్కపల్లి శేషగిరిరావు అధ్యక్షతన గురువారం, పట్టణంలోని చెంచుపేట లోని ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొల్లిపర బాబుప్రసాద్ హాజరై మహా సభను ఉద్దేశించి మాట్లాడారు. పాలకులు కాలం గడిచేకొద్ది యజమానులకు అనుకూలంగా నిర్ణయాలు చేస్తున్నారని,అందులో భాగంగానే 29కార్మిక చట్టాలు రద్దుచేసి వాటి స్థానములో 4 లేబర్ కోడ్ లు తెచ్చారని తెలిపారు. 2019కరోనా,కష్టకాలంలో వేజెస్ కోడ్ 2020లో ఐఆర్ ఇండస్ట్రియల్ రిలేషన్లలో కోడ్ సోషల్ సెక్యూరిటీ కోడ్,ఆక్యూపేషనల్ సేఫ్టీ హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్ లు తెచ్చారని తెలిపారు.ఐదు ఏళ్ల తరువాత నవంబర్ 21న వాటి అమలుకు నోటిఫికేషన్ జారీ చేశారనిచెప్పారు. నవంబర్ 26న కార్మికులు మరియు రైతు సంఘాలు దేశ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించారని,లేబర్ కోడ్ లు అమలు అయితే కార్మికులకు సమ్మె చేసే అవకాశం వుండదని, కార్మిక సంఘాలు బతికి బట్ట కట్టె పరిస్తితి వుండదని తెలిపారు.70 పరిశ్రమల లో కార్మికులకు చట్టాలు వర్తించే పరిస్తితి లేదని,వేతనాల నిర్వచనం మారిపోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. కనీసవేతనాలకు గ్యారంటీ లేదని,పనిగంటలు మరియు స్ప్రెడ్ ఓవర్ టైమ్గంటలు పెంచారని,కార్మికులు రోజులో యెక్కువసేపు పని ప్రదేశాల్లో వుండాలని, లేబర్ కోర్టు లు క్రమేపి వుండవని,వాటి స్థానములో ట్రిబ్యునల్స్ వస్తున్నాయని తెలిపారు.సమ్మె చేసేహక్కు,సంఘం నడుపు కొనే పరిస్థితి లేకపోవడంతో బేరసారాలుకు అవకాశం లేక కార్మికులు యేలా బ్రతుకు తారని ప్రశ్నించారు.కోడ్ లు రద్దు అయ్యే వరకు సమిష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. రైతు సంఘాలు సమిష్టిగా 13నెలలు ఢిల్లీలో పోరాడి తమకు వ్యతిరేకంగా వచ్చిన 3 నల్లచట్టాలను రద్దు చేయించారని తెలిపారు.యూనియన్ గౌరవాధ్యక్షులు,షేక్.హుస్సేన్ వలి మాట్లాడుతూ,డిసెంబర్ 31 నుండి జనవరి 4వరకు వైజాగ్ లో సీఐటీయూ 18వ అఖిలభారత మహాసభలు జరుగుతున్నవని అందులో దేశవ్యాప్తంగా కార్మికులు యెదురుకొంటున్న సమస్యలు చర్చించి పరిష్కారానికి నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆఖరిరోజు భారీప్రదర్శన,సభ వుంటాయని చెప్పారు.ఈ సభలో కార్మికులు పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో జి. వెంకటసుబ్బయ్య, జె.వెంకటేశ్వరావు,టి.వీర ఆంజనేయులు,టి.చంద్రశేఖర్ రావు,బి.మాధవరావు,టి.కాశీ విశ్వనాథ్,డి.పవన్ తేజ,కె. నాగరాజు,టి.వాసు,శివ నాగేశ్వరరావు,గంటా శ్రీనివాసరావు,ముద్రబోయిన వెంకటేశ్వర్లు,కె.చంద్రశేఖర్ రావు,డి.పవన్ తేజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌శాఖ కార్యాలయంలో సెమీ క్రిస్మస్

వేమూరు డిసెంబర్ 18 (ప్రభాతవార్త) : సర్వ మానవాళికి శాంతి, ప్రేమ, దయగుణం కలిగి ఉండాలని ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలియజేశారు.





గురువారం స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో విద్యుత్ ఉద్యోగులతో కలిసి సెమీ క్రిస్మస్ వేడకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటా ్లడుతూ ప్రపంచ వ్యాప్తంగా అధిక శాతం ప్రజలు జరుపుకునే పండుగ క్రిస్మస్ అని తెలియజేశారు. ఫాస్టర్ హయ్యర్ జోషి మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు అన్నీ శాంతి, సన్మార్గం సోదరభావంతో మెలగాలని తెలిపారు. సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి వాక్య సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అధికారులు, వేమూరు మండలంలోని విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్న తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం

వేమూరు డిసెంబర్ 18 (ప్రభాతవార్త) : చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రామకృష్ణ తెలియజేశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం మీటింగ్ హాల్లో పారిశ్రామిక వేత్తలు ఉద్యమ ఆధార్ రిజిస్ట్రేషన్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సదస్సులో ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు యువ పారిశ్రామికవేత్తలుగా



ఎదగాలన్నారు. కుటీర పరిశ్రమల ఏర్పాటుకు పిఎంఈజీ రుణం, పీఎంఎఫ్ఈ రుణం పొందాలంటే ఉద్యమ ఆధార్ నమోదు కావాలన్నారు. దీని ద్వారా బ్యాంకు రుణాలు పొంది సబ్సిడీ వినియోగించుకోవచ్చని సూచించారు. పరిశ్రమ శాఖ ద్వారా కోటి రూపాయల వరకు రుణం అందించేందుకు సహకరిస్తామని అదే విధంగా ముద్ర రుణాలు కూడా పొందవచ్చు అని తెలియజేశారు. ఈ సందర్భంగా వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, ఐపీఓ సురేంద్ర, ఏపిఎం శోభన్, ఎమ్మెస్ ఎం.యు.లబ్ధిదారులు ఉన్నారు.

## కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పి కొట్టాలి. పాశం రామారావు

పెదనందిపాడు డిసెంబరు 18(ప్రభాతవార్త) జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పి కొట్టాలని కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు పిలుపు నిచ్చారు. గురువారం తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో జరిగిన వివిధ ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశానికి సి.ఐ.టి.యు మండల నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు అధ్యక్షత వహించారు . వామపక్షాల పోరాటాల ఫలితంగా 2005లో యూ.పీ.ఏ. ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం తెచ్చిందని ,చట్టప్రకారం వ్యవసాయ కూలీలు పనులు లేని రోజులలో ఉపాధి కోసం వలసలు పోకుండా ,నివశించే గ్రామాలలోని ఉపాధి కల్పించే ఉద్దేశంతో, చట్టం చేశారని అన్నారు.కనీస వేతనం రోజుకు 250 రూపాయలు నిర్ణయించారని ,పేదలకు ఎంతో వెసులుబాటుగా ఉన్న చట్టాన్ని, బి.జె.పి ప్రభుత్వం పేరు మార్చడమే కాకుండా ,గాంధీ గారి పేరు తొలగించడం అన్యాయమని అన్నారు. గతంలో జాతీయ గ్రామీణ ఉపాధికి కేంద్రం 90 శాతం, రాష్ట్రాలు 10 శాతం నిధులు కేటాయించేవారని, మార్పు ఫలితంగా ,కేంద్రం 60శాతం,రాష్ట్రాలు 40 శాతం భరించాలని నిబంధనలు విధించడం, రాష్ట్రాల పై అదనపు భారాలు మోపడమేనని అన్నారు.ఇప్పటికే జీ.ఎస్ .టి .పేరుతో రాష్ట్రాల ఆదాయ వనరులను, కేంద్రం కొల్లగొడుతుందని ,మరల 40 శాతం భారం మోపడం సరికాదని అన్నారు .ఈ చట్టాన్ని రద్దు చేసే కుట్రలు చేస్తున్నట్లు వెల్లడవుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పేదలందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సి.ఐ.టి.యు మండల నాయకులు రమేష్ బాబు మాట్లాడుతూ ,అనేక ఉద్యమాలు, పోరాటాల ద్వారా సాధించుకున్న ,జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రక్షి ంచుకోవాలని పిలుపునిచ్చారు .జాతీయ గ్రామీణ ఉపాధి పథకం లో ఉన్న పొరపాట్లను సవరించి, చట్టాన్ని పటిష్టం చేయాలని, సంవత్సరానికి 200 పనిదినాలు కల్పించి ,కనీస వేతనం రోజుకు 600 రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .సమావేశంలో పెన్షనర్స్ సంఘం నాయకులు జంపని రామారావు ,రైతు సంఘం నాయకులు నల్లమోతు రాజేంద్ర, కె.లక్ష్మి ్మ ,ప్రియ ,తదితరులు పాల్గొన్నారు.



# నాంపల్లి కోర్టుకు హాజరైన మంత్రి సీతక్క

## కరోనాను ఆరోగ్యశ్రీలో చేర్చాలని 2021లో ధర్నా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 18:** తెలంగాణ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఈరోజు నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నమోదైన కేసు విచారణలో భాగంగా ఆమెతో పాటు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కూడా కోర్టు ఎదుట హాజరయ్యారు. 2021లో కరోనా మహమ్మారి తీవ్రంగా ఉన్న సమయంలో, కోవిడ్ చికిత్సను ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చాలని డిమాండ్ చేస్తూ సీతక్క, అప్పటి ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. కరోనా రోగులకు ఉచిత అంబులెన్స్ సేవలు అందించాలని, వ్యాధితో మరణించిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం చేయాలని వారు అప్పటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అయితే, లాక్‌డౌన్ నిబంధనలు అమల్లో ఉండగా ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించి, కరోనా వ్యాప్తికి కారణమవుతున్నారని ఆరోపిస్తూ అప్పటి కేసీఆర్ సర్కార్ సీతక్క, బల్మూరి వెంకట్‌పై కేసు నమోదు చేసింది. ఆ కేసుకు సంబంధించిన విచారణలో భాగంగానే ఇవాళ వారిద్దరూ న్యాయస్థానం ముందు హాజరయ్యారు.

# గిరిజన ఉద్యోగులకు బడ్జెట్ నిధులు విడుదల

**హైదరాబాద్, డిసెంబరు 18, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఉద్యోగులకు మూడవ విడత బడ్జెట్ నిధులను విడుదల చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దీనికి సంబంధించి గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధానంగా రాష్ట్రంలోని అసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న 4వ తరగతి ఉద్యోగుల గౌరవ వేతన మూడో విడత బడ్జెట్‌కు సంబంధించిన సొమ్మును విడుదల చేశారు. ఇందులో భాగంగా ఆసిఫాబాద్ జిల్లాలో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగుల వేతన నిధులు రూ.42 లక్షల 50 వేలు, నిర్మల్ జిల్లాకు రూ.16 లక్షల 20వేలు, అదిలాబాద్ జిల్లాకు రూ.75 లక్షల 55 వేలు, మంచిర్యాల జిల్లాకు రూ.13 లక్షల 50 వేలు విడుదలయ్యాయి.

# హీరోయిన్ నిధిఅగర్వాల్‌కు చేదు అనుభవం

## కెపిహెచ్‌బి కాలనీలో కేసు నమోదు

**హైదరాబాద్ (కెపిహెచ్‌బి కాలనీ), డిసెంబరు 18, ప్రభాతవార్త:** సంపత్తి ప్రమోషన్‌కు హాజరైన ప్రముఖ సినీనటి నిధి అగ్రవాల్‌కు చేదు అనుభవం ఎదురయింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమెపై కొందరు అసభ్యంగా ప్రవర్తించడంతో నిర్వాహ కులపై కెపిహెచ్‌బి కాలనీ పోలీసులు కేసు నమోదు చేశారు. కెపిహెచ్బి కాలనీలోని లులు మాల్‌లో బుధవారం ప్రభాస్ హీరోగా నటించే రాజా సాబ్ రెండవ పాట లాంచ్ ఈవెంట్ జరుగుతోంది. లాంచ్ అనంతరం నిధి అగర్వాల్ తిరిగి వెళుతుండగా అభిమానులు సెల్ఫీ దిగే క్రమంలో ఒక్కసారిగా గుంపుగా ఆమెపై అసభ్యంగా ప్రవర్తిస్తూ తాకడంతో అసహనానికి గురయ్యారు. దీంతో ఫిర్యాదు ఆధారంగా అసభ్యంగా ప్రవర్తించినందుకు కెపిహెచ్‌బి కాలనీ పోలీసులు సుమోటాగా తీసుకొని నిర్వాకులపై కేసును నమోదు చేశారు. పాట లాంచ్ కార్యక్రమానికి హాజరవు తున్నట్లు ఎలాంటి పర్మిషన్ తీసుకోకపోవడం వల్లే రద్దీ పెరిగి ఇలాంటి సంఘటన చోటుచేసుకుందని అందుకే నిర్వాకులపై కేసు దేశామని సీఐ రాజశేఖర్ రెడ్డి తెలియజేశారు.

# గాంధీ పేరును తొలగించిన ఈరోజు చరిత్రలో చీకటిరోజు

## పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ

**హైదరాబాద్, డిసెంబరు 18, ప్రభాతవార్త:** గాంధీ పేరును తొలగించిన ఈ గురు వారం రోజు చరిత్రలో చీటిరోజని పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపి గడ్డం వంశీకృష్ణ అన్నారు. పార్లమెంట్ సమావేశాలకు హాజరైన ఆయన మీడియాతో మాట్లా డారు. మహాత్మగాంధీ పేరును పార్లమెంట్ లో బిజెపి ప్రభుత్వం చంపేసిందని అన్నారు. 1948లో గాడ్సేను చంపినట్టుగానే మోడీ ప్రభుత్వం గాంధీ పేరును చంపే సిందని వ్యాఖ్యానించారు. ఉపాధి హామీ పథకం ఎంతోమంది పేదలకు ఉపయో గపడుతుందని చెప్పారు. ఇది ప్రజలు గమనించాలని అన్నారు. ఆర్ఎస్ ఎస్ ఎజెండాను అమలుపరుస్తున్నారని వ్యాఖ్యానించారు. నిరుద్యోగం పెరిగి పోతుంటే 2047 నాటికి వికసిత్ భారత్ ఎలా అవతరిస్తుందని మండిపడ్డారు. బిజెపి ప్రభుత్వం దృష్ఠిలో అంబానీ, అదానీ భారత్ అన్నారు. గాంధీ ముక్త భారత్ చేయాలనే లక్ష్యంగా బిజెపి పనిచేస్తుందని మండిపడ్డారు. కార్పొరేట్ శక్తుల కోసమే బిజెపి పాలకులు పనిచేస్తున్నారని చెప్పారు. గాంధీ పేరు ఎక్కడ ఉన్నా తుడిచి వేస్తూ తన పేరు ఉండేలా మోడీ చేస్తున్నాడని వ్యాఖ్యానించారు. ఇది మన దేశానికి వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం అని మండిపడ్డారు.

# అల్పాదాయ వర్గాల సొంతింటి స్వప్నం తీర్చనున్న హౌసింగ్ బోర్డు

## హైదరాబాద్, ఖమ్మం, వరంగల్‌లో 399 ఫ్లాట్లు విక్రయానికి సన్నాహాలు

**హైదరాబాద్, డిసెంబరు 18, ప్రభాతవార్త:** తెలంగాణ హౌసింగ్ బోర్డు అల్పాదయ వర్గాలకు సొంత ఇంటి స్వప్నం సాకారం చేసేందుకు 399 ఫ్లాట్లను విక్రయానికి పెట్టింది. హైదరాబాద్, ఖమ్మం, వరంగల్ ప్రాంతాల్లోని 339 ఫ్లాట్లను అందు బాటులోని ధరలతో ఎక్కడ ఉన్నమార్కెట్ రేటుకు అనుగుణంగా యథాస్థితిలో ఉన్న ప్రాతిపదికన విక్రయిస్తున్నది. అల్పాదాయ వర్గాల ప్రజలకు మంచి వసతులతో కూడిన సొంత ఇంటి వసతిని కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఇప్పటికే అనేక కుటుంబాలు నివసిస్తున్న గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్ మెంట్లలోని ఫ్లాట్లను ఆ వర్గాలకు చెందిన వారికే కేటాయించాలనే నిర్ణయం తీసుకున్నామని హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ విపి గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. ఇవన్నీ కూడా అభివృద్ధి చెందిన, అత్యధిక డిమాండ్ ఉన్న ప్రాంతాల్లోని ఫ్లాట్లే అని బహిరంగ మార్కెట్ కంటే చాలా తక్కువ ధరలతో విక్రయిస్తున్నట్లు ఆయన వివరించారు. వివిధ ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో హౌసింగ్ బోర్డు నిర్మించిన అపార్ట్‌మెంట్‌లలోని ఈ ఫ్లాట్లను ప్రత్యేకించి అఫర్డబుల్ హౌసింగ్ కింద అల్పా దాయ వర్గాల ప్రజల సొంత ఇంటి కలను నెరవేర్చాలన్న లక్ష్యంతో ఏడాదికి ఆరు లక్షల రూపాయల (నెలకు రూ.50 వేలు) ఆదాయం ఉన్న వారికే వీటిని కేటాయించాలనే నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ గచ్చిబౌలి లోని 111 ఫ్లాట్లు, వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలోని అపార్ట్ మెంట్ లో 102 నూ, ఖమ్మంలో శ్రీరామ్ హిల్స్ వద్ద 126 ఫ్లాట్లు అందుబాటులో ఉన్నాయని వైస్ చైర్మన్ విపి గౌతం తెలిపారు. వీటిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతూ దరఖాస్తు చేసుకున్న వారికి పూర్తి పారదర్శకమైన విధానంలో లాటరీ పద్ధతిలో కేటాయిస్తామన్నారు. ఫ్లాట్ల విస్తీర్ణం 450 చదరపు అడుగుల నుంచి 650 చదరపు అడుగుల వరకు ఉన్నదనీ, గచ్చి బౌలి ప్రాంతంలోని ఫ్లాట్ల ధర రూ.26 లక్షల నుంచి గరిష్టంగా 36.20 లక్షల వరకు మాత్రమే ఉన్నదని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఖమ్మం, వరంగల్ లో కనిష్టంగా రూ.19 గరిష్ఠంగా రూ.21.50 లక్షలకు, ఖమ్మంలో రూ.11.25 లక్షలకే అందుబాటులోకి తెచ్చా మన్నారు. ఈ ప్రాంతాల్లోని ఫ్లాట్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్‌లోనూ, మీ సేవా కేంద్రాల్లోనూ దరఖాస్తు చేసుకోవచ్చును. గచ్చిబౌలి ప్రాంతం ఫ్లాట్ల కేటాయింపు లాటరీ ప్రక్రియ జనవరి 6వ తేదీన, వరంగల్‌లోని ఫ్లాట్ల కేటాయింపు జనవరి 8న, ఖమ్మం ఫ్లాట్ల లాటరీ జనవరి 10వ తేదీన నిర్వహిస్తారు. ఈ విక్రయాలకు సంబధించిన వివరాలన్నీ కూడా హౌసింగ్ బోర్డు వెబ్‌సైట్ హెచ్‌టిటిపిఎస్:// టిజిహెచ్‌బి.//సిజిజి.జిఒవి.ఐఎన్ లో అందుబాటులో ఉన్నాయి.

## పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్క్ పునరుద్ధరణకు

# రూ. 14 కోట్లు విడుదల చేయాలి

## కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వినతి



**హైదరాబాద్, డిసెంబరు 18, ప్రభాతవార్త:** యాదాద్రి జిల్లా పోచంపల్లిలోని పోచం పల్లి హ్యాండ్లూమ్ పార్క్ పునరుద్ధరణకు అవసరమైన రూ 14.00 కోట్ల నిధులను తక్షణమే విడుదల చేయాలని భువనగిరి లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఢిల్లీలో కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్, హ్యాం డ్లూమ్స్ కమిషనర్ డా. బీనామహాదేవన్ కలిసి వినతి పత్రం అందించారు. పోచంపల్లి ఇకాట్ హ్యాం డ్లూమ్ అభివృద్ధి పథకం కింద ఈ నిధులు అవసరమని ఎంపి సూచించారు. గతంలో బ్యాంకుల నుండి తీసుకున్న పిఎండి రుణాల బకాయిల కారణంగా ఈ హ్యాండ్లూమ్ పార్క్ నిర్వీ ర్యమై వేలానికి వెళ్లిందని తెలిపారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హ్యాండ్లూమ్ పార్క్‌ను కొనుగోలు చేసి, సంప్రదాయ నేసవృత్తిదారుల జీవనోపాధిని కాపాడుతూ హ్యాండ్లూమ్ కార్య కలాపాలను పునరుజ్జీవింపజేయడానికి కట్టుబడి ఉందని తెలిపారు. రాష్ట్రంలోని హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్, అప్పారెల్ ఎగుమతి పార్కుల కమిషనర్, గ్రేటర్ నోయిడాలోని ఎన్‌హెచ్ డిసి మేనేజింగ్ డైరెక్టర్ కు అధికారికంగా లేఖ రాశామని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం జౌళి మంత్రిత్వ శాఖ నుండి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి పెండింగ్‌లో ఉన్న నిధులు విడుదల చేయాలని ఎంపి కోరారు. పోచంపల్లి ఇక్కత్‌కు ఉన్న అంతర్జాతీయ గుర్తింపు దృష్ట్యా, ఈ నిధులు విడుదలైతే హ్యాం డ్లూమ్ పార్క్ పునరు ద్ధరించబడటంతో పాటు స్థానిక చేనేత వృత్తిదారులకు ఉపాధి కల్పన, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతోందని వివ రించారు.

భారత దేశపు విలువైన హ్యాండ్లూమ్ సంస్కృతి వారసత్వ పరిరక్షణకు దోహదపడు తుందని ఎంపి తెలిపారు. చేనేత వృత్తిదారుల హితాన్ని దృష్టిలో ఉంచుకొని, చారిత్రక పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్క్ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం సాను కూలంగా, వేగవంతమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఉపాధి పథకం పేరు మార్పు గాంధీజీని అవమానించినట్లే

## పేరు తీసేస్తే చరిత్ర మారుతుందా?

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధ్వజం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 18:** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో గాంధీజీ పేరును తొలగించడం ఆయ నను అవమానించినట్లేనని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆయన పేరును తొలగించడం సిగ్గుచేటని అన్నారు. నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలన్న లక్ష్యంతో 2005లో ఆనాటి యూపీఏ ప్రభుత్వం చారిత్రాత్మకమైన ఉపాధి హామీ పథ కాన్ని తీసుకువస్తే గడచిన పది సంవత్సరాల నుంచి బిజేపీ ప్రభుత్వం ఆ పథకానికి తూట్లుపొడుస్తూ నీరు గారుస్తోందని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విమర్శిం చారు. మహాత్మా గాంధీ పేరును తొలగించి, రాష్ట్రాలపై 40 శాతం భారాన్ని నెట్టడం పేదల పొట్ట కొట్టడమేనని దుయ్య బట్టారు. ఈ రోజు పార్లమెంట్‌లో తీసుకు వచ్చిన బిల్లు అభివృద్ధి తిరోగమనమేనని, రాష్ట్రాలపై మోయలేని భార మని అన్నారు. భారతదేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఈజిఏ) ఇప్పుడు వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్(విబి-జి ఆర్ఎఎం-జి))గా మార్చడం అన్యాయమని అన్నారు. లోక్‌సభలో బలవంతంగా గురువారం ఆమోదించిన ఈ కొత్త బిల్లు, పథకం స్వభావాన్ని, నిధుల సమీకరణను పూర్తిగా మార్చివేసిందని విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్య ఫలాలు అందించిన మహనీయుడు, జాతిపిత మహాత్మా గాంధీ పేరు మీద 20 ఏళ్ల క్రితం యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం పేరు మార్చడం వెనుక కేంద్ర పాలకుల సంకుచిత మనస్తత్వం కనిపిస్తోందని, పేరు మార్చినంత మాత్రాన వారి వైఫల్యాల నుంచి కప్పిపుచ్చు కోలేరని అన్నారు. వికసిత్ భారత్ అని నినాదాలు ఇస్తూ, గ్రామీణ భారతానికి వెన్నెముకగా ఉన్న పథకాన్ని అగాధంలోకి నెడుతున్నారని మంత్రి ఆగ్ర హం వ్యక్తం చేశారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పొంగులేటి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రాల హక్కు లను కాలరాస్తూ, పేదల కడుపు కొడితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# పర్యాటక సంపదకు రాష్ట్రం నిలయం



100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ కాంటెస్ట్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న జయేష్‌రంజన్. ఎండి వల్లూరు క్రాంతి తదితరులు.

## హండ్రెడ్ వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ కాంటెస్ట్‌లకు ఆహ్వానం

## టూరిజం ఎండి వల్లూరు క్రాంతి

**హైదరాబాద్ (బేగంపేట), డిసెంబరు 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎంతో పర్యాటక సంపద ఉందని, హండ్రెడ్ వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణా కాంటెస్ట్‌లకు ఆహ్వానం పలుకుతున్నట్లు ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని టూరిజం శాఖ ఎండీ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం టూరిజం ప్లాజాలో నిర్వహించిన కార్యక్రమంలో హండ్రెడ్ వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ పోస్టర్‌ను జయేష్ రంజన్‌తో కల్సి వల్లూరు క్రాంతి తదిత రులు ఆవిష్క రించారు. అనంతరం క్రాంతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం పరిధిలోని వివిధ జిల్లాల్లో ఉన్న టూరిజం ప్రాంతాలైన నేచర్, వైల్డ్‌లైఫ్, ఆర్ట్, కల్చర్, హెరిటేజ్, వాటర్ బాడీస్, కులినరీ, ఫాం, రూరల్ స్టే, రిసార్ట్స్, స్పిరిచ్యువల్, అడ్వెంచర్ ఇలాంటి వాటిని గుర్తించి వాటి చరిత్ర, లొకేషన్, అక్కడికి ప్రయాణ దూరం, ఎంత ఖర్చు అవుతుంది. ఇలా పూర్తి వివరాలను ట్రావెల్ తెలంగాణా కు పంపాలన్నారు. అలా పంపిన వారందరికి కాంటెస్ట్‌లో ఎంపిక చేస్తామన్నారు. ఇందులో మొదటి బహుమతిగా రూ 50వేలు, రెండవ బహుమతి గా రూ30వేలు, మూడవ బహుమతి గా రూ 20వేలు అందజేయడం జరుగు తుందన్నారు. వీటితోపాటు 10 కన్సోలేషన్ బహు మతులు ఉంటాయన్నారు. ఈ కాంటెస్ట్ డిసెంబరు 10న ప్రారంభమైందని, జనవరి 5వరకు ఎంట్రీ చేసుకోవచ్చ న్నారు. విజేతలైన వారికి సంక్రాంతి రోజున బహుమతులు అందజేయ నున్నా మన్నారు. వీకెండ్ వండర్స్ కాంటెస్ట్ కోసం అన్ని జిల్లాల్లో కలెక్టర్ల ద్వారా పోస్టర్లను ఆవిష్క రించనున్నా మన్నారు. కస్టంటూర్స్‌ని ప్రతి ఒక్క రూ వినియోగించుకోవాలన్నారు. ఈ టూర్ లో వినియోగదారుడుకి కావాల్సిన అన్ని సౌకర్యాలు వివిధ రకాలైన ప్యాకేజీలలో అందిం చనున్నా మన్నారు. టూరిస్ట్ డిమాండ్‌కు అనుగుణంగా వారికి కావాల్సిన హోటల్, వాహనం ఇలా ప్రతి ఒక్కటీ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం మాన్వీ మహేష్, ప్రియాంక, ఓంప్రకాష్, ఉత్తర మండలం డీసీపీ ఎస్. రష్మీపెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్టీ గురుకులాల్లో ఫుడ్ పాయిజనింగ్‌పై ఈట్ రైట్

**హైదరాబాద్, డిసెంబరు 18, ప్రభాతవార్త :** తెలంగాణ వ్యాప్తంగా గిరిజన సంక్షేమ శాఖకు చెందిన గురుకులాలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ సొసైటీల్లో (ఈఎంఆర్ఎస్) ఫుడ్ పాయిజన్ జరగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కొన్నేండ్లుగా సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఈట్ రైట్ కొనసాగుతుండగా తాజాగా ఎస్టీ గురుకులాల్లోనూ ఇదే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఈ ఈట్ రైట్ కార్యక్రమంలో భాగంగా సురక్ష, పౌష్టికాహారం, శుభ్రమైన గురుకులం పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నది. గతంలో గురుకులాల్లో కుక్ లకు ట్రైనింగ్ ఇవ్వగా, గత 3 నెలలుగా ఈఎంఆర్ఎస్ పరిధిలో పనిచేస్తున్న 300 మంది టీచర్లకు నిపుణులతో ట్రైనింగ్ ఇప్పిస్తుండగా, ఈ ప్రక్రియ చివరి దశకు చేరుకున్నది. వీరిని హెల్త్ వెల్ నెస్ అంబాసిడర్లుగా అధికారులు ఖరారు చేశారు. కాగా రాష్ట్రంలో గిరిజన సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్ స్టిట్యూషనల్ సొసైటీ పరిధిలో 145 స్కూళ్లు, ఏకలవ్య మోడల్ రెసి డెన్షియల్ సొసైటీ పరిధిలో 23 స్కూళ్లు ఉన్నాయి. ఇందులో సుమారు లక్ష మంది స్టూడెంట్లు చదువుతున్నారు. వీరికి పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు, వాటిలో ఉండే పోషకాలతో కూడిన బుక్ లను అధికారులు అంద జేశారు. అందరూ విద్యార్థులకు కలిపి ఈట్ రైట్ బుక్, 1 నుంచి 5 తరగతి వరకు ది ఎల్లో బుక్, 6 నుంచి 8వ తరగతి స్టూడెంట్స్ కు పింక్ బుక్, 9, 10 స్టూడెంట్స్ కు గ్రీన్ బుక్ అందజేశారు. వారంలో రెండు రోజులు స్టూడెంట్లతో ఈ బుక్ చదివించాలని టీచర్లను సొసైటీ అధికారులు సూచిం చారు. అంతేకాకుండా ఫుడ్ సేఫ్టీ, హెల్త్ ఆఫీసర్లను సైతం గురుకులాల్లో వారానికి ఒకసారి ఈట్ రైట్‌పై టీచర్లు, వార్డెన్లు, స్టూడెంట్స్‌కు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సొసైటీ అధికారులు నిర్ణయించారు.




యాప్‌ను ప్రారంభించి ప్రసంగిస్తున్న ఆచార్య వెలుదండ నిత్యానందరావు, కోట్లహనుమంతరావు, వనజ ఉదయ్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరెడ్డి తదితరులు

# తెలుగు వర్సిటీ యునిక్యాంపస్ యాప్ ఆవిష్కరణ

## విద్యార్థుల కోసం రూపొందించాం: వీసి ఆచార్య వెలుదండ నిత్యానందరావు

**హైదరాబాద్ (నాంపల్లి), డిసెంబరు 18, ప్రభాతవార్త :** తెలుగు భాషా, సంస్కృతుల పరిరక్షణకు కట్టుబడివున్న తెలుగు విశ్వవిద్యాలయం విద్యార్థుల సౌకర్యార్థం యునిక్యాంపస్ పేరున ఒక ప్రత్యేక డిజిటల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు నాంపల్లి ప్రాంగణంలో విశ్వవిద్యాలయంలోని నందమూరి తారక రామారావు కళావేదికలో గురువారం యాప్‌ను లాంఛనంగా ఆవిష్కరించి మాట్లాడారు. నేటి ఆధునిక సాంకేతిక డిజిటల్ యుగంలో విద్యావ్యవస్థ కూడా ఆధునికతను అందిపుచ్చుకునే ఆవశ్యకత ఎంతైనా ఉందని, ఇప్పటి విద్యార్థుల జీవనశైలి పూర్తిగా మొబైల్‌ఫోన్లపై ఆధారపడిన నేపథ్యంలో అవసరమైన సమాచారాన్ని ఒకే వేదికపై అందించాలనే సదుద్దేశంతో ఈ యాప్‌ను రూపొందించామని తెలిపారు. తెలుగు విశ్వవిద్యాలయం తన 40ఏళ్ల చరిత్రలో ఆధునిక సాంకేతికతను మేళవించి విద్యార్థులకు అందించిన ఈ యాప్ ఒక వరంగా నిలిచిపోతున్నందుకు గర్వంగా ఉందని అన్నారు. ఈ ప్రయత్నం ఇతర విశ్వవిద్యాలయాలకు కూడా స్ఫూర్తి ఆదర్శంగా నిలుస్తుందని నిత్యానందరావు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు విశ్వవిద్యాలయ కోర్సుల వివరాలు, సిలబస్, పరీక్షల తేదీలు, చెల్లించాల్సిన ఫీజుల వివరాలు, పరీక్షా ఫలితాలు, నోటిఫికేషన్లు వంటి ఉపయోగకర అంశాలు ఇకపై విద్యార్థుకు వారి మొబైల్‌లోనే అందుబాటులో ఉంటాయన్నారు. భవిష్యత్తులో ఈ యాప్ ద్వారా డిజిటల్ లైబ్రరీ లింకులు, అధ్యాపకులు అందించే లెక్చర్ నోట్స్, పరిశోధనా వ్యాసాలు వంటి పలు విద్యావనరులను కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ ప్రత్యేక యునిక్యాంపస్ యాప్‌ను కొటక్ మహేంద్ర బ్యాంక్ వారి సౌజన్యంతో రూపొందించబడినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కొటక్ మహేంద్ర బ్యాంక్ జోనల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, సెంట్రల్ జోనల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, పబ్లిక్ రిలేషన్ మేనేజర్ వెంకట సత్యప్రసాద్, డైరెక్టర్ శ్రీనివాస్, విశ్వవిద్యాలయం ఆర్థికాధికారి కె.ఎస్.సుహాసిని, పరిపాలనాధికారి నరసింహమూర్తి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి తెలుగు విశ్వవిద్యాలయం అకడమిక్ డీన్ డా. వనజ ఉదయ్ సమన్వకర్తగా వ్యవహరించారు.

# సిఎంకు చిత్తశుద్ధి ఉంటే జడ్పీ, మండల ఎన్నికలు నిర్వహించాలి

## భవిష్యత్‌లో బిజెపిదే తెలంగాణలో పాలన

## బిజెపిఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 18, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని విస్మరించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఎంపిటిసి, జడ్పీటిసి ఎన్నికలతో పాటు మున్సిపల్ ఎన్నికలను వెంటనే నిర్వహించాలని అప్పుడు ప్రజలు ఏ పార్టీపై విశ్వాసం ఉంచుతున్నారో, ఎవరిపై వ్యతిరేకత ఉందో స్పష్టంగా తేలిపోతుందనీ బిజెపిఎల్పి నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సవాల్ విసిరారు. బిజెపి రాష్ట్ర కార్యా లయంలో గురువారం నిర్వహిం చిన మీడియా సమావేశంలో గత 11 సంవత్సరాలుగా మోదీ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ భారీగా నిధులు కేటాయిస్తోందనీ దాని ఫలితంగానే కాంగ్రెస్, బిఆర్ఎస్ మద్దతుదారులు లక్షలాది రూపాయలతో ఓటర్లను ప్రలోభపెట్టినా తెలంగాణలో గతంలో ఎన్నడు లేని విధంగా అత్యధికంగా సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు గెలుచుకున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా మాత్రమే కాకుండా, తెలంగాణ రాష్ట్రంలో కూడా అనేక అభివృద్ధి కార్యక్రమాలను బిజెపి ముం దుండి అమలు చేస్తోంది. మోదీ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గుర్తించి, ఆశీర్వదిస్తూ నిర్మల్ జిల్లాలో అత్యధిక సీట్లను గెలిపించి పార్టీకి బహు మానంగా ఇచ్చారు. ఇది ప్రజల విశ్వాసానికి స్పష్టమైన నిదర్శనం. రాబోయే రోజుల్లో కూడా రాష్ట్రవ్యాప్తంగా ఇదే తరహా ఫలితాలు వస్తాయని పూర్తి విశ్వాసం ఉంది. ఈ గ్రామ సర్పంచుల ఎన్నికల ఫలితాలు, రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు స్పష్టమైన సంకేతంగా నిలుస్తున్నాయి. ఇవి కేవలం ఆరంభం మాత్రమే, ఈ ఉత్సాహం, ఈ మద్దతు కొనసాగితే, రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీని అధికారంలోకి తీసుకువచ్చే దిశగా ఈ ఫలితాలు మార్గం సుగమం చేస్తున్నాయనీ అన్నారు. మేమంతా సమిష్టిగా పని చేస్తూ, రాబోయే ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచి తెలంగాణలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని విశ్వాసం వ్యక్తంచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోందనీ ఆయన అన్నారు. యావత్ తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజల అసంతృప్తి పెద్ద ఎత్తున వ్యక్తమవుతోంది. నిర్మల్ నియోజకవర్గంలో, మూడు విడతల పోలింగ్‌లో 128 గ్రామ పంచాయతీలకు గాను దాదాపు 80 గ్రామ సర్పంచులను బిజెపి మద్దతుగా గెలిపించినారని వివరించారు. ముధోల్ నియోజకవర్గంలో నిన్న పూర్తయిన ఎన్నికల్లో 178 గ్రామ పంచాయతీలకు గాను 98 గ్రామ పంచాయతీల్లో బిజెపి అనుకూలంగా ఫలితాలు వచ్చాయని చెప్పారు. ఈ ఫలితాలు ప్రజలు కాంగ్రెస్ పాలనను తిరస్కరిస్తూ, భారతీయ జనతా పార్టీపై ప్రజా విశ్వాసం పెరిగిందనడానికి స్పష్టమైన సంకేతాలే. అదేవిధంగా, ఖానాపూర్ నియోజకవర్గంలో కూడా నిర్మల్ జిల్లాకు చెందిన నాలుగు మండలాల్లో బిజెపికి అనుకూలంగా ప్రజలు తీర్పు ఇచ్చారు. ఖానాపూర్ నియోజకవర్గంలో దాదాపు 36 గ్రామ సర్పంచులను బిజెపి మద్దతుతో గెలిపించారు. మొత్తంగా చూస్తే, నిర్మల్ జిల్లాలో 213 మంది గ్రామ సర్పంచులను భారతీయ జనతా పార్టీ మద్దతుతో ప్రజలు గెలిపించారు. గత రెండు సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలన అవినీతిలో మునిగిపోయిందనీ ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమై, ఆరు గ్యారంటీలు, 420 హామీలను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని పూర్తిగా గాడి తప్పిందని ఆయన విమర్శించారు. గ్రామ సర్పంచుల ఎన్నికల తీర్పు, అవినీతిలో కూరుకుపోయిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న తీవ్ర వ్యతిరేకతకు స్పష్టమైన ప్రతిబింబం అని ఆయన అభివర్ణించారు. సింబల్స్ లేవని, అధికారం ఉందని చెప్పి గెలిచిన సర్పంచులను కాంగ్రెస్ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేయడం సరికాదని హితవు చెబుతున్నాం. నిజంగా రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే, తక్షణమే మండలపరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించితే, అప్పుడు ప్రజలకు కాంగ్రెస్ పార్టీపై ఎంత వ్యతిరేకత ఉందో స్పష్టంగా బయటపడుతుంది. కేవలం రెండు సంవత్సరాల పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇంతటి ప్రజావ్యతిరేకత కూడగట్టుకోవడం రేవంత్ రెడ్డి సర్కార్ వైఫల్యానికి నిదర్శనం అని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ళు తెరవాలి. ఒకవైపు అవినీతి, మరోవైపు ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయని పరిస్థితి.. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కుంభకోణాలు, అవినీతిలో మునిగిపోయి ప్రజలను పట్టించుకోవడం మానేసిందనీ ఆరోపించారు. 213 గ్రామాలలో గెలిచిన సరపంచ్‌లు, ఉప సర్పంచ్లు 1300 మంది వార్డ్ సభ్యులకు గురువారం 19 డిసెంబర్ 2025న నిర్మల్ లో సన్మాన కార్యక్రమం జరగనుందని తెలిపారు.



గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయం లో మీడియాతో మాట్లాడుతున్న ఏలేటి

# ఎసిబి వలలో కారేపల్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

**కారేపల్లి, డిసెంబరు 18, ప్రభాతవార్త:** కారేపల్లి మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ (ఆర్‌ఐ) దౌలూరి శుభకామేశ్వరిదేవి ఎసిబి వలలో చిక్కారు. ఎసిబి డిఎస్పీ వై. రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కారేపల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తి దగ్గర ఆర్‌ఐ శుభ కామేశ్వరిదేవి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ నివేదికను రాసేం దుకు పదివేల రూపాయలు డిమాండ్ చేసింది. దీంతో బాధితుడి వద్దనుండి నగదు రూపంలో లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయింది. బాధితుని ఫిర్యాదుతో కారేపల్లి లోని ఆమె ఇంటి వద్ద ఎసిబి సిబ్బందితో వలవేసి పట్టు కున్న ట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిఎస్పీ రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ఏదైనా పని చేసేందుకు లంచం అడిగితే ఏసీబీ టోల్‌ఫ్రీ నెంబర్ 1064 నెంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఫిర్యాదుదారుని వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.



19-12Pg 9_19-12Pg5.qxd 18/Dec/25 10:47 PM Page 1



# విబి జి రామ్‌జి బిల్లుకు లోక్‌సభ సై



- ఉపాధి హామీ చట్టం రద్దు పట్ల సభ్యుల తీవ్ర ఆందోళన
- ప్రతులను చించేసిన విపక్షాలు
- స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం
- సభాసంప్రదాయాలు పాటించాలని వినతి
- విపక్షాల ఆరోపణలను తిప్పికొట్టిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్
- సభ నేటికి వాయిదా

**న్యూఢిల్లీ, డిసెంబరు 18:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. “వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్‌గ్రామీణ్ (విబి జి రామ్ జి) పేరుతో రూపొందించిన ఈ బిల్లుపై గురువారం సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా విపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. అయితే, బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, డిఎంకె నాయకులు టిఆర్ బాలు, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు ధర్మేంద్ర యాదవ్ సహా పలువురు విపక్ష పార్టీల సభ్యులు.. జి రామ్‌జి బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. బిల్లుకు వ్యతిరేకంగా సభలో ఆందోళన చేపట్టారు. ఈ పథకానికి మహాత్మా గాంధీ పేరును తొలగించడంఅంటే జాతిపితను అవమానించడమేనని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బిల్లుతో రాష్ట్రాలపై మరింత భారం పడుతుందని ఆరోపించారు.

మరోవైపు జి రామ్‌జి బిల్లును కేంద్ర మంత్రి శివ రాజ్ సింగ్ చౌహాన్ సమర్థించారు. బిల్లుపై లోక్‌సభలో మాట్లాడిన శివరాజ్ సింగ్.. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలకు నెహ్రూ పేరును పెట్టిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోందని విమర్శించారు. ప్రభుత్వానికి పేర్లు మార్చాలనే దురుద్దేశం ఉందంటూ ప్రియాంక గాంధీచేసిన వ్యాఖ్యలనుసైతం ఆయన ఖండించారు. పేర్లు మార్చాలనే ఉద్దేశం కేవలం ప్రతిపక్ష పార్టీలకు మాత్రమే ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని తమ ప్రభుత్వం కేవలం పనిపై మాత్రమే దృష్టి పెడుతోందని చెప్పుకొచ్చారాయన. ఎంజిఎన్‌ఆర్ ఇజిఎ అవినీతి సాధనం తప్ప మరొకటి కాదని, అందరితో చర్చించిన తర్వాతే కొత్త చట్టాన్ని తీసుకువచ్చామని కేంద్రమంత్రి ఉద్ఘాటించారు. కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కామెంట్స్‌పై ప్రతిపక్ష సభ్యులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు ఎంపీలు సభ వెల్‌లోకి ప్రవేశించి.. బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. బిల్లు ప్రతులను చించేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓంబిర్లా మాట్లాడుతూ.. ‘కాగితాలను చించివేయడానికి ప్రజలు మిమ్మల్ని ఇక్కడికి పంపలేదు. దేశం మిమ్మల్ని చూస్తోంది’. అని విపక్ష సభ్యులను హెచ్చరించారు. బిల్లుపై సుదీర్ఘంగా చర్చించారని చెప్పారు. దీంతో మరింత ఆగ్రహానికి గురైన విపక్ష సభ్యులు.. బిల్లు ప్రతులను చించిపడేశారు. వీరిఆందోళనల మధ్యే బిల్లు ఆమోదం పొందినట్లు స్పీకర్ ప్రకటించారు. అనంతరం సభను వాయిదా వేశారు.

సభ వాయిదా పడిన తరువాత పార్లమెంట్ వెలుపల ప్రియాంక గాంధీ వాద్రా మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జి రామ్‌జి బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. “బిల్లులోని వివరాలను చదివిన ఎవరికైనా గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎలా పూర్తి కాబోతోందో అర్థమవుతుంది. ఈ బిల్లు వలన రాష్ట్రాలపై మరింత ఆర్థిక భారం పడనుంది. రాష్ట్రాలు ఆర్థికంగా ఇబ్బంది పడే అవకాశంఉంది. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ పథకం పేదలకు అండగాఉండేది. కానీ, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లు పేదలకు పూర్తి వ్యతిరేకంగా ఉంది”అంటూ కేంద్రప్రభుత్వం తీరుపై ప్రియాంక గాంధీ తీవ్ర విమర్శలు చేశారు.

కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ మాట్లాడుతూ.. లోక్‌సభలో విపక్ష సభ్యులు వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో బిల్లు కాగితాలను చించివేశారని.. ఇది ఖండించాల్సిన అంశమన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలకు చోటు లేదన్నారు. జీ రామ్‌జీ బిల్లుపై సుదీర్ఘంగా చర్చించారని.. అయినప్పటికీ విపక్ష సభ్యులు బిల్లు ప్రతులను చించడం దారుణమన్నారు. ప్రజల ప్రయోజనాల కోసమే ఈ బిల్లును తీసుకురావడం జరిగిందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ మాట్లాడుతూ.. లోక్‌సభలో ప్రతిపక్ష సభ్యులు వ్యవహరించిన తీరు ఏమాత్రం ఆమోదనీయం కాదన్నారు. మీకు వ్యతిరేకించే హక్కుఉంది. కానీ, ఈ రకమైన ప్రవర్తనసరికాదు. బిల్లు ప్రతులను చించివేయడం, విమానాలు తయారుచేయడం, స్పీకర్‌పై విసరడంసరికాదు. దేశంలోనేఅతిపురాతన పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్‌పార్టీ సభ్యులు.. ఇలా ప్రవర్తించడం గర్హనీయం. బిల్లుకు పెట్టిన పేరును విపక్ష సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. కానీ, రాముడి పేరు ఆ మహాత్మా గాంధీకి ఎంతో ఇష్టమైన పేరు. ఆయన తుదిశ్వాస విడిచే సమయంలోనూ హే రామ్ అనే అన్నారు అంటూ కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఇక లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో.. ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు.



# యుట్యూబర్ ఇంట్లో ఇడి సోదాలు

## కోట్ల విలువైన కార్లు సీజ్

## పిఎంఎల్‌ఎ కింద కేసు నమోదు

**న్యూఢిల్లీ, డిసెంబరు 18:** కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఓ యూట్యూబర్ ఇంట్లో సోదాలు చేసింది. ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ యాప్‌ల ద్వారా కోట్ల రూపాయలు సంపాదించినట్లు అందిన ఫిర్యాదు మేరకు తనిఖీలు చేసినట్లు తెలిపింది. ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌కు చెందిన అనురాగ్ ద్వివేది అనే యూట్యూబర్ ఇంట్లో సోదాలు నిర్వహించి లంబోర్ఘిని ఉరుస్, బీఎండబ్ల్యూ జెడ్4, మెర్సిడెస్ బెంజ్ వంటి తొమ్మిది ఖరీదైన స్పోర్ట్స్ కార్లను స్వాధీనం చేసుకుంది.

అనురాగ్ తన యూట్యూబ్ ఛానెల్ ద్వారా ‘స్కై ఎక్స్ఛేంజ్’ వంటి పలు నిషేధిత బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసేవాడని ఇడి అధికారులు తెలిపారు. దేశంలో ఆన్‌లైన్ బెట్టింగ్ చట్టవిరుద్ధమైనప్పటికీ, అతని ప్రచార వీడియోలు చూసి పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ యాప్‌లలో చేరినట్లు దర్యాప్తులో తేలింది. ఈ యాప్‌ల ద్వారా వచ్చిన అక్రమ సంపాదనను మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఏ) కింద దర్యాప్తు చేస్తున్నారు. హవాలా ఆపరేటర్లు, బినామీ బ్యాంకు ఖాతాలు (మ్యూల్ అకౌంట్స్), మధ్యవర్తుల ద్వారా నగదు రూపంలో చెల్లింపులు స్వీకరించినట్లు అధికారులు గుర్తించారు.

ఈ డబ్బును చట్టబద్ధమైనదిగా చూపించేందుకు ప్రయత్నిస్తూ లగ్జరీ కార్లు, ఇతర ఖరీదైన వస్తువులు కొనుగోలు చేసినట్లు తేలింది. అంతేకాకుండా, ఈ అక్రమ సంపాదనతో దుబాయ్‌లో స్థిరాస్తులు కొనుగోలు చేసినట్లు కూడా ఇడి దర్యాప్తులో వెల్లడైంది. ఈ నెట్‌వర్క్‌పై పశ్చిమ బెంగాల్ పోలీసులు కూడా సిలిగురిలో సోదాలు నిర్వహించారు. సోను కుమార్ ఠాకూర్, విశాల్ భరద్వాజ్ అనే మరో ఇద్దరు నిందితులను గుర్తించారు. ఈ వ్యవహారంలో ఇంకా ఎవరెవరు ఉన్నారు, ఎంత మొత్తం అక్రమంగా సంపాదించారనే కోణంలో ఇడి దర్యాప్తు ముమ్మరం చేసింది.

# నాకిష్టమైన పదం టారిఫ్స్

## 10 నెలల్లో 8 యుద్ధాలు ఆపా: అమెరికా అధ్యక్షుడు ట్రంప్



**వాషింగ్టన్, డిసెంబరు 18:** ఇంగ్లీష్ భాషలో నాకు అత్యంత ఇష్టమైన పదం ‘టారిఫ్స్’ అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఆ టారిఫ్‌లతోనే తాను అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే ఎనిమిది యుద్ధాలను ఆపానని పేర్కొన్నారు. సుంకాల వల్లే ఇది సాధ్యమైందని ట్రంప్ పునరుద్ఘాటించారు. తన ముందు అధ్యక్షుడిగా ఉన్న జో బైడెన్ దేశాన్ని గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టి తన చేతుల్లో పెట్టారని ఆయన తీవ్రంగా విమర్శించారు. దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన 79 ఏళ్ల ట్రంప్ తన ప్రభుత్వ 2026 అజెండాను ఆవిష్కరించారు. కెనడా, మెక్సికో, భారత్ వంటి దేశాలపై విధించిన టారిఫ్‌ల వల్లే అమెరికా ఆర్థిక వ్యవస్థకు మేలు జరిగిందని సమర్థించుకున్నారు. “టారిఫ్‌ల వల్ల మేం అనుకున్నదానికంటే చాలా ఎక్కువ డబ్బు సంపాదించాం” అని తెలిపారు. వలసలు, ద్రవ్యోల్బణం వంటి సమస్యలకు బైడెన్ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. తాను అధికారం చేపట్టే నాటికి దేశం గందరగోళంలో ఉంది. ఇప్పుడు దాన్ని నేను సరిదిద్దుతున్నాని ట్రంప్ పేర్కొన్నారు.



# ఎఐ రాక... అందరికీ మంచిదే

## - ఎలాన్ మస్క్

**వాషింగ్టన్, డిసెంబరు 18:** టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతున్న వేళ... ఎఐ రాకతో అందరికీ మంచే జరుగుతుందని ప్రపంచ కుబేరుడు, టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ప్రజలు డబ్బు ఆదా చేసుకోవాల్సిన అవసరమే ఉండదని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాకతో “యూనివర్సల్ హై ఇన్‌కమ్” (అందరికీ అధిక ఆదాయం) అందుబాటులోకి వస్తుందని మస్క్ జోస్యం చెప్పారు. ఎఐ, రోబోటిక్స్ రంగాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పుల వల్ల పేదరికం పూర్తిగా తొలగిపోతుందని, సంప్రదాయ ఉద్యోగాల అవసరం కూడా తగ్గుతుందని పునరుద్ఘాటించారు. ఉత్పాదకత విపరీతంగా పెరిగితే, గాలి మాదిరిగానే డబ్బే అసంబద్ధంగా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

అయితే, మస్క్ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 600 బిలియన్ డాలర్ల సంపద కలిగిన వ్యక్తి, ఇతరులకు డబ్బు దాచుకోవద్దని సలహా ఇవ్వడం విడ్డూరంగా ఉందని పలువురు నెటిజన్లు ఎద్దేవా చేస్తున్నారు. “అన్నీ ఉచితంగా లభిస్తే, వస్తువులను ఉత్పత్తి చేయడానికి ఎవరికి ప్రోత్సాహం ఉంటుంది?” అని ఒకరు ప్రశ్నించగా, “అందరికీ ఆదాయం వచ్చినా, అధిక ఆదాయం అనే నిర్వచనం ఎప్పటికప్పుడు మారుతూనే ఉంటుంది” అని మరొకరు అభిప్రాయపడ్డారు.

# బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు భారత్‌కు

- అధికారికంగా జనవరి 1న స్వీకరణ
- బదలీ చిహ్నం అందించిన బ్రెజిల్





**న్యూఢిల్లీ, డిసెంబరు 18:** బ్రిక్స్ అధ్యక్ష పదవి తాజాగా భారత్‌కు దక్కింది. బ్రెజిల్ నుండి భారత్‌కు ఈ బాధ్యత బదిలీ అయ్యింది. 2026 జనవరి 1న భారత్ అధికారికంగా బ్రిక్స్ అధ్యక్షపదవిని చేపట్టనుంది. బ్రిక్స్ అధ్యక్ష పదవి బదిలీచిహ్నాల ద్వారా బ్రెజిల్ బలమైన సందేశాన్ని అందించింది. 2024లో రష్యా నుండి అందుకున్న ఉక్కు సుత్తి తర్వాత, బ్రెజిల్ అమెజాన్ రెయిన్‌ఫారెస్ట్ నుండి రీసైకిల్‌చేసిన కలపతో తయారు చేసిన సుత్తిని భారత దేశానికి బహూకరించింది. బ్రెజిల్‌కు చెందిన బ్రిక్స్ ప్రతినిధి మోరిసియో లిరియో మాట్లాడుతూ, ఈచిహ్నం స్థిరమైన అభివృద్ధి, భాగస్వామ్యాల బలం, భారతదేశ నాయకత్వంపై విశ్వాసాన్ని సూచిస్తుందని అన్నారు. డిసెంబర్ 11-12 తేదీలలో బ్రెసిలియాలో నిర్వహించిన బ్రిక్స్ షెర్పాస్ సమావేశం, కేవలం ప్రతీకాత్మక అంశాలపై కాకుండా, నిర్దిష్ట పురోగతిని సమీక్షించడంపై దృష్టి సారించింది. 2025 వరకు బ్రెజిల్ అధ్యక్ష పదవిలో సాధించిన విజయాలను 11సభ్యదేశాల ప్రతినిధులు సమీక్ష నిర్వహించారు. బ్రెజిల్ విదేశాంగమంత్రి మౌరో వియెరామాట్లాడుతూ, బ్రిక్స్ ఔచిత్యాన్ని ఇకపై కేవలం దౌత్య ప్రకటనలద్వారా కొలవలేమని, సాధారణ ప్రజల జీవితాలపై దానినిజమైన ప్రభావంద్వారా ఆధారపడి ఉంటుందని అన్నారు.

# వివాహ వివాదం.. తల్లిదండ్రులను చంపి, ముక్కలుగా నరికిన కిరాతకుడు

## ఉత్తర ప్రదేశ్‌లో దారుణం



**లక్నో, డిసెంబరు 18:** ముస్లిం భార్య వల్ల వివాదం నేపథ్యంలో ఓ వ్యక్తి అత్యంత దారుణానికి పాల్పడ్డాడు. గ్రైండింగ్ రాయితో తల్లిదండ్రులను కొట్టిచంపాడు. మృతదేహాలను ముక్కలుగా నరికాడు. ఆభాగాలను సిమెంట్ సంచుల్లో పట్టు కెళ్లినదిలోపడేశాడు. వృద్ధదంపతుల మిస్సింగ్‌పై దర్యాప్తుచేసిన పోలీసులు చివరకు నిందితుడిని అరెస్టుచేశారు. యుపిలోని జౌన్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 62 యేళ్ల శ్యామ్ బహదూర్ రిటైర్డ్ రైల్వే ఉద్యోగి. 60 యేళ్ల భార్య బబితతో కలిసి అహ్మద్‌పూర్‌లో నివసిస్తున్నాడు. వారికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కాగా, ఐదేళ్లకిందట ఇంజినీర్ అయినకొడుకు అంబేష్ కోల్‌కతాకు చెందిన ముస్లిం మహిళను పెళ్లిచేసుకున్నాడు. ఈ జంటకు ఇద్దరు పిల్లలు. అయితే కొడుకు మతాంతర వివాహాన్ని తల్లి దండ్రులు అంగీకరించలేదు. ముస్లిం భార్యను విడిచిపెట్టాలని కొడుకుఅంబేష్‌కు తండ్రి తెగేసి చెప్పాడు. దీంతో ఈ విషయమై చాలాకాలంగా ఆ కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. మరోవైపు ముస్లిం భార్యను వదిలేయాలని అంబేష్ నిర్ణయించాడు దీనికి ఆమెకూడా అంగీకరించింది. భరణం కింద రూ. 5లక్షలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో అంబేష్ మూడు నెలల కిందట కోల్‌కతానుంచి సొంత గ్రామానికి చేరుకున్నాడు. తల్లిదండ్రుల ఇంట్లో ఉంటున్నాడు. భార్యకు భరణంఇచ్చేందుకు రూ.5లక్షలు ఇవ్వాలని తల్లిదండ్రులతో గొడవ పడుతున్నాడు. ఈనెల 8న డబ్బువిషయమై తల్లిదండ్రులు, అంబేష్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆగ్రహించిన అతడు గ్రైండింగ్ రాయిలో తల్లి బబితతలపై కొట్టడంతో ఆమె కుప్పకూలిపోయింది. ఇదిచూసి తండ్రి శ్యామ్ ఆందోళన చెందాడు అరిచి స్థానికులను అప్రమత్తం చేశాడు. అయితే అదే గ్రైండింగ్‌రాయితో తండ్రితలపై పలు మార్లు కొట్టిచంపాడు. తర్వాత మృతదేహాలను రంపంతోనరికాడు. సిమెంట్ సంచుల్లో శరీరభాగాలను మూటకట్టి కారులో తీసుకెళ్లి సమీపంలోని నదిలో పడేశాడు.



# సూపర్ పవర్ అంత ఈజీ కాదు

## ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్

**న్యూఢిల్లీ, డిసెంబరు 18:** భారతదేశం సూపర్ పవర్ హోదా వైపు దూసుకుపోతున్నప్పటికీ, ఇంకా చేయాల్సిన పని చాలా ఉందని ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అభిప్రాయపడ్డారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో ఆయన మాట్లాడుతూ, రాబోయే 30 సంవత్సరాల కాలంలో దేశ ప్రజలందరూ ఎంతో కష్టపడినప్పుడే ఆ లక్ష్యాన్ని చేరుకోగలుగుతామని అన్నారు. ప్రస్తుతం మనంసాధిస్తున్న వృద్ధిని చూసి అలసత్వం ప్రదర్శించరాదంటూ ఉద్యోగ, నైపుణ్య కల్పనలోను, నాణ్యమైన విద్య, ఉత్పాదకత వంటి విషయాల్లోను ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. ప్రస్తుత వృద్ధి గణాంకాలు చూసి మనం ఆర్థిక బలంగా ఉన్నట్టు భావించకూడదని వ్యాఖ్యానించారు. భారతదేశం సూపర్ పవర్‌కాదని, అలా అనుకోవడం పరిణతి లేనితనానికి నిదర్శనమని రాజన్ అన్నారు.

# బెల్జియం కోర్టులో మెహుల్ చోక్సీకి పెద్ద షాక్

## త్వరలోనే భారత్‌కు అప్పగింత



**బ్రస్సెల్స్, డిసెంబరు 18:** పంజాబ్ నేషనల్ బ్యాంకు రూ.13 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడి పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు, వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీకి బెల్జియంలో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. భారతదేశానికి తనను అప్పగించకుండా నిలువరించాలంటూ దాఖలు చేసిన అప్పీల్‌ను బెల్జియంలోని అత్యున్నత న్యాయస్థానం కోర్ట్ ఆఫ్ కసేషన్ తిరస్కరించింది. భారత్‌లో తనకు న్యాయం దక్కదని, తీవ్రంగా హింసకు గురి చేస్తారని చోక్సీ చేసిన వాదనలకు ఎలాంటి ఆధారాలు లేవని న్యాయస్థానంస్పష్టంచేసింది. చోక్సీపై భారత్‌లో కోర్టులు సక్రమంగా పనిచేస్తున్నాయి. అతడికి అన్యాయం జరిగే అవకాశంలేదని పేర్కొంది. అలాగే, అతడు ప్రస్తావించిన ‘ఫ్లాగ్రంట్ డినైల్ ఆఫ్ జస్టిస్’, హింస, అవమానకరమైన ప్రవర్తనకు సంబంధించిన ఆరోపణలు నమ్మదగినవిగా లేవని స్పష్టం చేసింది. అప్పీల్‌ను తిరస్కరించడమేకాకుండా, చోక్సీకి 104 యూరోల జరిమానా కూడా విధించింది. అయితే, అంతకుముందు అంట్వెర్ప్ కోర్ట్ ఆఫ్ అప్పీల్‌లోని ఇండిక్ట్‌మెంట్ ఛాంబర్ ఇచ్చిన తీర్పును కోర్ట్ ఆఫ్ కసేషన్ సమర్థించింది. మెహుల్ చోక్సీ సమర్పించిన పత్రాలు, భారత్‌లో అతడికి వాస్తవంగా తీవ్రమైన ప్రమాదం ఉందని నిరూపించేందుకు సరిపోవని ఇప్పటికే దిగువ కోర్టు తేల్చింది. కోర్టు ఆఫ్ కసేషన్ పాత్ర చట్టం సరిగ్గా అమలైందా? న్యాయపరమైన ప్రక్రియలు పాటించబడ్డాయా?అన్నదాన్ని మాత్రమే పరిశీలించడమేనని స్పష్టంచేస్తూ, ఈకేసులో ఎలాంటి చట్టపరమైన లోపాలు లేవని వెల్లడించింది.

ఇక, మెహుల్ చోక్సీ తన అప్పీల్‌లో అంటిగ్వా నుంచి తనను కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించారన్న ఆరోపణలు, ఇంటర్‌పోల్ రెడ్ నోటీసు తొలగింపు, మీడియా కథనాలు, భారత్‌లో న్యాయమైన విచారణ జరగదన్న వాదనలను ప్రస్తావించాడు. అయితే, 2022 నవంబరులో ఇంటర్‌పోల్‌కు చెందిన సిసిఎఫ్ అతడి పేరును రెడ్ నోటీసు జాబితా నుంచి తొలగించి నప్పటికీ, అది ఈ కేసుపై ప్రభావం చూపదని బెల్జియం కోర్టు స్పష్టంచేసింది. మొదటిసారి అన్ని వివరాలు సమర్పించక పోయినా, అప్పీల్ దశలో పూర్తి వాదనలు వినిపించే అవకాశం లభించినందున చోక్సీ హక్కును ఉల్లంఘించబడలేదని తెలిపింది. కాగా, ముంబై ప్రత్యేక కోర్టు 2018 మే, 2021జూన్‌లో జారీచేసిన అరెస్టువారెంట్లు చెల్లుబాటవుతాయని ఇప్పటికే బెల్జియంలోని దిగువ కోర్టులు తేల్చిన విషయాన్ని కోర్ట్ ఆఫ్ కసేషన్ మరోసారి ధ్రువీకరించింది.

కాగా, బెల్జియం కోర్టు ఇచ్చిన తీర్పుతో వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీని భారత్‌కు అప్పగించే ప్రక్రియకు మార్గంసుగమమైంది. అయితే, చోక్సీ 2018 జనవరిలో, పిఎన్‌బి కుంభకోణం వెలుగులోకి రావడానికి కొద్ది రోజుల ముందే భారత్‌ను విడిచిపెట్టాడు. ఈ కేసులో సిబిఐ ఆరోపణల ప్రకారం.. మొత్తం రూ. 13 వేల కోట్ల స్కాం కేసులో చోక్సీ ఒక్కరే రూ.6,400 కోట్లను కాజేశాడు. భారత్ అభ్యర్థనమేరకు 2018 డిసెంబరులో ఇంటర్‌పోల్ అతడి పేరును రెడ్ నోటీసులో చేర్చింది. 2024 ఆగస్టు 27న భారత్ బెల్జియంకు అధికారికంగా చోక్సీ అప్పగింత అభ్యర్థన పంపింది. విచారణ సమయంలో అతడి భద్రత, మానవ హక్కులు, వైద్య అవసరాలు, జైలు సదుపాయాలపై బెల్జియంకు ఇండియా హామీలు కూడా ఇచ్చింది. తాజా తీర్పుతో చోక్సీ భారత్‌కు రప్పించే ప్రయత్నాలకు మరింత బలం చేకూరినట్టయింది.

# సంక్షిప్తంగా..

## బంగ్లాదేశ్‌లో మరో రెండు భారత వీసా కేంద్రాలు మూసివేత

**ఢాకా, డిసెంబరు 18:** పొరుగు దేశమైన బంగ్లాదేశ్‌లో మరో రెండు భారత వీసా కేంద్రాలు మూతపడ్డాయి. రాజ్‌షాహి, ఖుల్నాలోని వీసా కేంద్రాలను భారత్ మూసేసింది. రాజధాని ఢాకాలోని వీసా కేంద్రాన్ని ఇప్పటికే భారత్ మూసివేసిన విషయం తెలిసిందే. బంగ్లాదేశ్ నాయకులు, అసాంఘిక శక్తుల నుంచి బెదిరింపులు నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా వీసా కేంద్రాలను భారత్ మూసివేసింది. భద్రతా పరిస్థితుల దృష్ట్యా రాజ్‌షాహి, ఖుల్నాలోని వీసా కేంద్రాలను మూసివేస్తున్నాం. వీసా దరఖాస్తు కోసం గురువారం బుక్ అయిన అపాయింట్‌మెంట్ స్లాట్‌లను మరో తేదీకి మారుస్తాం’ అని భారత్ ప్రకటించింది. మరోవైపు ఢాకాలోని జమున ఫ్యూచర్ పార్క్‌లో భారత వీసా అప్లికేషన్ సెంటర్ భారత్ బుధవారం మూసివేసిన విషయం తెలిసిందే.

## బంగ్లాలో రాజకీయ సంక్షోభం భారత్‌కు ముప్పే: వాజిద్

**ఢాకా, డిసెంబరు 18:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కుమారుడు సాజిబ్‌వాజేద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బంగ్లాలో రాజకీయ సంక్షోభం భారత్‌కు పెద్ద ముప్పు అని పేర్కొన్నారు. ఆ దేశంలో ఇప్పటికే ఉగ్రవాద శిక్షణ శిబిరాలు నెలకొన్నాయని ఆరోపించారు. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ సాజిబ్‌వాజేద్ ఈ వ్యాఖ్యలు చేశారు. వచ్చే యేడాది ఫిబ్రవరిలో బంగ్లాలో ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. దీనిపై స్పందిస్తూ.. ప్రజాస్వామ్యాలను అణగదొక్కేలా ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వం విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు. ఇస్లామిక్ పార్టీలకు అధికారం కట్టబెట్టాలనే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఈ మార్పు భారత భద్రతపై ప్రత్యక్షమైన ప్రభావం చూపనుందన్నారు.

## క్షమాపణ చెప్పకపోతే చంపేస్తానని సిఎం నితీష్‌కు వార్నింగ్

**పాట్నా, డిసెంబరు18:** బీహార్‌లో హిజాబ్ వ్యవహారం ముదురుతోంది. ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ వ్యవహారశైలిని ఇప్పటికే విపక్ష పార్టీలు దుమ్మెత్తిపోస్తుంటే ఇప్పుడు దాయాది దేశానికి చెందిన ఓ గ్యాంగ్‌స్టర్ బెదిరింపులకు దిగాడు. పాకిస్థాన్‌కు చెందిన ఒక గ్యాంగ్‌స్టర్ షాజాద్ భట్టి వీడియో సందేశం ద్వారా బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌ను హెచ్చరించారు. వైద్యురాలి హిజాబ్‌ను తొలగించినందుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాడు. లేదంటే చంపేస్తానంటూ బెదిరించాడు రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి ఇలా ప్రవర్తిస్తాడా? అని ప్రశ్నించాడు. తక్షణమే క్షమాపణ చెప్పాలని కోరాడు. చెప్పకపోతే పరిణామాలు తీవ్రంగా ఉండవచ్చని వార్నింగ్ ఇచ్చాడు. గ్యాంగ్‌స్టర్ వీడియోను పరిశీలిస్తున్నట్లు బీహార్ డిజిపి వినయ్‌కుమార్ అన్నారు. వీడియోపై పాట్నా డిజి స్థాయిలో విచారణ జరుగుతోందని మిగతా విషయాలు తర్వాత పంచుకుంటామని చెప్పారు.

## ఓల్డ్ కార్లకు ఢిల్లీలో నో ఎంట్రీ

**న్యూఢిల్లీ, డిసెంబరు 18:** ఢిల్లీలో కాలుష్య నియంత్రణకు అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. ముఖ్యంగా పాత వాహనాల విషయంలో ఎలాంటి మినహాయింపులకు తావివ్వడం లేదు. ఢిల్లీ సరిహద్దులతో పాటు నగరంలోనూ వివిధ ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. బీఎస్ 4, ఆపై ప్రమాణాలు ఉన్న వాహనాలకు తప్ప మిగతా వాహనాలను ఢిల్లీలోకి అనుమతించడం లేదు. పాత వాహనాలతో వచ్చే వారికి భారీ మొత్తంలో జరిమానాలు విధిస్తున్నారు. బిఎస్ 3 కార్లలో వచ్చే వారికి రూ.20 వేలు ఫైన్ వేస్తామని హెచ్చరిస్తున్నారు. జరిమానా తప్పించుకోవాలంటే సరిహద్దు నుంచే వెనక్కి వెళ్లిపోవాలని ఆదేశిస్తున్నారు. పోలీసుల తనిఖీలతో ఢిల్లీ, ఫరీదాబాద్ వాసులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాలుష్య నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి తాము మూల్యం చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు.

## ఇమ్రాన్ ఖాన్ చెల్లెళ్లపై ఉగ్ర కేసు

**ఇస్లామాబాద్, డిసెంబరు 18:** పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ చెల్లెళ్లపై అక్కడి పోలీసులు యాంటీ టెర్రరిస్ట్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఇమ్రాన్‌ను కలుసుకోవడానికి అధికారులు నిరాకరించడంతో ఆయన సోదరీమణులు అడియాలా జైలు ముందు ఆందోళన చేయగా పోలీసులు వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వారితో పాటు పిటిఐ నేతలు, కార్యకర్తలపైన కేసు నమోదు చేసినట్లు రావల్పిండి పోలీసులు తెలిపారు. పాకిస్థాన్ పీనల్ కోడ్‌లోని సెక్షన్ 120బి (నేరపూరిత కుట్ర) ఆరోపణలు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇటీవల ఇమ్రాన్ ఖాన్ జైలులో చనిపోయారని ప్రచారం జరిగింది. దీంతో ఆయన కుటుంబ సభ్యులతో పాటు పార్టీ నేతలు, కార్యకర్తలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలోనే ఇమ్రాన్ ఖాన్‌ను ఉంచిన రావల్పిండిలోని అడియాలా జైలు ముందు ఆందోళనకు దిగారు.

19-12Pg6exHMNWJQE 10_19-12Pg6exHMNWJQE.qxd 18/Dec/25 11:14 PM Page 1



# దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్‌కు నైపుణ్య శిక్షణ

## - ఉపాధి కల్పనకు ప్రభుత్వం కృషి : మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి



**విజయవాడ, డిసెంబరు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్ కి సాధికారత, నైపుణ్యం పెంపునకు, ఉపాధి కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని దివ్యాంగులు, మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ రాష్ట్ర మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. 21 సెంచరీ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సహకారంతో దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్‌కి ఆన్లైన్ ఎంవర్మమెంట్ స్కిల్ డెవలప్ మెంట్ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి డా.స్వామి వెలగపూడి సచివాలయంలో గురువారం నాడు జూమ్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ... .రాష్ట్రంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్‌కి నైపుణ్యం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పోటీ పరీక్షలకు అవసరమైన సబ్జెక్టు బోధనతో పాటు డిజిటల్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, కెరీర్ గైడెన్స్, మెంటార్ షిప్ పై శిక్షణ అందిస్తారని తెలిపారు. ఈ శిక్షణ వారిలో నైపుణ్యాన్ని పెంపొందించి ఉపాధి, ఉద్యోగకాశాలకు బాటలు వేసేందుకు దోహదపడుతుందన్నారు. దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్ల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాటుపడుతున్నారన్నారు. ఇటీవల సీఎం చంద్రబాబు నాయుడు దివ్యాంగులకు 7 వరాలు ప్రకటించారన్నారు. దివ్యాంగుల కోసం కలెక్టరేట్లు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో లిఫ్టులు ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. దివ్యాంగులకు త్వరలో ఉచితంగా త్రీవీలర్స్ పంపిణీ చేస్తామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా దివ్యాంగులకు రూ.6 వేలు పించన్ ఇస్తున్నామన్నారు. ట్రాన్స్ జెండర్స్ కి ఫించన్లతో పాటు గుర్తింపు కార్డులు ,రేషన్ కార్డుల పంఫిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్ సమాజంలో ఎవరికీ తక్కువ కాదని ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు అందిపుచ్చుకుని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పిలుపునిచ్చారు. ఈ శిక్షణను ఉచితంగా అందిస్తున్న 21 సెంచరీ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సంస్థ ప్రతినిధులను మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి ఈ సందర్భంగా అభినంధనలు తెలియజేశారు.

# కొబ్బరి ధరలు పతనం

**ప్రభాతవార్త నరసాపురం** కొబ్బరి ధర కేవలం మూడు నాళ్ళు ముచ్చటగానే మిగిలిపోయింది. ఇంకా పెరగకపోయినా పరవాలేదు ఒక రూపాయి అటు ఇటు ఉంటే సరిపోతుందని ఎంతో ఆశపడ్డ రైతులకు కొబ్బరి ధర పూర్తిగా నిరాసేపరిచింది. మూడు నెలలు తిరగకుండానే దమాల్మంటూ పడిపోయింది. ఇంకా ఇంకా లాభాలు గడించవచ్చని ఎన్నో కలలు కన్నా కొబ్బరి వ్యాపారస్తులను పీచుపీచు చేసింది. ఉభయగోదావరి జిల్లాలలో కొబ్బరి వ్యాపారం ప్రతి నెల కోట్ల మీద జరుగుతుంది ఈ ఏడాది ఆరంభం నుండి అర్థ సంవత్సరం వరకు రైతు వద్ద పది నుండి 12 రూపాయలకు కొన్నారు. జూన్ తర్వాత ధరకు అసలు పగ్గాలే లేవు. కాయ 15 నుండి 20 రూపాయల వరకు పరుగులు పెట్టింది. పండగ సీజన్లో రైతు వద్ద 25 రూపాయలకు కొన్న రోజులు కూడా ఉన్నాయి. 1000 కాయ పడితే రైతు చేతికి 20000 వచ్చేవి. ఆ దెబ్బతో రైతుకున్న రుణాలు తలపోట్లు కూడా తీరాయి. కొబ్బరి చెట్లుకు పడి పడి దండాలు పెట్టారు. పది చెట్లు ఉంటే చాలు పండగే పండగ. ఇలాగే చాలాకాలం నడుస్తుందని అవసరమైతే పెరుగుతుందని వ్యాపారస్తులు చెబుతుంటే రైతులు నిజం అని నమ్మారు. అలాంటి ఆశలన్నీ ఒక్కసారిగా కూలిపోయాయి. రైతుకు కొబ్బరి చెట్టు వద్ద ఇప్పుడు కడుతున్న రేటు కేవలం ఏడు రూపాయలు మాత్రమే. కాస్త సైజు బాగుంటే మరో రూపాయి కడుతున్నారు. ధర ఎంతగా పతనం అయిపోతుందని రైతులు ఎవరూ ఊహించలేదు. రేటు కుప్ప కూలిపోవడం రైతులు కూడా తీవ్రంగా దిగాలు పడ్డారు.

# ప్రజల వైద్యుడు వై. రామసుబ్బయ్య కన్నుమూత

## అనంతలో ప్రభుత్వ మెడికల్ కాలేజ్ కోసం అవిశ్రాంత పోరాటం జరిపిన నేత



డాక్టర్ రామ సుబ్బయ్య ఫైల్ ఫోటో

**అనంతపురం, డిసెంబర్ 18, (ప్రభాతవార్త బ్యూరో)** ఆయనకు కోపం అంటే తెలియదు. ఎప్పుడూ నవ్వుతూ రోగులు ప్రేమతో పలకరిస్తూ సేవలను అందిస్తూ వచ్చారు. పదవీ విరమణ పొందిన తర్వాత కూడా ఉచితంగా, తక్కువ ఫీజులతో వైద్య సేవలు అందించి ప్రజల డాక్టర్ గా గుర్తింపు పొందిన రిటైర్డ్ అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ వై రామసుబ్బయ్య (91) ఇక లేరు.. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. డాక్టర్ రామసుబ్బయ్య మృతదేహానికి శుక్రవారం మధ్యాహ్నం అనంతపురంలోని గుత్తి రోడ్ లో గల హరిచంద్ర ఘాట్ లో అంత్యక్రియలు నిర్వహించినట్లు డాక్టర్ రామసుబ్బయ్య కుమారుడు డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ శశాంక్ ఇతర కుటుంబ సభ్యులు నిర్ణయించారు. డాక్టర్ రామసుబ్బయ్య మృతిపై రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, టిడిపి జిల్లా అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి, సిపిఐ జాతీయ కార్యదర్శి కే రామకృష్ణ,వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, వైసీపీ నేత కె.వి రమణ తదితరులు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మాజీ సైనికులు ప్రత్యేకంగా డాక్టర్ రామసుబ్బయ్య మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతపురంలో మెడికల్ కాలేజీ కోసం పట్టు వీడని విక్రమార్కునిలా ప్రయత్నించారు. అనంతపురంలో ప్రైవేట్ రంగంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని గతంలో పాలకులు ప్రయత్నించినప్పుడు ప్రభుత్వ రంగంలో కాలేజీ ఏర్పాటు చేయాలని వివిధ రూపాల్లో జరిగిన ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పరోక్షంగా డాక్టర్ రామసుబ్బయ్య కీలకంగా వ్యవహరించారు. అనంతపురం మెడికల్ కాలేజీ అంటేనే డాక్టర్ రామసుబ్బయ్య గుర్తుకొస్తారు. డాక్టర్ రామసుబ్బయ్య 1933 సంవత్సరం జులై ఒకటో తేదీన జన్మించారు. ఆరోజు వైద్యుల దినోత్సవం కావడం విశేషం. ఆరుగురు అన్నదమ్ముల్లో.. డాక్టర్ రామసుబ్బయ్య నాల్గవ సంతానం. వీరి సతీమణి వై సరస్వతమ్మ మూడు నెలల క్రితమే మరణించగా ఇప్పుడు డాక్టర్ రామసుబ్బయ్య గురువారం మన నుంచి దూరమయ్యారు. డాక్టర్స్ డే రోజున జన్మించిన ఆయన.. కాల మహిమో, యాదృచ్ఛికమో గానీ వైద్య వృత్తిని స్వీకరించారు. ఆ వృత్తిలో అంచలంచెలుగా రాణిస్తూ అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల స్థాపనకు అవిరళ కృషి చేశారు.

# క్విజ్ విజేత కడప, వక్తృత్వపు పోటీలో విజేత తిరుపతి సర్కిల్

## 21న తిరుపతిలో మంత్రి గొట్టిపాటిచే బహుమతుల ప్రదానం



**తిరుపతి రవాణ, డిసెంబర్ 18 ప్రభాతవార్త** ఇంధన పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా ఏపీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో కడప జిల్లా విద్యార్థులు, వక్తృత్వ పోటీల్లో తిరుపతి సర్కిల్ విద్యార్థి విజేతలుగా నిలిచారని ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ !! మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి వెల్లడించారు. ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ఇంధన పరిరక్షణ అంశంపై జిల్లా స్థాయిల్లో క్విజ్, వక్తృత్వపు పోటీలను నిర్వహించారు. జిల్లాల పరిధిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అయా జిల్లా కార్యాలయాల ద్వారా ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ ఆఫీస్ నుంచి బుధవారం సాయంత్రం ఫైనల్ రౌండ్ పోటీలను నిర్వహించారు. క్విజ్ పోటీల్లో కడప జిల్లా నుంచి జీవీవీ నాగిరెడ్డి (10వ తరగతి, ఏపీ మోడల్ స్కూల్, ఖాజీపేట), ఇ. నాగ రిషిత (10వ తరగతి ఏపీ మోడల్ స్కూల్, ఖాజీపేట), వై. ప్రణీత్ రెడ్డి (9వ తరగతి, ఎస్పీ సీఎం మున్సిపల్ హై స్కూల్, రామేశ్వరం, ప్రొద్దుటూరు), వి. వైష్ణవి (9 వ తరగతి, వై వి ఎస్ మున్సిపల్ హై స్కూల్, ప్రొద్దుటూరు) బృందం విజేతగా నిలిచింది. ఇక ఎస్. అఫీఫా ఫిర్దౌజ్ (9వ తరగతి), ఎంసీ సాయికిరణ్ (9వ తరగతి), పి సమీరా భాను (9వ తరగతి), కె ప్రణీత సాయి శ్రీ యాదవ్ (8వ తరగతి), రవీంద్ర విద్యానికేతన్ కర్నూలు బృందం ద్వితీయ స్థానంలో నిలిచింది. అలాగే పి. ధాత్రి సాయి (9వ తరగతి) కే. మోక్షిత (9వ తరగతి, జిల్లా పరిషత్ హై స్కూల్, వరిగొండ), జి. రూపిక (9వ తరగతి) ఎస్కే సనీలా (9వ తరగతి, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల కావలి) బృందం తృతీయ స్థానంలో నిలిచింది. వక్తృత్వపు పోటీల్లో విజేతగా తిరుపతి సర్కిల్ఇంధన పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వక్తులతో పోటీల్లో తిరుపతి సర్కిల్ గూడూరులోని సిఎస్ ఎం ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జె. అద్రిజా రావు మొదటి స్థానంలో నిలువగా, చిత్తూరు జిల్లా పైపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కే. మనీషా ద్వితీయ స్థానాలు.



# సిఎం..డిసిఎం చిత్రపటాలకు పట్టుగూళ్లతో అభిషేకం

**రామకుప్పం,డిసెంబర్ 18 ప్రభాతవార్త** చిత్తూరు జిల్లా రామకుప్పంలోని వెలుగు కార్యాలయంలో గురువారం పట్టుసాగు రైతులు, ప్రజాప్రతినిధులు సిఎం చంద్రబాబునాయుడు,డిసిఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పట్టుగూళ్లతో అభిషేకం నిర్వహించారు.ప్రభుత్వ విప్‌డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర మ్‌న్ పిఎస్ మునిరత్నం,పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు మాట్లాడుతూ రాయలసీమలో అత్యధికంగా పట్టుగూళ్ల సాగు చేసే కుప్పం రైతులను ఆదుకునేందుకు గత ప్రభుత్వ పాలనలో బకాయిలు ఉన్న 1.74కోట్ల నిధులను సిఎం చంద్రబాబునాయుడు విడుదల చేశారన్నారు.హంద్రీ-నీవా జలాలతో కుప్పంను సస్యశ్యామల ం చేస్తున్నారన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించే ప ంటలపై రైతులు మక్కువ చూపాలన్నారు. పట్టుసాగు చేపట్టే రైతులకు అందిస్తున్న రాయితీలను వివరించారు.

# తిరుమలలో ఆలయం ముందు తమిళనాడు రాజకీయ బ్యానర్ ప్రదర్శన

## - చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించిన టిటిడి



**తిరుమల,డిసెంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచప్రఖ్యాతిగాంచిన హిందూ పుణ్యక్షేత్రం తిరుమలకొండపై కొందరు తమిళభక్తులు ప్రదర్శించిన రాజకీయనేతల బ్యానర్ వివాదాస్పదంగా మారింది. ఏకంగా దేవదేవుని ఆలయం ముందు గొల్లమండపం సమీపంలోనే తమిళనాడు భక్తులు ఈ బ్యానర్‌ను పట్టుకుని ప్రదర్శించడం మహా అపచారంగా భక్తులు భావిస్తున్నారు. అనూహ్యంగా జరిగిన పరిణామంతో తమిళనాడు భక్తులపై చట్టపరమైన చర్యలుంటాయని టిటిడి అధికారులు హెచ్చరిక చేశారు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి పవిత్రతను కాపాడటమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం చట్టం కూడా అమలుచేస్తోంది. పుణ్యక్షేత్రంలో గోవింద నామం తప్ప మరేలాంటి నినాదాలు,ఉచ్చరణలు వినిపించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పలు దఫాలు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ప్రస్తుత టిటిడి ధర్మకర్తలమండలి కూడా ఈ చట్టం కఠినంగా అమలుచేసేలా ఆలయం ముందు రాజకీయనాయకులుగానీ, ప్రజాప్రతినిధులుగానీ ఎటువంటి రాజకీయ వ్యాఖ్యలు చేయరాదని చట్టం తీసుకువచ్చారు.

రాజకీయాలకు సంబంధించిన ఎటువంటి ప్రదర్శనలు గానీ నిషేధం. దీని పర్యావసానంగా గత ఏడాదిగా తిరుమలలో రాజకీయ వ్యాఖ్యలు,విమర్శలు వినిపించడంలేదు. అలాంటిది తాజాగా గురువారం ఉదయం శ్రీవారి ఆలయం ముందు గొల్లమండపం సమీపంలో తమిళనాడులోని ఏఐఎడిఎంకె విద్యార్థి విభాగం నాయకులు పి.గజమురుగన్, ఎం.బాల పేర్లుతో తమిళనాడు మాజీ సిఎం పళనిస్వామి, దివంగత సిఎం జయలలిత "మధురై జిల్లా తిరుపరకున్రం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఆ పార్టీ మాజీమంత్రి ఫోటోలతో తమిళనాడులో 2026 ఎన్నికల్లో మాజీ సిఎం ఎడపాటి పళనిస్వామి ముఖ్యమంత్రి కావాలని, ఆయన నాయకత్వంలో పార్టీ అధికారంలోకి రావాలని బ్యానర్‌ను సినిమాటిక్ శైలిలో చూపించే రీల్స్‌ను సృష్టించారు. ఇదీ కాస్త సామాజికమాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఏకంగా ఆ పార్టీ విద్యార్థివిభాగం నాయకులు ఇబ్బందుల్లో పడ్డారు. ఏకంగా శ్రీవారి ఆలయం ముందు భారీ బ్యానర్ ప్రదర్శించడం ఆలయ భద్రత వైఫల్యాన్ని మరోసారి స్పష్టం చేసింది.

# పిల్లలను విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

## - అమ్మకానికి ఉన్న ఐదుగురు పిల్లలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న శిశువుతో సిపి రాజశేఖరబాబు

**విజయవాడ కార్పొరేషన్,డిసెంబరు 18,ప్రభాతవార్త** విజయవాడ పోలీస్ కమీషనర్ రాజశేఖరబాబుకు రాబడిన పక్కా సమాచారం మేరకు అక్రమంగా పిల్లలను విక్రయిస్తున్న విజయవాడ,సితార సెంటర్ ప్రాంతానికి చెందిన బగళం సరోజినితో పాటు మరో నలుగురు మహిళలను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి విక్రయించడానికి సిద్ధంగా ఉంచిన ముగ్గురు పిల్లలను స్వాధీనం చేసుకుని,ఒక బాలుని విక్రయించగా వచ్చిన నాలుగు లక్షల రూపాయలను గతంలో స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ ్యంలో ఇందులోని నిందితులైన బలగం సరోజిని,షేక్ ఫరీనాలు జైలు నుండి బెయిలుపై విడుదలయ్యారు. వీరి కదలికలపై నిఘాను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం సిపి రాజశేఖరబాబుకు రాబడిన పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసిపి కె.లతాకుమారి,పశ్చిమ ఏసిపి ఎస్వి దుర్గారావు,నార్త్ ఏసిపి స్రవంత్‌రాయ్ ల అథ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ ,భవానీపురం,నున్న సిఐలు వారి సిబ్బందితో కలిసి ఏకకాలంలో దాడులు నిర్వహించారు. భవానీపురం కుమ్మరిపాలెం సెంటర్ సమీపంలో ఐదుగురిని,నున్న పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉడా కాలనీ ఏరియాలో ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించి వారి నుండి విక్రయించడానికి ఉంచి నలుగురు పిల్లలను రూ.3లక్షల30 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకొని వారిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేసులో ప్రధాన నిందితురాలైన సరోజిని ఇచ్చిన సమాచారంపై గురువారం ఉదయం టు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని మరో పాపను రక్షించారు. భవానీపురం పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో విజయవాడ సితార సెంటర్‌కు చెందిన బగళం సరోజిని,భవానీపురం,గొల్లపూడి ఏరియాకు చెందిన గరికముక్కు విజయలక్ష్మి,భవానీపురం, కుమ్మరిపాలెం ఏరియాకు చెందిన వాడవల్లి బ్లేస్సీ,తెలంగాణ,నాంపల్లి,ఘట్కేసర్ ప్రాంతానికి చెందిన ముక్తిపేట నందిని,గుంటూరు జిల్లా సత్తెనపల్లి గ్రామానికి చెందిన షేక్ బాబా వలిలను అరెస్ట్ చేశారు. నున్న పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో విజయవాడ,దుర్గాపురం ప్రాంతానికి చెందిన ఆమదాల మణి,విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన షేక్ ఫరీనా,విజయవాడ,కబేళా సెంటర్‌కు చెందిన ఐరి వంశీకిరణ్‌కుమార్,కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో నిందితులైన విజయవాడ గుణదల ఏరియాకు చెందిన శంక యోహాన్,అజిత్‌సింగ్‌నగర్,వాంబే కాలనీకి చెందిన శ్రీనివాసరావులను అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ సితార సెంటర్‌కు చెందిన బలగం సరోజిని సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో పిల్లలు లేని వారికి అక్రమంగా పిల్లలను విక్రయించడం వ్యాపారంగా ఎంచుకుంది. ఢిల్లీకి చెందిన కిరణ్ శర్మ అనే అమ్మాయిని,ముంబాయికి చెందిన కవిత,నూరి,సతీష్ అనే వారిని పరిచయం చేసుకుంది. వారు అక్కడి నుండి విజయవాడకు పిల్లలను తీసుకువచ్చి సరోజినికి లక్ష నుండి రెండు లక్షలకు విక్రయించేవారు. సరోజిని పిల్లలు లేని వారిని,సంతాన లేమితో భాధపడేవారిని లక్ష్యంగా చేసుకొని వారికి నాలుగు నుండి ఐదు లక్షల వరకు బేరం కుదుర్చుకుని పిల్లలను విక్రయించేది. సరోజిని నగరంలోని కొంత మందితో కలిసి ఒక ముఠాగా ఏర్పడి ఢిల్లీ,ముంబాయిల నుండి తీసుకువచ్చిన పిల్లలను విజయవాడ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇతరులకు విక్రయించేది.

సరోజినిపై గతంలో హైదరాబాద్ లోని మేడ్‌పల్లి,గోపాలపురంలో, విజయవాడ నున్న కేసులలో అక్రమంగా పిల్లలను విక్రయించిన కేసులో అరెస్ట్ చేశారు.

# ఎపిఇపిడిసిఎల్‌కు ప్రతిష్టాత్మక జాతీయ అవార్డు

## గిరిజన ఆవాసాలకు విద్యుత్ అందించినందుకు జాతీయ స్థాయి గుర్తింపు

**విశాఖపట్నం, డిసెంబర్ 18** వినియోగదారులకు మెరుగైన సేవలతో పాటు నిరంతర విద్యుత్ సరఫరాను అందిస్తూ విశేష కృషి చేస్తున్న ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)కు ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి అవార్డు లభించింది. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ) ఆధ్వర్యంలో"ఎంపవరింగ్ గ్రోత్, ప్రిజర్వింగ్ రూట్స్ - ది పీఆర్ విజన్ ఫర్ 2047" అనే నినాదంతో ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన 47వ అఖిల భారత పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్ - 2025లో ఏపీఈపీడీసీఎల్ ప్రతిష్టాత్మక 'భారతరత్న శ్రీ అటల్ బిహారీ వాజపేయి జాతీయ అవార్డు' ను సాధించిందని సంస్థ చైర్మన్ !! మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్ తెలిపారు. ఈ అవార్డులను ఉత్తరాఖండ్ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి, రాష్ట్ర స్పీకర్ శ్రీమతి రీతూ ఖండూరీ భూషణ్, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ రమేష్ పోక్రియల్ 'నిశాంక్', పర్యావరణ !! అటవీశాఖ మంత్రి శ్రీ శుభోద్ ఉనియల్, పీఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అజిత్ పాఠక్ ల సమక్షంలో ప్రదానం చేశారు. పీఆర్ఎస్ఐ ఆధ్వర్యంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో, ఏపీఈపీడీసీఎల్ తరఫున అందుకున్న ఈ జాతీయ అవార్డును సంస్థ చైర్మన్ !! మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్ కు పీఆర్ఓ జి.ఎస్.ఎస్.ఎస్.వాసు అందజేశారు. ఈ సందర్భంగా సీఎండీ పృథ్వీతేజ్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖల సహకారంతో ఈపీడీసీఎల్ లో పలు రకాల పథకాల్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ సదుపాయం లేని పీవీటీజీ గిరిజన అవాసాలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ గిరిజన న్యాయ మహా అభియాన్ కార్యక్రమం ద్వారా, విద్యుత్ నెట్వర్క్, రహదారులు, రవాణా సదుపాయాలు లేని మారుమూల గిరిజన ప్రాంతాలకు అవసరమైన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లు తదితర సామగ్రిని తరలించి, సుమారు 23 వేల గిరిజన కుటుంబాలకు ఉచితంగా విద్యుత్ సదుపాయం కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యుత్ శాఖ సిబ్బంది కృషికి ఆయన అభినందనలు తెలిపారు.

# రాష్ట్ర భవిష్యత్ నిర్మాణానికి కలెక్టర్ల సదస్సు ఉపయుక్తం

## - స్వర్ణాంధ్ర 2047-10 సూత్రాలపై విస్తృత చర్చ - ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థుల విద్య, ఆరోగ్య రక్షణకు అధిక ప్రాధాన్యత: మంత్రి కొలుసు పార్థసారథి

**విజయవాడ, డిసెంబరు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకోవడం అభినందనీయమని మంత్రి కొలుసు పార్థసారథి హర్షం వ్యక్తం చేశారు. ఏపీ సచివాలయంలోని ప్రచార విభాగంలో మంత్రి పార్థసారథి రెండు రోజుల పాటు నిర్వహించిన 5వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ విశేషాలను గురువారం మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవస్థలన్నీ నిర్వీర్యమైన స్థితిలో అధికారం చేపట్టిన దార్శనీకుడు చంద్రబాబు నాయుడు కేవలం 18 నెలల వ్యవధిలోనే రాష్ట్రంలో వ్యవస్థలన్నింటినీ పట్టాలెక్కించారన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించి, ఆర్థికంగా బలోపేతం చేసి 11 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను తీసుకువచ్చారని పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తుకు దిక్సూచిగా రెండు రోజుల కలెక్టర్ల సమావేశం జరిగిందని, కలెక్టర్ల మధ్య అబివృద్ధి, సంక్షేమంలో పోటీ తత్వాన్ని పెంపొందించేలా చర్చలు జరిగాయని మంత్రి పార్థసారథి వివరించారు. ప్రజలకు వేగంగా సుపరిపాలన అందించేలా, పలు సమస్యల పరిష్కారం దిశగా సమావేశం జరిగిందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ గా కలెక్టర్ ప్రారంభించిన ముస్తాబు కార్యక్రమాన్ని అన్ని జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేయాలని సీఎం ఆదేశించారన్నారు. ఎస్సీ, ఎస్టీ ,బీసీ మైనార్టీ విద్యార్థుల విద్య, ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. వారి భవిష్యత్తు కోసం ప్రత్యేకంగా ఐఐటీ, నీట్ తదితర పోటీ పరీక్షలకు శిక్షణ తరగతులు నిర్వహించాలని సీఎం ఆదేశించారని తెలిపారు. పీజీఆర్ ఎస్ లో లక్షల సంఖ్యలో సమస్యలు ప్రభుత్వం దృష్టికి వస్తున్నాయని, ఆ సమస్యల పరిష్కారానికి లాజికల్ పద్ధతిలో పరిష్కరించాలని, ఆర్థికేతర సమస్యలన్నింటినీ వీలైనంత త్వరలో పరిష్కరించాలని సీఎం ఆదేశించారని తెలిపారు. నిర్దిష్ట కాల పరిమితి లో రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని, రీసర్వే, 22 ఎ, పాస్ పుస్తకాల జారీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారని మంత్రి తెలిపారు.

# చిరుధాన్యాల వివిధ అంశాలపై లఘు చిత్రం

## - అనంత సుస్థిర వ్యవసాయ వేదిక కన్వీనర్ వై.వి.మల్లారెడ్డి

**అనంతపురం బ్యూరో, డిసెంబరు 18 ప్రభాతవార్త** అనంత సుస్థిర వ్యవసాయ వేదిక ఆధ్వర్యంలో చిరుధాన్యాల యొక్క వివిధ అంశాలపై 60 సెక్షన్ల లఘు చిత్రం (షార్ట్ ఫిల్మ్) రీల్ తయారీ పోటీ లను నిర్వహించడం జరుగుతోందని ఆసక్తిగలవారు పాల్గొనాలని వేదిక కన్వీనర్ వై.వి.మల్లారెడ్డి కోరారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వై.వి.మల్లారెడ్డి మాట్లాడుతూ చిరుధాన్యా లను పెంచడం, చిరుధాన్యాల విలువ జోడింపు, చిరుధాన్యాల యొక్క పంట/వంటకాలు, చిరుధాన్యాల వినియోగం-ఆరోగ్య ప్రయోజనాలు, చిరుధా న్యాల యొక్క వినూత్న మార్కెటింగ్ అంశాల్లో ఏదో ఒక అంశంపై లఘు చిత్రం రీల్ తయారు చేయాల్సి ఉంటుందన్నారు. రీల్స్‌ను తెలుగు, హిందీ, ఇంగ్లీషులో తయారు చేయవచ్చన్నారు. అన్ని వయసుల వారు పాల్గొన వచ్చని, అయితే ప్రతి వ్యక్తి ఏదైనా ఒక భాషలో, ఒక అంశంమీద మాత్రమే సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఆడియో, వీడియో ఫైల్ ఎంపీ4 ఫార్మెట్ లో ఉండాలన్నారు. ఈ ఎంట్రీ లను, ఫైళ్లను ఈనెల 22వ తేదీ మధ్యాన్నం 12 గంటలులోగా సమర్పించాల్సి ఉంటుందన్నారు. ప్రతి కేటగిరిలో మోదటి రెండు ఎంట్రీలకు 2026 జనవరి రెండవ వారంలో అనంతపురంలో జరిగే మిల్లెట్ మేళా యొక్క మూడవ ఎడిషన్‌లో ప్రశంసా పత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. అన్ని రీల్స్, షార్ట్ ఫిల్మ్‌లను మూడు రోజుల పాటు వేదికవద్ద ప్రదర్శించి సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తామని వై.వి.మల్లారెడ్డి వివరించారు. మీ వీడియోలను ఏదైనా సమాచారం కొరకు 7981391575 ఫోన్ నంబరును సంప్రదించాలన్నారు.

# నితీష్ కుమార్ రాజీనామా చేయాలి : వైసీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి మొహమ్మద్ మగ్దూమ్ మొహిద్దీన్

**గూడూరు, డిసెంబర్ 18, ప్రభాతవార్త** బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఇటీవల ఆయన చేస్తున్నటువంటి వింత చేష్టలు అందరికీ విస్మయాన్ని కలిగిస్తున్నాయి. 5 సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన అపార అనుభవం వున్న ముఖ్యమంత్రి నితీష్ కుమార్ మానసిక స్థితి సరిగా లేనందు వల్లే వివాదాస్పద పనులు చేస్తున్నారని వైసీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి మొహమ్మద్ మగ్దూమ్ మొహిద్దీన్ పేర్కొన్నారు.

ఇటీవల నూతనంగా ఎంపికైన డాక్టర్లకు నియామక పత్రాలను అందజేసే సమ్వాద్ కార్యక్రమంలో ఆ వేదిక మీద రాజకీయ ప్రతినిధులు, వేదిక ముందు మీడియా, ప్రజలు, మరి ఆ డాక్టర్లకు సంబంధించినటువంటి కుటుంబ సభ్యులు కూడా ఉన్నారన్నారు.

# తోటి విద్యార్థి పెట్టే ఇబ్బందులు తాళలేక విద్యార్థిని ఆత్మహత్య

**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 18, ప్రభాతవార్త:** తోటి విద్యార్థి చేసే ఇబ్బందులు తాళలేక ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిన్న బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. ఫత్తేఖాన్‌పేటలో ఎన్ తిరుపాల్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయనకు భార్య స్వాతి, కుమారుడు నాగచైతన్య, కుమార్తె లావణ్య (15)లు ఉన్నారు. లావణ్య సమీపంలోని ప్రియాంక ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో పదోతరగతి చదువుతోంది. సుమారు నాలుగు నెలల కిందట అదే స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బాలుడు ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఐలవ్‌యూ అంటూ సందేశం పంపారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు స్కూల్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. యాజమాన్యం పెద్దగా పట్టించుకోలేదు. ఈ క్రమంలోనే పదిహేను రోజుల కిందట బాలిక స్కూల్‌లో బ్లేడ్‌తో ఆత్మహత్యాయత్నం చేసుకుంది. మరోసారి కుటుంబ సభ్యులు స్కూల్ యాజమాన్యంను నిలదీయగా వారు బాలుడికి సపోర్టుగా మాట్లాడారు. ఈ క్రమంలో గురువారం బాలిక స్కూల్‌కు వెళ్లింది. అనంతరం ఏం జరిగిందో ఏమో తెలియదుకాని ఆమె ఇంటికి వెళ్లి చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పనులకు వెళ్లిన కుటుంబసభ్యులు ఈవిషయం తెలుసుకుని, హుటాహుటిన ఇంటికి చేరుకుని బాలికను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

# భారీగా పట్టుబడిన గంజాయి

**ఉమ్మడి తూర్పుగోదావరి బ్యూరో, డిసెంబర్18,ప్రభాతవార్త** తూర్పుగోదావరి జిల్లా గోకవరంలో గంజాయి భారీగా పట్టుబడింది. గోకవరం మండలం కామరాజు పేట గ్రామ శివారులో 22 బస్తాలలో సుమారు 405 కేజీల గంజాయిని గోకవరం పోలీసులు సీజ్ చేసారు. మహీంద్రా మ్యాక్సీ పిక్అప్ వ్యాన్‌లో గంజాయి తరలిస్తుండగా దాడి చేసి పోలీసులు పట్టుకున్నారు పోలీసుల రాకను గమనించి వ్యాన్ వదిలి ఇద్దరు నిందితులుపరారయ్యారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ. 2 కోట్ల 2 లక్షల 50 వేల రూపాయలు ఉంటుందని అంచనా వేస్తున్నారు.ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గోకవరం ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు .

# ఎసిబికి పట్టుబడ్డ బిసి వెల్ఫేర్ డిడి

**ఉమ్మడి తూర్పుగోదావరి బ్యూరో, డిసెంబర్18,ప్రభాతవార్త** జిల్లా కేంద్రం కాకినాడ లో జిల్లా బిసి సంక్షేమ శాఖ కార్యాలయంలో ఏసిబి అధికారుల అకస్మిక దాడిచేశారు.ఈ దాడిలో రూ. 40 వేలు లంచం తీసుకుంటూ డిప్యూటీ డైరెక్టర్ లల్లి, సీనియర్ అసిస్టెంట్ కారెపు సూర్యశివప్రసాద్ లు ఏసిబి అధికారులకు చిక్కారు.

కారుణ్య నియామకం,పెన్షన్ సెటిల్మెంట్ విషయం లో కాట్రేనికోన మం. అడవిపేట కు చెందిన గెద్దాడ చక్రవర్తి నుంచి రూ40 వేలు డిమాండ్ చేయగా ఏసీబీ అధికారులను చక్రవర్తి ఆశ్రయించారు.మాజీ ఉద్యోగి యాదల సత్యనారాయణ ను మధ్యవర్తి గా డిడి లల్లి లంచావతారం ఎత్తారు.

చక్రవర్తి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగి లంచం తీసుకుంటుండగా ఏసిబి డిఎస్పీ కిషోర్ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.ముగ్గురిని అదుపులోకి తీసుకుని ఏసిబి అధికారులు రిమాండ్ కి తరలించారు.

# లోకాయుక్త కర్నూలులోనే.. మానవహక్కుల కార్యాలయం కూడా అక్కడే

## హైకోర్టుకు వివరించిన రాష్ట్ర ప్రభుత్వం

**విజయవాడ,డిసెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** లోకాయుక్త, ఏపీ మానవ హక్కుల సంఘం కార్యాలయాలను కర్నూలులోనే కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి హైకోర్టుకు నివేదించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్త ఏర్పాటు వ్యవహారం ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, పాలసీ నిర్ణయాల్లో తాము జోక్యం చేసుకునేందుకు కొన్ని పరిమితులు ఉంటాయని అని వ్యాఖ్యానించింది. లోకాయుక్త, హెచ్‌ఆర్‌సీ తరలింపు వ్యవహారంపై 2021లో ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్ ప్రతి కోర్టు రికార్డుల్లోకి చేరలేదు. దీంతో విచారణ వాయిదా పడింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది.

రాష్ట్ర విభజన చట్ట నిబంధనలకు విరుద్ధంగా లోకాయుక్త, హెచ్‌ఆర్‌సీ కార్యాలయాలను కర్నూలులో ఏర్పాటు చేయడాన్ని సవాలు చేస్తూ డాక్టర్ మద్దిపాటి శైలజ 2021లో హైకోర్టులో పిల్ వేసిన సంగతి తెలియందే. ఇదే అంశంపై ఏపీ సివిల్ లిబర్టీస్ అసోసియేషన్ (తిశిదిలితి) సంయుక్త కార్యదర్శి ఏకేఎన్ మల్లేశ్వరరావు అప్పట్లో పిల్ దాఖలు చేశారు.

ఈ వ్యాజ్యాలు తాజాగా హైకోర్టులో విచారణకు వచ్చాయి. పిటిషనర్ల తరఫు న్యాయవాది డీఎస్ఎన్‌వీ ప్రసాదబాబు వాదనలు వినిపించారు. హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్త కార్యాలయాలను హైదరాబాద్ నుంచి నేరుగా విజయవాడకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు కూడా చేశారన్నారు. అందుకోసం రూ.కోట్లలో ఖర్చు చేశారని ఆయన తెలిపారు. ఆ ప్రయత్నాన్ని విరమించుకుని, కర్నూలులో ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. శ్రీకాకుళం నుంచి కర్నూలుకు వెళ్లాలంటే శ్రమతో కూడుకొన్న విషయం అని అందువల్ల న్యాయస్థానాలు, ట్రైబ్యునళ్లు, న్యాయ సంబంధ సంస్థలు అన్నీ రాజధాని అమరావతిలోని జస్టిస్ సిటీలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వాదించారు. మరోవైపు కర్నూలులో లోకాయుక్త, మానవ హక్కుల సంఘం కార్యాలయాల ఏర్పాటు వ్యవహారం తామిచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటామని గతంలో హైకోర్టు స్పష్టం చేసింది. కర్నూలులో ఆ కార్యాలయాలు ఏర్పాటు చేయాలనే ప్రభుత్వం నిర్ణయం అంతిమం కాదని వ్యాఖ్యానించింది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సవాలు చేస్తూ డాక్టర్ మద్దిపాటి శైలజ హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది డీఎస్ఎన్వీ ప్రసాదబాబు కూడా తన వాదనలు వినిపించారు. కర్నూలులో లోకాయుక్త , ఏపీ హెచ్ ఆర్సీ ఏర్పాటు చేయడం ఏపీ విభజన చట్ట నిబంధనలకు విరుద్ధమని పిటిషనర్ తరపున వాదించారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం హయాంలో పాలన వికేంద్రీకరణ, సీఆర్డీఏ రద్దు చట్టాలను తీసుకురావడం వల్ల ఆ చట్టాలపై హైకోర్టు స్టేటస్ కో ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో కర్నూలులో లోకాయుక్త, హెచ్ సీ ఏర్పాటు సరికాదని తెలిపారు. ప్రభుత్వం తరఫున ఏజీ ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. కర్నూలులో ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని ఆయన అన్నారు. అక్కడ ఏర్పాటుకు సహేతుకమైన కారణాలు ఉన్నాయని వివరించారు. అమరావతి నుంచి కర్నూలుకు తరలించేందుకు నోటిఫికేషన్ కూడా ఇచ్చామన్నారు .

ఇప్పటికే లోకాయుక్త కర్నూలుకు వచ్చిందని ఆయన తెలిపారు. ఇరువైపు వాదనలు విన్న ధర్మాసనం కర్నూలులో ఏపీ లోకాయుక్త , రాష్ట్ర హెచ్ఆర్ సీ ఏర్పాటు అంశంపై మేము ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటుందని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది.

# రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ వైపు శరవేగంగా అడుగులు

## : ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

**విజయవాడ,డిసెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ వైపు శరవేగంగా అడుగులు పడుతున్నాయని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సిఎస్ కె.విజయానంద్ అన్నారు. జిల్లా కలెక్టర్ల సమావేశంలో కాస్ట్ ఆప్టిమైజేషన్ ఫ్యూయల్ మరియు ఎనర్జీ కి సంబంధించి ప్రెజెంటేషన్ ఇస్తూ. డీజిల్,పెట్రోల్ వంటి శిలాజ ఇంధనాల ధరలు తగ్గేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.రాష్ట్రంలో చేపట్టిన వివిధ ప్రాజెక్టులు పూర్తి చేస్తే వినియోగదారులకు సరసమైన ధరలకే వివిధ రకాల ఇంధనాలు అందుబాటులోకి తెచ్చేందుకు వీలు కలుగుతుందని తెలిపారు.

పియం కుసుమ్ పథకం గురించి సిఎస్ విజయానంద్ మాట్లాడుతూ వివిధ ప్రాజెక్టులు పూర్తయితే ఇంధన ధరలు తగ్గే వీలుందని చెప్పారు.రాష్ట్రం అన్ని విద్యుత్ వనరులు సౌర, గాలి మరియు పంప్డ్ హైడ్రో ఉపయోగించి గ్రీన్ ఎనర్జీకి మార్చడం, నెట్ జీరో ఎమిషన్స్ వైపు ముందుకు సాగడం, రైతులు, పరిశ్రమలు మరియు ఇళ్లకు సరసమైన, నమ్మదగిన విద్యుత్ సరఫరా చేయడం, స్మార్ట్/మైక్రో గ్రిడ్‌లు మరియు సోలార్ రూఫ్‌టాప్ కార్యక్రమాల ద్వారా స్థానిక స్థాయి శక్తి స్వయం సమృద్ధి సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు.

పీఎం కుసుమ్ స్కీమ్ కింద వ్యవసాయ ఫీడర్ సోలరైజేషన్ ద్వారా రాష్ట్రంలో రైతులకు రోజుకు 9 గంటల పగటి వేళ ఉచిత విద్యుత్ సరఫరా అందించడానికి 2,93,587 పంపుల లక్ష్యంతో 1,162.80 ఎండబ్ల్యూపీ సామర్థ్యానికి పనులు కేటాయించామన్నారు. రూఫ్‌టాప్ సోలార్ స్థాపనలో 20.5 లక్షల మంది ఎస్సీ/ఎస్టీ వినియోగదారులకు ఒక్కొక్కరికి సుమారు 2జూ యూనిట్ సైజ్‌తో 1,198.21 ఎండబ్ల్యూపీ కి పనులు కేటాయించామని, 27.59 లక్షల మంది బిసి వినియోగదారులకు సుమారు 2జూ యూనిట్ సైజ్‌తో సేకరణ ప్రక్రియ ప్రారంభమైందని వివరించారు.

ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన భవనాలైన పాఠశాలలు, కళాశాలు ఆసుపత్రులు, కార్యాలయాలకు సుమారు 150 లీజూ సాధ్యమైన సామర్థ్యంతో సేకరణ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. వయబులిటీ గ్యాప్ పెండింగ్ కింద ఇంట్రాస్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్‌కు అనుసంధానించిన 1.5 జీడబ్ల్యు / బిడబ్లుహెచ్ బీస్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమాల అమలు వల్ల, వచ్చే 3సంవత్సరాల్లో విద్యుత్ కొనుగోలు ఖర్చులో సుమారు రూ.957 నుంచి రూ.2,368 కోట్ల పొదుపు సాధించబడుతుంది. ఇది 26 ఆర్థిక సంవత్సరం ధరల స్థాయిలో మూడు ఆర్థిక సంవత్సరాల్లో విస్తరించి సుమారు రూ..4,635 కోట్ల టారిఫ్‌లలో సంభావ్య తగ్గింపుకు దారి తీస్తుంది. విద్యుత్ కొనుగోలు ఖర్చు 26 ఆర్థిక సం.లో 4.80 రూపాయలు/యూనిట్ నుంచి నీ29 నాటికి 3.99 రూపాయలు/యూనిట్‌కు తగ్గుతుంది. జిల్లా కలెక్టర్లు ఎస్సీ,ఎస్టీ,బీసీ వినియోగదారులతో సహా అన్ని వినియోగదారుల కోసం రూఫ్‌టాప్ సోలార్ సంస్థాపనలను సమీక్షించాలని, పర్యవేక్షించాలని, పీఎం కుసుమ్ అమలు కోసం భూమి కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని, బీసీస్ సకాలంలో అమలు చేయడాన్ని నిర్ధారించాలని కోరారు.

# యజమానులకు ఇపిఎఫ్ఓ శుభవార్త

## ఉద్యోగుల నమోదుకు ఇఇఎస్2025 పేరుతో ప్రత్యేక పథకం

### ఆరు నెలలపాటు యజమానులకు అవకాశం

**ముంబై, డిసెంబరు 18:** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్ఓ) తాజాగా సంస్థల యజమానులకు ఒక కీలకమైన అవకాశాన్ని కల్పించింది. గతంలో వివిధ కారణాల వల్ల తమ ఉద్యోగులను ప్రావిడెంట్ ఫండ్ (పిఎఫ్) పరిధిలోకి తీసుకురాలేని సంస్థల కోసం 'ఎంప్లాయీస్ ఎన్‌రోల్‌మెంట్ స్కీమ్ (ఇఇఎస్)2025' పేరుతో ఒక ప్రత్యేక పథకాన్ని గురువారం ప్రకటించింది. దీని కింద అర్హులైన ఉద్యోగులను స్వచ్ఛందంగా పిఎఫ్ ఖాతాలో నమోదు చేయడానికి యజమానులకు ఆరు నెలల సమయం ఇచ్చింది.ఈ పథకం 2025 నవంబర్ నుంచి ఆరు నెలల పాటు అమల్లో ఉంటుంది. 2017 జూలై 1 నుంచి 2025 అక్టోబర్ 31 మధ్య కాలంలో పీఎఫ్ పరిధిలోకి రాని ఉద్యోగులకు ఈ పథకం వర్తిస్తుంది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని పాత బకాయిలను సులభంగా చెల్లించవచ్చని ఇపిఎఫ్ఓ సూచించింది. ఈ పథకం కింద యజమానులకు భారీ ఊరట కల్పించారు. గతంలో ఉద్యోగి వాటాను జీతం నుంచి మినహాయించని పక్షంలో, యజమాని కేవలం తన వాటా, వర్తించే వడ్డీ, పరిపాలనా ఛార్జీలతో పాటు నామమాత్రంగా రూ.100 జరిమానా చెల్లిస్తే సరిపోతుంది.

ఇప్పటికే విచారణ ఎదుర్కొంటున్న సంస్థలు కూడా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని ఇపిఎఫ్ఓ స్పష్టం చేసింది. 'అందరికీ సామాజిక భద్రత' అనే జాతీయ లక్ష్యాన్ని సాధించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ పథకంపై యజమానుల్లో అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపింది. అలాగే ఎస్ఎంఎస్, ఈమెయిల్స్ ద్వారా సమాచారం అందిస్తామని వివరించింది.

# వ్యవసాయ ఉద్యోగులకు ఫేషియల్ రికగ్నిషన్ యాప్

## వ్యవసాయ కార్యదర్శి సురేంద్ర ఉత్తర్వులు

**హైదరాబాద్, డిసెంబరు 18, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని వ్యవసాయ, దాని అనుబంధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సమయ పాలన నిమిత్తం ప్రత్యేక యాప్‌ను ప్రభుత్వం తీసుకొచ్చింది. వ్యవసాయ, అనుబంధ శాఖలు, కార్పొరేషన్ల కార్యాలయాల్లో రాష్ట్ర స్థాయి నుండి డివిజన్ వరకూ సంబంధిత కార్యాలయాల్లో ఉద్యోగుల హాజరుపై నిరక్ష్యం లేకుండా ఉండేలా పనిచేస్తున్న ఉద్యోగుల హాజరుపై నిరక్ష్యం తావులేకుండా బయో మెట్రిక్, ఫేషియల్ రికగ్నిషన్ యాప్ ఏర్పాటు చేసింది.

ఈ మేరకు దీనికి సంబంధించి గురువారం వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్ ఉత్తర్వులు విడుదల చేశారు. దీన్ని విధిగా ఉద్యోగులందరూ అమలు చేసేలా చూడాలని వ్యవసాయ, అనుబంధ కార్పొరేషన్ల అధికారులకు స్పష్టం చేశారు.

ఇందుకు బయో మెట్రిక్ ఫేషియల్ రికగ్నిషన్ యాప్ ప్రత్యేకించి ఏర్పాటు చేయాలని సంబంధిత విభాగాల హెచ్ఓడీ లకు ఆదేశాలు జారీ చేశారు. విధులకు ఆలస్యంగా హాజరయ్యే ఉద్యోగుల పట్ల తీసుకున్న యాక్షన్ టేకెన్ రిపోర్టులు అందించాల్సిందిగా స్పష్టం చేశారు. ఇందుకు ఐటీ శాఖ ఆధ్వర్యంలో డాష్ బోర్డు ఏర్పాటు చేయాల్సిందిగా సూచించారు. ఉద్యోగుల హాజరుపై ఆన్ లైన్ లో సమాచారం ఉండే విధంగా డాష్ బోర్డు పనిచేయాలని ఐటీ డిపార్ట్ మెంట్ వారికి పనులు అప్పగించారు. కొద్ది రోజుల్లో వ్యవసాయ, అనుబంధ కార్పొరేషన్ల.

# విబిజిరామ్‌జి-2025 బిల్లును వ్యతిరేకిస్తూ సిపిఎం నిరసన



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్ (చిక్కడపల్లి) డిసెంబరు 18, ప్రభాతవార్త :** కేంద్రం ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని పథకంగా మార్చి నిర్వీర్యం చేసే కుట్రను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ పేరుతో ఉన్న నరేగా పేరును వీబీజీరామ్‌జీ గా మార్చడాన్ని తప్పుబట్టారు. ఇలా చేయడం అంటే గాంధీని అవమానపర్చడమేనన్నారు. దాన్ని యథావిధిగా చట్ట రూపంలోనే ఉంచి నిధులను పెంచాలనీ, పేరును మార్చొద్దని డిమాండ్ చేశారు. ఆ చట్టం పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలు చేస్తామని ప్రకటించారు. ఆ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం ఆర్టీసీ క్రాస్ రోడ్డులో సీపీఎం ఆధ్వర్యంలో వీబీజీరామ్‌జీ2025 బిల్లును వ్యతిరేకిస్తూ నిరసన కార్యకమం చేశారు. ఆ బిల్లు ప్రతులను దహనం చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలి.... వీబీజీరామ్‌జీ బిల్లును వెనక్కి తీసుకోవాలి...మోడీ సర్కారు ప్రజావ్యతిరేక విధానాలను విడనాడాలి.. అని నినదించారు.

ఈకార్యకమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.సాగర్, రాష్ట్ర నా యకులు వెంక్రటాములు, భూపాల్, బి.ప్రసాద్, ఆశయ్య, శ్రీరామ్ నాయక్, ఉడుత రవీందర్, ఎం.శ్రీనివాస్, బాబూరావు, కోట రమేశ్, విజయ్, పద్మ, ప్రజాసంఘాల నాయకులు, నగర కార్యదర్శి వెంకటేష్ తదితర నాయకులు పాల్గొన్నారు. నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి జాన్ వెస్లీ మాట్లాడారు. బీజేపీ నేతృ త్వంలోని ఎన్‌డిఎ ప్రభు త్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో వికసిత్ భారత్ – రోజ్ గార్, ఆజీవికా మిషన్ (గ్రామీణ్) బిల్లు 2025 (వీబీగ్రామ్‌జీ బిల్లు)ను తీసుకురావాలనే దుర్మా ర్గపు చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపు నిచ్చారు. మహాత్మా గాంధీ పేరును తొలగించి, దాని స్థానంలో జీరామ్‌జీ అనే సంక్షిప్త నామాన్ని తీసుకురావడాన్ని వ్యతిరేకించారు. మోసపూరిత బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక వనరులను దెబ్బతీస్తూ 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వాలే భరించాలని కేంద్రం ముసాయిదా బిల్లులో పెట్టడం దుర్మార్గమన్నారు.

# భూ వివాదాల్లో రాజకీయ నాయకుల ప్రమేయంపై చర్యలు తీసుకోండి

## : సిఎంతో డిసిఎం పవన్ కల్యాణ్


సిఎం చంద్రబాబును అభినందిస్తున్న డిసిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,డిసెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖ, ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పారిశ్రామిక ప్రాంతాల్లో కొన్ని భూ వివాదాల్లో రాజకీయ నాయకుల ప్రమేయంపై ఫిర్యాదులు వచ్చాయని,వాటిపై ఎటువంటి ఉపేక్ష లేకుండా చర్యలు తీసుకోవాలని ఏపీ ఉప ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. విశాఖ జోన్ లో ఇలాంటివి ఎక్కువగా జరుగుతున్నాయి. జిల్లా కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హోంశాఖపై చర్చ సందర్భంలో ఈ విషయాన్ని ప్రస్తావించారు.ఏరాజకీయ నాయకుల ప్రమేయం వల్ల అధికారులు కూడా ఏమీ మాట్లాడలేకపోతున్నారు.

భూ వివాదాల్లో రాజకీయ నాయకుల జోక్యాన్ని ఎంత మాత్రమూ సహించొద్దని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలకు ఆదేశించిన చంద్రబాబు నాయుడు.విశాఖ, విజయనగరం, అనకాపల్లి తదితర జిల్లాల్లో రాజకీయ నాయకుల జోక్యంపై ఫిర్యాదులు రాకూడదని, ఎవరి మీద ఫిర్యాదు వచ్చినా వదిలిపెట్టవద్దని ముఖ్యమంత్రి ఆదేశం.

సౌండ్ పొల్యూషన్ పై ఈ సమావేశంలోనే సౌండ్ పొల్యూషన్ గురించి పవన్ కళ్యాణ్ ప్రస్తావించారు

మతం పేరుతో విపరీతమైన సౌండ్ పెట్టి కార్యక్రమాలు, వేడుకలు, ప్రార్థనలు చేయడం తప్పు.

ఎక్కడైనా కేవలం చట్టం మరియు సుప్రీంకోర్టు ఆదేశం మాత్రమే అమలులో ఉంటాయి. నిర్దేశించిన డెసిబుల్స్ లోనే సౌండ్ ఉండాలి. ఇందుకు సంబంధించి ఉన్న సుప్రీం కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలి. ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'ది ఎకనామిక్ టైమ్స్' అందించే ప్రతిష్ఠాత్మక 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్' పురస్కారం ఏపీ సీఎం చంద్రబాబుకు లభించడం పట్ల డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. చంద్రబాబును ఒక దార్శనిక నేతగా పవన్ కల్యాణ్ అభివర్ణించారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, ఐటీ, గ్రీన్ ఎనర్జీ రంగాలను ప్రోత్సహించడం, పాలనలో సంస్కరణలు తీసుకురావడంలో ఆయన చూపిన చొరవ, కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆయన చేపట్టిన కార్యక్రమాలు ఖిస్వర్ణాంధ్ర 2047ఖి లక్ష్య సాధనకు మార్గం సుగమం చేస్తున్నాయని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రం, దేశం అభివృద్ధి పథంలో పయనించేందుకు చంద్రబాబు చేస్తున్న కృషికి మరింత శక్తి చేకూరాలని ఆకాంక్షిస్తున్నట్లు పవన్ కల్యాణ్ తన సందేశంలో తెలిపారు. ఆయన మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు.

# పిఎంఎవై గ్రామీణ్‌కు 10 లక్షల మంది దరఖాస్తు

## - గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్

**విజయవాడ,డిసెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) గ్రామీణ్‌కు రాష్ట్ర వ్యాప్తంగా 10.42 లక్షల మంది ధరఖాస్తు చేసుకున్నారని గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ తెలిపారు. వీటిని కేంద్ర ప్రభుత్వం వచ్చే ఫిబ్రవరిలో మంజూరు చేసే అవకాశముందని పేర్కొన్నారు. 2029 నాటికి అర్హులైన ప్రతి ఒక్కరికీ స్థలం,సొంతిల్లు ఉండాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సచివలయంలో సిఎం చంద్రబాబు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో అజయ్ జైన్ గృహ నిర్మాణ శాఖపై ప్రెజెంటేషన్ ఇచ్చారు.'కూటమి అధికారం లోకి వచ్చిన తర్వాత 3.10 లక్షల గృహాల్ని పూర్తి చేసి,లబ్ధిదారులకు అందించాం. మరో 5.68 లక్షల ఇళ్ళ నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి. చిత్తూరు,శ్రీకాకుళం,అనకాపల్లి,విజయనగరం,పశ్చిమగోదావరి జిల్లాల్లో ఇళ్ళ నిర్మాణ పురోగతి బాగుంది. అల్లూరి సీతారామరాజు,ఎన్టీఆర్,గుంటూరు,బాపట్ల,కృష్ణా జిల్లాల్లో ఇళ్ళ నిర్మాణ పురోగతి బాగుంది. అల్లూరి సీతారామరాజు,ఎన్టీఆర్,గుంటూరు,బాపట్ల,కృష్ణా జిల్లాల్లో ఇళ్ళ నిర్మాణ పురోగతి బాగుంది. అల్లూరి సీతారామరాజు,ఎన్టీఆర్,గుంటూరు,బాపట్ల,కృష్ణా జిల్లాల్లో కేటాయించిన గృహాల్లో 53 శాతం కంటే తక్కువ పురోగతి నమోదైంది. వచ్చే ఉగాది నాటికి మరో 5 లక్షల గృహాల్ని పూర్తి చేయాలని సిఎం లక్ష్యాన్ని నిర్ధేశించారు. జిల్లాల వారీగా పూర్తి చేయాల్సిన గృహాలకు సంబంధించి లక్ష్యాలు నిర్ధేశించాం. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి. గృహ నిర్మాణానికి సంబంధించి ఇంజనీరింగ్ అసిస్టెంట్ల పనితీరుపై ప్రజల్లో కొంత అసంతృప్తి ఉంది. దీనిపై కూడా దృష్టిపెట్టాలి'అని సూచించారు.

# రాష్ట్రంలో వచ్చే నెలలో పది హోటళ్ల నిర్మాణానికి ఒకేసారి శంఖుస్థాపన

## పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వెల్లడి

**విజయవాడ,డిసెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** పది హోటళ్ళ నిర్మాణానికి వచ్చే నెలలో ముఖ్యమంత్రి,మంత్రులు ఒకేసారి శంఖుస్థాపన చేయనున్నారు. 2024-29 పర్యాటక విధానంలో కొత్త హోటళ్ళ నిర్మాణం కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున అనుమతులిస్తోంది. ఈ విషయాన్ని రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ బుధవారం కలెక్టర్ల సమావేశంలో వెల్లడించారు. కొత్త విధానం ప్రకటించాక ఏడాది వ్యవధిలో 27 కొత్త హోటళ్ళకు అనుమతులు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఇందులో మూడు హోటళ్ళు ప్రారంభమైనట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చెప్పారు.

హోం స్టే విధానాన్ని ఇప్పటికే ప్రారంభించాం. ఇందుకు సంబంధించిన పోర్టల్ కూడా అందుబాటులో ఉంది. జిల్లాల్లో హోంస్టేల ఏర్పాటుకు ఎక్కువ మంది ముందుకు వచ్చేలా కలెక్టర్లు చొరవ తీసుకోవాలి..ఏడు పర్యాటక హబ్‌లు,25 సర్క్యూట్లు ఇప్పటికే ప్రకటించాం.తొలి దశలో కొండపల్లి,మంగళగిరి,కూచిపూడి,ఏటికొప్పాక తదితర ప్రాంతాల్లో ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు ప్రారంభించనున్నాం. ఎడ్వంచర్ టూరిజం,హౌస్ బోట్లకు కూడా అనుమతులు ఇస్తున్నాం..ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రభుత్వ,ప్రేవేట్ భాగస్వామ్యంలో హోటళ్ళ నిర్మాణం కోసం స్థలాలను కలెక్టర్లు గుర్తించాలి. రెవిన్యూ,ఆర్ అండ్ బీ,జలవనరులు,ఇతర ప్రభుత్వ శాఖల స్థలాలు సేకరించి సిద్దం చేయాలన్నారు.వీటి వివరాలు వెబ్‌సైట్‌లో పెట్టి హోటల్ నిర్మాణానికి ముందుకు వచ్చే అనుభవం గల సంస్థలకు కేటాయిస్తాం.తిరుపతి,విశాఖపట్నం,బాపట్ల,సూర్యలంకలో హోటళ్ళ నిర్మాణానికి పలు సంస్థలు ముందుకొస్తున్నాయి.బొర్రా గుహలు,సూర్యలంక,సింహాచలం,అన్నవరం,గండికోట,అఖండ గోదావరి,అహోబిలం వంటి ప్రాజెక్టుల పనులు కేంద్ర ప్రభుత్వ సాయంతో చేపడుతున్నాం. వచ్చే జూన్ నాటికి వీటిని పూర్తి చేయాలి. పనుల పురోగతిపై కలెక్టర్లు దృష్టి పెట్టాలి.జిల్లా పర్యాటక మండలి సమావేశాలు నిర్వహించాలి. ఈవెంట్ల నిర్వహణపై కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలి'అని పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ సూచించారు.

# విచారణలో నోరు విప్పిన ఐ బొమ్మ రవి

## శాటిలైట్ లింక్, క్యూబ్ నెట్‌వర్క్ హ్యాక్ చేసినట్లు వెల్లడి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, డిసెంబరు 18:** ఐ బొమ్మ వెబ్ సైట్ నిర్వాహకుడు రవి కేసు విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పోలీసుల విచారణలో అతడు సినిమా పైరసీకి పాల్పడిన విధానాన్ని వెల్లడించాడు. టెలిగ్రామ్ ఛానల్ ద్వారా కొత్త సినిమాల పైరసీ ప్రింట్లతో వ్యాపారం చేసినట్లు ఒప్పుకున్నాడు. గురువారం జరిగిన విచారణలో పైరసీకి సంబంధించిన కీలక వివరాలను రవి వెల్లడించాడు. కేవలం సాధారణ ప్రింట్లే కాకుండా, ఏకంగా క్యూబ్ నెట్‌వర్క్‌ను, శాటిలైట్ లింక్‌ను హ్యాక్ చేసి సినిమాలను హెచ్‌డీ ఫార్మాట్‌లో రికార్డు చేసినట్లు తెలిపాడు. ఈ విధంగా పైరసీ చేసిన సినిమాలను అమ్మేందుకు హెచ్‌డీ హబ్ పేరుతో ప్రత్యేకంగా ఒక టెలిగ్రామ్ ఛానల్ ఏర్పాటు చేసినట్లు చెప్పాడు. ఈ ఛానల్‌లో పైరసీ లింకులను అప్‌లోడ్ చేసి, ఒక్కో లింక్‌కు 100 నుంచి 300 డాలర్ల వరకు వసూలు చేసినట్లు స్పష్టం చేశాడు. ముఖ్యంగా హిట్3, కిష్కిందపురి సినిమాలను శాటిలైట్ లింక్ ద్వారానే పైరసీ చేసినట్లు అంగీకరించాడు. ఈ నేపథ్యంలో, మూడు వేర్వేరు కేసుల్లో విచారణ నిమిత్తం నాంపల్లి కోర్టు ఇమ్మడి రవికి 12 రోజుల పోలీస్ కస్టడీకి అనుమతించింది. కోర్టు ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం చంచల్‌గూడ జైలు నుంచి అతడిని అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు.

# నేటి నుండి హైదరాబాద్‌లో అంతర్జాతీయ షార్ట్ ఫిలిం ఫెస్టివల్

**హైదరాబాద్, డిసెంబరు 18, ప్రభాతవార్త :** హైదరాబాద్ వేదికగా ఇంటర్నేషనల్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ జరగనుంది. ఈ నెల 19వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఈ ఫెస్టివల్ జరగనున్నాయి. హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ ప్రపంచ వేదికగా ఎదిగింది. ప్రధానంగా ఈ ఫెస్టివల్‌కు యూరప్, అమెరికా వంటి దేశాల నుంచి సైతం సినిమాలు రావడం విశేషం. దాదాసాహెబ్ ఫాల్కే ఫిలిం స్కూల్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ నిర్వహించనున్నామని అంకురం చిత్ర దర్శకుడు ఉమా మహేశ్వర రావు తెలిపారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 705 షార్ట్ ఫిల్మ్స్ వచ్చాయని, వాటిలో 60 షార్ట్ ఫిల్ములు సెలెక్ట్ చేశామని చెప్పారు.

# మూడవ ప్రపంచ తెలుగు మహా సభలకు జస్టిస్ ఠాకూర్ కు ఆహ్వానం

## -ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు, డా.గజల్ శ్రీనివాస్

**విజయవాడ,డిసెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో 3,4,5 జనవరి 2026 లో శ్రీ సత్య సాయి స్పిరిచువల్ సిటీ ప్రాంగణంలో జరుగనున్న 3 వ ప్రపంచ తెలుగు మహా సభలకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ గారిని వారి కార్యాలయంలో కలసి 3 జనవరి 2026 ఉదయం 10 గంటలకు తెలుగు మహా సభల ప్రారంభోత్సవ సభకు ఆహ్వానించినట్లు పరిషత్తు అధ్యక్షులు డా.గజల్ శ్రీనివాస్ తెలిపారు. అలాగే జస్టిస్ మానవేంద్ర రాయ్, జస్టిస్ బి.కృష్ణ మోహన్ , జస్టిస్ చల్లా గుణరంజన్ లను కూడా కలసి ఆహ్వానించినట్లు డా.గజల్ శ్రీనివాస్ తెలిపారు.

## గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు గడువు పెంపు..

**విజయవాడ,డిసెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు స్పౌజ్ గ్రౌండ్ కారణాలతో ఇంటర్ డిస్టిక్ ట్రాన్స్ఫర్ దరఖాస్తుల గడువును 22 డిసెంబర్ 2025 వరకు పొడిగించారు.

..ఇప్పటికే దరఖాస్తు చేసినవారు, ఇంకా చేయని వారు ఈ పొడిగించిన గడువులోపు తమ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చునని సంబంధిత అధికార వర్గాలు తెలిపాయి.

# 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ' రూపశిల్పి రామ్ సుతార్ కన్నుమూత

## నోయిడాలో కుమారుడి నివాసంలో తుదిశ్వాస విడిచిన సుతార్

## రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ సహా పలువురు సంతాపం

**హైదరాబాద్, డిసెంబరు 18 ప్రభాతవార్త:** గుజరాత్‌లోని స్టాట్యూ ఆఫ్ యూనిటీ, హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహాల రూపశిల్పి పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాల గ్రహీత, ప్రఖ్యాత భారతీయ శిల్పి రామ్ వి. సుతార్ (100) కన్నుమూశారు. వయోభారంతో బాధపడుతున్న ఆయన నోయిడాలోని తన కుమారుడి నివాసంలో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గుజరాత్‌లోని ప్రపంచ ప్రసిద్ధ స్టాట్యూ ఆఫ్ యూనిటీ, హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై కొలువుదీరిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భారీ విగ్రహాలకు రూపకల్పన చేసింది రామ్ సుతార్ కావడం విశేషం. 1925 ఫిబ్రవరి 19న మహారాష్ట్రలోని గోందూర్ గ్రామంలో ఒక సాధారణ విశ్వకర్మ కుటుంబంలో రామ్ సుతార్ జన్మించారు. తన అద్భుతమైన ప్రతిభతో శిల్పకళా రంగంలో శిఖరాలను అధిరోహించారు. ఆయన రూపొందించిన అనేక కళాఖండాలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. ముఖ్యంగా గుజరాత్‌లోని నర్మదా నదీ తీరంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ గౌరవార్థం నిర్మించిన 182 మీటర్ల స్టాట్యూ ఆఫ్ యూనిటీ విగ్రహం ఆయనకు ప్రపంచవ్యాప్త ఖ్యాతిని తెచ్చిపెట్టింది. అదేవిధంగా, హైదరాబాద్ నగరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన 125 అడుగుల అంబేద్కర్ మహా విగ్రహాన్ని కూడా రామ్ సుతార్ తీర్చిదిద్దారు. శిల్పకళా రంగానికి ఆయన చేసిన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 1999లో పద్మశ్రీ, 2016లో పద్మభూషణ్ పురస్కారాలతో సత్కరించింది. ఆయన మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోడీ సహా పలువురు రాజకీయ, కళారంగ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# ఫిరాయింపు ఆధారాలు లేవనడం విడ్డూరం ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కెఎ పాల్

**హైదరాబాద్, డిసెంబరు 18, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో పార్టీ లోకి ఫిరాయించిన ఐదుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను ఆధారాలు లేవు అని స్పీకర్ తోసిపుచ్చడం విడ్డూరంగా ఉందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కెఎ పాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇది సిగ్గుచేటు.. స్పీకర్‌కు చట్టం తెలుసా? సుప్రీంకోర్టు మీద గౌరవం లేదా? అని పాల్ ప్రశ్నించారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరా యించినా పార్టీ ఫిరాయించలేదని స్పీకర్ నిర్ణయించడం షాక్‌కు గురి చేసిం దని, ఫిరాయింపు ఎమ్మెల్యేలపై తొలుత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

19-12pg10exHMNWJQE 12 GNT_19-12pg10exHMNWJQE.qxd 18/Dec/25 11:11 PM Page 1



# వరల్డ్ టెన్నిస్ లీగ్ స్వల్ప విజయాలతో రియాల్టీ హాక్స్, ఈగల్స్




**న్యూఢిల్లీ:** ప్రపంచ టెన్నిస్ లీగ్ 2025 లో భారత్ అరంగేట్రం అద్వితీయంగా ప్రారంభమైంది. తొలి రోజు విబి రియాల్టీ హాక్స్, ఎఓఎస్ ఈగల్స్ స్వల్ప విజయాలతో ప్రారంభమయ్యాయి. మాజీ యుఎస్ ఓపెన్ ఛాంపియన్ డేనియల్ మెద్వెదేవ్, భారత దిగ్గజం రోహన్ బోపన్నతో కలిసి పురుషుల డబుల్స్‌లో విజయం సాధించాడు. ఈ ఎడిషన్‌ను విబి రియాల్టీ హాక్స్ ఆస్ట్రేలియన్ మావెరిక్స్ కైట్స్‌పై 25-21 తేడాతో స్వల్ప విజయంతో ప్రారంభించిన తర్వాత, ఎఓఎస్ ఈగల్స్ గేమ్ ఛేంజర్స్ ఫాల్కన్స్‌పై 18-16 తేడాతో విజయం సాధించి ఆ రోజు మ్యాచ్‌ను ముగించింది. తొలి సెట్ ఆడిన స్విటోలినా తన ప్రత్యేక సంకల్పాన్ని ప్రదర్శించి 2-5 తేడాతో వెనుకబడి మార్తా కోస్ట్యుక్‌ను 7-5 తేడాతో ఓడించి హాక్స్‌కు విజయోత్సాహాన్ని అందించింది. ఆ తర్వాత ఉక్రేనియన్ క్రీడాకారిణి 16 ఏళ్ల మాయాతో కలిసి కోస్ట్యుక్-అంకిత రైనాలను ఒకే స్కోరుతో ఓడించింది. పురుషుల డబుల్స్‌లో కైట్స్ జట్టు ప్రతిఘటనను ప్రదర్శించింది. నిక్ కిర్గియోస్, సురేష్ షాపోవలోవ్ మరియు భాంబ్రీలపై 6-4 తేడాతో విజయం సాధించడానికి సర్వింగ్ మాస్టర్‌క్లాస్ ప్రదర్శించారు. సింగిల్స్‌లో షాపోవలోవ్ విజయాన్ని సాధించాడు. సురేష్‌ను 7-5 తేడాతో తన జట్టును ముందంజలో ఉంచాడు. ఈగల్స్, గేమ్ ఛేంజర్ ఫాల్కన్స్ మధ్య రెండో మ్యాచ్‌లో రోహన్ బోపన్న, సుమిత్ నాగల్ మధ్య పోరాటం హైలైట్‌గా నిలిచింది. నాగల్-పొలా బడోసా మిక్స్‌డ్ డబుల్స్ సెట్‌ను 6-1 తేడాతో గెలుచుకోగా, బోపన్న 6-2 తేడాతో అద్భుతమైన డబుల్స్ పోరులో విజయం సాధించాడు.

# వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో గెలిచిన సాయిరాజ్, శెట్టి



**న్యూఢిల్లీ:** వరల్డ్ టూర్ 2025 ఫైనల్స్‌లో పురుషుల డబుల్స్ మ్యాచ్ గెలిచిన తొలి భారతీయ జంటగా సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి-చిరాగ్ శెట్టి నిలిచారు. చైనాలో జరిగిన ఫైనల్స్‌లో భారత ఏస్ పురుషుల డబుల్స్ జోడీ సాయిరాజ్, శెట్టి విజయంతో తమ ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ జంట మూడు గేమ్‌ల హోరాహోరీ పోరులో స్వదేశీ ఫేవరెట్‌లు మరియు పారిస్ ఒలింపిక్ రజత పతక విజేతలు లియాంగ్ వీ కెంగ్-చాంగ్ వాంగ్ జోడీని 12-21, 22-20, 21-14 తేడాతో ఓడించారు. ఒక గేమ్ వెనుకబడి ఉన్నప్పటికీ పోరాడుతూ, సాయిరాజ్, శెట్టి చివరి గేమ్‌లో కొన్ని అద్భుతమైన అటాకింగ్ షాట్‌లను ప్రదర్శించి, వారి 11వ మ్యాచ్‌లో లియాంగ్‌వాంగ్‌పై వారి నాలుగో విజయాన్ని నమోదు చేశారు. తొలి గేమ్‌లో చైనా జంట ఫ్లాట్ ఎక్స్ఛేంజ్‌లతో తలపడటంతో భారత్ జోడీ మ్యాచ్‌ను పేలవంగా ప్రారంభించింది. మొదటి గేమ్‌ను కేవలం 12 నిమిషాల్లోనే ఓడిపోయిన వారు పెద్దగా పోరాడకుండానే పోటీ లేకుండా కనిపించారు. కానీ, రెండవ గేమ్‌లో అద్భుతంగా పునరాగమనం చేసి 18-12 ఆధిక్యాన్ని సంపాదించారు. అయితే, వారు మరోసారి చైనా ద్వయం చేతిలో 19-20తో వెనుకబడ్డారు. కానీ ఆ తర్వాత, భారత జంట తమ దాడిని ప్రారంభించి లియాంగ్-వాంగ్ పై ఒత్తిడిని తెచ్చింది. దీంతో చైనా జంట పట్టు సడలడంతో ఈసారి భారత జంట దానిని పూర్తిగా ఉపయోగించుకుని టోర్నమెంట్‌కు విజయవంతమైన ఆరంభంతో ముగించింది. ఫలితంగా భారత్ జంట గ్రూప్ ఎ లో మలేషియాకు చెందిన ఆరోన్ చియా-సోహ్ వూయియిక్ ద్వయంతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు.

## రోల్ బాల్ వరల్డ్ కప్..

# ప్రపంచ విజేతగా భారత్

**న్యూఢిల్లీ:** రోల్ బాల్ వరల్డ్ కప్-2025లో భారత పురుషుల, మహిళల జట్లు విజేతగా నిలిచాయి. 2023లో పూణేలో జరిగిన ప్రపంచకప్‌లో కెన్యా చేతిలో ఎదురైన ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. ఈసారి దుబాయ్ గడ్డపై భారత్ రెండు విభాగాల్లోనూ క్లీన్ స్వీప్ చేసింది. భారత మూలాలున్న ఈ క్రీడలో భారత్ జట్లు ప్రపంచ స్థాయి ఆధిపత్యాన్ని చెలాయించాయి. దుబాయ్ వేదికగా గురువారం జరిగిన ఈ టోర్నీ ఫైనల్లో భారత పురుషుల జట్టు 11-10 తేడాతో, మహిళల జట్టు 3-2 తేడాతో కెన్యా పురుషుల, మహిళల జట్లను ఓడించాయి. ఈ గెలుపుతో ప్రపంచకప్ టైటిల్స్‌ను ముద్దాడాయి. ఆసాంతం ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కెన్యా భారత పురుషుల జట్టుకు గట్టి పోటీనిచ్చింది. ఒక దశలో భారత్ వెనుకంజలో నిలిచినప్పటికీ, పుంజుకుని ఈ విజయాన్ని కైవసం చేసుకుంది. ఇది భారత పురుషుల జట్టుకు 5వ ప్రపంచకప్ టైటిల్. మహిళలకు మూడో ప్రపంచకప్ టైటిల్. భారత పురుషుల జట్టు విజయంలో రోహన్ దాభాడే, హితేష్ సింగ్, యష్ రాశియా, హర్షల్ ఘుగే కీలక పాత్ర పోషించాడు. ఈ మెగా ఈవెంట్‌లో భారత్, కెన్యా, పోలాండ్, అర్జెంటీనా, సౌదీ అరేబియా, పాకిస్థాన్ వంటి దేశాలు పాల్గొన్నాయి. కాగా రోలా బాల్ అనేది భారత్‌లో పుట్టి వినూత్నమైన క్రీడ. బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, రోలర్ స్కేటింగ్ కలిసిన ఆట. ప్రతి జట్టులో 12 మంది ఆటగాళ్ళు ఉంటారు. కానీ మైదానంలో ఒకేసారి 6 మంది మాత్రమే ఆడతారు. ఇందులో ఒక గోల్ కీపర్ ఉంటాడు.





# వేలం తర్వాత కెప్టెన్ల ఛేంజింగ్

## మూడు జట్లకు కొత్త వారికి ఛాన్స్

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 కోసం అన్ని జట్ల కెప్టెన్ల పేర్లు దాదాపు ఖరారయ్యాయి. మూడు జట్లకు కెప్టెన్లను మార్చేందుకు ఫ్రాంచైజీలు నిర్ణయించాయి. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు కెప్టెన్సీ మారనుంది. గత సీజన్‌లో అక్షర్ పటేల్, ఫాఫ్ డు ప్లెసిస్ సంయుక్తంగా కెప్టెన్లుగా వ్యవహరించారు. కానీ, ఈ సంవత్సరం ఫాఫ్ జట్టులో లేకపోవడంతో, అక్షర్‌ను కూడా పక్కన పెట్టే అవకాశం ఉంది. దీంతో వచ్చే సీజన్‌కు ఢిల్లీ తమ కెప్టెన్‌ను మార్చనుంది. కేఎల్ రాహుల్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ కొత్త కెప్టెన్‌గా నియమించే అవకాశం ఉంది. రాజస్థాన్ రాయల్స్ వచ్చే ఏడాది కొత్త కెప్టెన్ నేతృత్వంలో ఆడనుంది. వారి రెగ్యులర్ కెప్టెన్ సంజు శాంసన్ చెన్నై సూపర్ కింగ్స్‌లో చేరాడు. అతని నిష్క్రమణతో, జట్టు రియాన్ పరాగ్‌ను పూర్తి సమయం కెప్టెన్‌గా నియమించనుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ గత సీజన్‌ను అవమానకరంగా గడిపింది. పాట్ కమ్మిన్స్ కెప్టెన్సీలో, జట్టు బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ ఇబ్బంది పడింది. అయితే భారత్ మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ హైదరాబాద్‌లోకి వస్తాడని, అతనికే కెప్టెన్సీ ఇస్తారనే చర్చ జరుగుతోంది. ముంబై ఇండియన్స్ జట్టుకు హార్దిక్ పాండ్యా కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. గత సీజన్‌లో అతని కెప్టెన్సీలో జట్టు రెండవ క్వాలిఫయర్‌కు చేరుకుంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు రజత్ పాటిదార్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. జట్టు 18 ఏళ్ల నిరీక్షణ తర్వాత 2025లో తన తొలి ఐపీఎల్ టైటిల్‌ను పాటిదార్ అందించాడు. భారత వన్డే, టెస్ట్ కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ గుజరాత్ టైటాన్స్‌కు నాయకత్వం వహిస్తాడు. గిల్ కెప్టెన్సీలో, గుజరాత్ గత ఐపీఎల్‌లో ప్లేఆఫ్‌కు చేరుకుంది. శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్సీలో పంజాబ్ కింగ్స్ దశాబ్దం తర్వాత టైటిల్‌ను చేరుకుంది. కానీ ఫైనల్‌లో బెంగుళూరు చేతిలో స్వల్ప తేడాతో ఓడిపోయింది. లక్నో సూపర్ జెయింట్స్ వికెట్ కీపర్, బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్ వచ్చే ఏడాది జట్టుకు కెప్టెన్‌గా కొనసాగుతాడు. గత సీజన్‌లో రిషబ్ కెప్టెన్సీలో జట్టు ప్రదర్శన పేలవంగా ఉన్నా మరోసారి ఛాన్స్ ఇచ్చింది. చెన్నై సూపర్ కింగ్స్‌కు రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్‌గా కొనసాగుతాడు. సంజు సామ్సన్‌ను జట్టులోకి తీసుకున్నప్పటికీ, గైక్వాడ్ కెప్టెన్సీలో ఎల్లో ఆర్మీ అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. గత ఐపీఎల్‌లో అజింక్య రహానే కోల్‌కతా నైట్ రైడర్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. జట్టు ప్రదర్శన పేలవంగా ఉన్నా రహానే అద్భుతమైన బ్యాటింగ్ అతన్ని మళ్లీ కెప్టెన్‌గా నియమించాలని ఫ్రాంచైజీ నిర్ణయించింది.

# పోరాడుతున్న ఇంగ్లండ్

## 158 రన్స్ ఆధిక్యంలో ఆస్ట్రేలియా



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాతో జరుగుతున్న యాషెస్ మూడో టెస్టులో ఇంగ్లండ్ పోరాడుతోంది. ఈ ప్రతిష్టాత్మక సిరీస్‌లో ప్రస్తుతం ఆస్ట్రేలియా 158 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఆడిలైట్ వేదికగా రెండో రోజు గురువారం ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ జట్టు 8 వికెట్లు నష్టానికి 213 పరుగులు చేసింది. క్రీజులో కెప్టెన్ బెన్ స్టోక్స్ (45), జోఫ్రా ఆర్చర్ (30) ఉన్నారు. వీరిద్దరూ తొమ్మిదో వికెట్‌కు 45 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. ఇంగ్లండ్ బ్యాటర్ల పేలవ ప్రదర్శన కొనసాగుతుండటంతో ఇంకా 158 పరుగులు వెనుకబడి ఉంది. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో స్టోక్స్, అర్చర్‌తో పాటు, హ్యారీ బ్రూక్ (45), బెన్ డకెట్ (29) ఫర్వాలే దనిపించారు. వైస్ కెప్టెన పోప్ (3), క్రాలీ (9), రూట్ (19) తీవ్ర నిరాశపరిచారు. ఆస్ట్రేలియా బౌలర్లలో కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్ 3 వికెట్లు, లియోన్, బోలాండ్ తలా 2 వికెట్లు, గ్రీన్ మరో వికెట్ సాధించారు. అంతకు ముందు 326/8 ఓవర్ నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన ఆస్ట్రేలియా 371 పరుగులకు ఆలౌట్ అయింది. వికెట్ కీపర్ అలెక్స్ కేరీ (106) టాప్ స్కోరర్‌గా నిలవగా, ఖవాజా (82), స్టార్క్ (54) రాణించారు. కాగా ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌లో అలెక్స్ క్యారీ బ్యాటింగ్ చేస్తుండగా, బంతి స్పష్టంగా బ్యాట్‌కు తాకినప్పటికీ స్నికోమీటర్ సాంకేతిక లోపం వల్ల స్పైక్ రాలేదు. ఇంగ్లండ్ రివ్యూ తీసుకున్నప్పటికీ స్నికోమీటర్‌లో స్పైక్ చూపించకపోవడంతో థర్డ్ అంపైర్ నాటౌట్‌గా ప్రకటించాడు. అయితే ఈ విషయంపై ఐసీసీ సాంకేతిక లోపాన్ని అంగీకరిస్తూ ఇంగ్లండ్ కోల్పోయిన రివ్యూను తిరిగి ఇచ్చింది.



## వాణిజ్యం

# ఇకపై రైల్వే స్టేషన్లలో ఫ్రీ వైఫై సేవలు



**న్యూఢిల్లీ, డిసెంబరు 18:** రైలు ప్రయాణీకులకు రైల్వే శాఖ శుభవార్త చెప్పింది. దేశవ్యాప్తంగా అన్ని రైల్వే స్టేషన్లలో ఉచిత వైఫైని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటించింది. ప్రయాణీకులకు మెరుగైన సౌలభ్యం. సురక్షితమైన ప్రయాణ అనుభవాన్ని అందించేందుకు డిజిటల్, భద్రతా మౌలిక సదుపాయాలు రెండింటినీ నిరంతరం బలోపేతం చేస్తున్నామని రైల్వేమంత్రిత్వశాఖ స్పష్టం చేసింది. ఇప్పటికే ఉన్న వనరులను ఉపయోగించి, పార్టనర్‌షిప్ మోడల్‌లో రైల్వేస్టేషన్లలో వై ఫై సేవలను ప్రారంభించారు. వెయిటింగ్‌లో ప్రయాణీకులకు ఇంటర్నెట్ సదుపాయం కల్పించడం, డిజిటల్ ఇండియా ప్రచారాన్ని బలోపేతం చేయడమే దీని ఉద్దేశం.

ఈ సౌకర్యం పెద్ద సంఖ్యలో ప్రయాణీకులకు స్టేషన్‌లో టికెట్ బుకింగ్, ప్రయాణ సమాచారం, ఇతర ఆన్‌లైన్ సేవలను సులభంగా యాక్సెస్ చేయడానికి వీలు కల్పిస్తుంది. రైల్వే స్టేషన్లలో వైఫైని యాక్సెస్ చేయడానికి, ప్రయాణీకులు తమ మొబైల్ నంబర్ ద్వారా ఓటీపీని నమోదు చేయాల్సి ఉంటుందని మంత్రిత్వశాఖ స్పష్టం చేసింది. గుర్తింపు రుజువు, ఈమెయిల్ తదితర వ్యక్తిగత సమాచారం ఏమీ అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ వ్యవస్థలో ప్రయాణీకుల గోప్యత, డేటా భద్రతను నిర్ధారించనున్నట్లు తెలిపింది.




# ఆర్‌బిఐ రెపోరేటు తగ్గింపు

## వడ్డీ రేట్లు తగ్గించిన కెనరా బ్యాంక్

## ఎఫ్‌డీపైనా కొత్త వడ్డీ రేట్లు

## అమల్లోకి వచ్చిన సవరణ రేట్లు

**ముంబై, డిసెంబరు 18:** ఆర్‌బిఐ రెపోరేటు తగ్గించిన నేపథ్యంలో ఆయా బ్యాంకులు వడ్డీ రేట్లు తగ్గిసున్నాయి. ఇదే సమయంలో ఫిక్స్‌డ్ డిపాజిట్లపైనా వడ్డీ రేట్లను సవరిస్తున్నాయి. ఇప్పటికే ఎస్‌బిఐ, ఐడిబిఐ బ్యాంకులు వడ్డీ రేట్లను సవరించగా, తాజాగే కెనరా బ్యాంకు కూడా కీలక రుణ రేట్లు సహా ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లను సవరించింది. దీంతో ఈ ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్ లింక్డ్ లోన్లపై వడ్డీ రేట్లు తగ్గుతాయి. కొత్తగా లోన్లు తీసుకునే వారికి తక్కువ వడ్డీకే లోన్లు వస్తాయి. ఇంకా ఫ్లోటింగ్ రేటుపై గతంలో లోన్ తీసుకున్న వారికి లోన్ ఈఎంఐ తగ్గుతుంది లేదా టెన్యూర్ తగ్గించుకోవచ్చు. ఇక ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లు తగ్గితే.. గతంలో టెన్యూర్ల కంటే ఇప్పుడు రాబడి తక్కువగా వస్తుంది.


కెనరా బ్యాంకులో ఇప్పుడు ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్ 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఆర్బీఐ తగ్గించినట్లుగానే పూర్తి స్థాయిలో 25 బేసిస్ పాయింట్ల కోత విధించింది. దీంతో గతంలో ఇది 8.25 శాతంగా ఉండగా.. ఇప్పుడు 8 శాతానికి చేరింది. ఈ కొత్త రుణ రేట్లు 2025, డిసెంబర్ 12 నుంచే అమల్లోకి వచ్చాయి. అయితే బ్యాంక్.. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లను (ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్) మార్చలేదు. ఎంసీఎల్‌ఆర్ విషయానికి వస్తే ఓవర్‌నైట్ ఎంసీఎల్‌ఆర్ 7.90 శాతంగా ఉండగా.. ఒక నెల, 3 నెలల ఎంసీఎల్‌ఆర్ వరుసగా 7.95, 8.15 శాతంగా ఉంది. 6 నెలల ఎంసీఎల్‌ఆర్ రేటు 8.50 శాతం, ఏడాది టెన్యూర్ ఎంసీఎల్‌ఆర్ 8.70 శాతంగా, రెండేళ్ల ఎంసీఎల్‌ఆర్ 8.85 శాతంగా ఉంది. మూడేళ్ల ఎంసీఎల్‌ఆర్ 8.90 శాతంగా ఉంది. ఇక ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్ల విషయానికి వస్తే రూ.3 కోట్లకు లోబడిన డిపాజిట్ వడ్డీ రేట్లు సవరించింది. కొత్త వడ్డీ రేట్లు డిసెంబర్ 8 నుంచి అమల్లోకి వచ్చాయి. సవరించిన తర్వాత అత్యధికంగా 555 రోజుల టెన్యూర్ డిపాజిట్‌పై సాధారణ ప్రజలకు 6.15 శాతం వడ్డీ అందిస్తుంది. 444 రోజుల డిపాజిట్లపై వీరికి 6 శాతం వడ్డీ రేటు ఉంది. సీనియర్ సిటిజెన్లకు వీరి కంటే 50 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ అధికంగా వస్తుంది. ఇక్కడ అంతకుముందుతో పోలిస్తే వడ్డీ రేట్లు తగ్గాయి. గతంలో 444 రోజుల ఎఫ్‌డీపైనే వడ్డీ ఎక్కువగా ఉండేది.

# కష్టకాలం ముగిసింది..: ఇండిగో సిఇఒ పీటర్ ఎల్బర్స్

**కోల్‌కతా, డిసెంబరు 18:** దేశీయ విమానయాన సంస్థ ఇండిగో కార్యకలాపాలు తిరిగి సాధారణ స్థితికి చేరుకున్నాయని, సంస్థ ఎదుర్కొన్న కష్టకాలం ముగిసిందని ఆ సంస్థ సిఇఒ పీటర్ ఎల్బర్స్ గురువారం ప్రకటించారు. ప్రస్తుతం రోజుకు 2,200 విమాన సర్వీసులను పునరుద్ధరించినట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు ఓ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇటీవల విమాన సర్వీసుల్లో ఏర్పడిన అంతరాయాల నుంచి సంస్థ పూర్తిగా కోలుకుందని స్పష్టం చేశారు. ఈ క్లిష్ట సమయంలో ఇండిగో బృందాలు ఐక్యంగా నిలిచి, కార్యకలాపాలను తిరిగి గాడిలో పెట్టేందుకు ఎంతో కృషి చేశాయని పీటర్ ఎల్బర్స్ ప్రశంసించారు. పైలట్లు, క్యాబిన్ సిబ్బంది, ఎయిర్‌పోర్ట్ సిబ్బంది, కస్టమర్ సర్వీస్ విభాగంతో పాటు ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఇంత తక్కువ సమయంలో సమస్యను అధిగమించడం తమ బృంద స్ఫూర్తికి నిదర్శనమని అన్నారు.

# ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు

## వరుసగా నాలుగో రోజూ నష్టాల్లోకి జారుకున్న సెన్సెక్స్.. ఐటి షేర్లు



**ముంబయి, డిసెంబరు 18:** అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు, అమెరికా మార్కెట్లలో నష్టాలు, ఆసియాలోని ఇతర దేశాల మార్కెట్లు కూడా నష్టాల్లోనే ఉండడం దేశీయ సూచీలకు నెగిటివ్‌గా మారింది. దీంతో దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం ట్రేడింగ్‌ను ఫ్లాట్‌గా ముగించాయి. రోజంతా తీవ్ర ఒడుదొడు కులకు లోనైన సూచీలు, చివరికి స్వల్ప నష్టాలతో సరిపెట్టుకున్నాయి. రోజంతా లాభాల్లో కదలాడిన మార్కెట్లు చివరకు నష్టాలతోనే ముగిశాయి. అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు, అమెరికా మార్కెట్ల లో నష్టాలు, ఆసియాలోని ఇతర దేశాల మార్కెట్లు కూడా నష్టాల్లోనే ఉండడం దేశీయ సూచీలకు నెగిటివ్‌గా మారింది. దీంతో వరుసగా నాలుగో రోజు కూడా సూచీలు నష్టాలతోనే ముగిశాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప నష్టాలను మూటగట్టుకున్నాయి. ఐటీ షేర్లలో బలమైన కొనుగోళ్లు కనిపించినప్పటికీ.. ఆటో, మెటల్, ఫార్మా రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి మార్కెట్లను కిందకు లాగింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 78 పాయింట్లు నష్టపోయి 84,482 వద్ద స్థిరపడింది. దీంతో సెన్సెక్స్ వరుసగా నాలుగో రోజు కూడా నష్టాల్లో ముగిసినట్లయింది. ఈ నాలుగు రోజుల్లో సూచీ సుమారు 785 పాయింట్లు కోల్పోయింది. మరోవైపు, ఎన్ఎస్ఈ నిఫ్టీ కేవలం 3 పాయింట్ల స్వల్ప నష్టంతో 24,815.55 వద్ద ముగిసింది. ట్రేడింగ్ సమయంలో సెన్సెక్స్ 542 పాయింట్ల పరిధిలో కదలాడింది. ఒక దశలో 84,238 కనిష్ఠ స్థాయికి పడిపోయి, ఆ తర్వాత 84,780 గరిష్ఠ స్థాయికి చేరింది. సెన్సెక్స్ షేర్లలో టీసీఎస్ దాదాపు 2 శాతం లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్ 1.7 శాతం చొప్పున లాభపడ్డాయి. అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, యాక్సిస్ బ్యాంక్ కూడా లాభాల్లో ముగిశాయి. మరోవైపు, సన్ ఫార్మా షేరు 2.7 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. కంపెనీకి చెందిన బస్కా ప్లాంట్‌పై యూఎస్ డ్రగ్ రెగ్యులేటర్ ప్రతికూల నివేదిక ఇవ్వడం ఇందుకు కారణమైంది. టాటా స్టీల్, పవర్ గ్రిడ్, ఏషియన్ పెయింట్స్, ఎల్ టీ, ఎన్టీపీసీ షేర్లు కూడా నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే ఐటీ ఇండెక్స్ 1 శాతానికి పైగా లాభపడగా, పవర్ సెక్టార్ 1 శాతం, ఆటో రంగం 0.5 శాతం నష్టపోయాయి. ఇక అమెరికా ద్రవ్యోల్బణం, నిరుద్యోగ గణాంకాలు, ఇతర అంతర్జాతీయ కేంద్ర బ్యాంకుల వడ్డీ రేట్ల నిర్ణయాల కోసం మదుపరులు వేచి చూస్తున్నారని విశ్లేషకులు తెలిపారు. నిఫ్టీకి 25,700 వద్ద మద్దతు, 25,900 వద్ద నిరోధం ఉందని అంచనా వేస్తున్నారు.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14